ప్రపంచానిక ఆఖరు ఘడియలు
రూ॥140/- పేజీలు:154

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
PRAJAPAKSHAM ★★

భారత్‌– అమెరికా వాణిజ్య ఒప్పందం వ్యతిరేకిస్తూ రైతుల మోటార్‌సైకిల్ ర్యాలీ
వాంగ్‌చుక్ నిరాహారదీక్షను విస్మరించడం క్రూరం
బిజెపితో రహస్య చర్చలేమీ లేవు : సుప్రియా సూలే
07

సంపుటి 09, సంచిక: 226 | గురువారం | 16-07-2026 | కరీంనగర్ Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00

## రాష్ట్రంలో 'సర్' గడువు పొడిగింపు



- ఆగస్టు 3 వరకు ఇంటింటి సర్వే
- అక్టోబర్ 12న తుది ఓటర్ల జాబితా విడుదల

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ గడువును కేంద్ర ఎన్నికల సంఘం పొడిగించింది. ఈ మేరకు సవరించిన నూతన షెడ్యూల్‌ను బుధవారం ఈసి అధికారికంగా విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు సానుకూలంగా స్పందించిన ఎన్నికల సంఘం, ఓటర్ల నమోదు, సవరణల ప్రక్రియను మరింత సులభతరం చేసేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. తాజా ఉత్తర్వుల ప్రకారం బూత్ స్థాయి అధికారుల ఇంటింటి సర్వే గడువును ఆగస్టు 3 వరకు పొడిగించారు. నూతన తరువాయి 8లో

## పేర్ల తొలగింపునకే...

- 'సర్' ప్రక్రియపై మాజీ సిఇసి ఎస్‌వై ఖురేషీ తీవ్ర అసహనం
- స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలకు ఆటంకం కలిగి ప్రజాస్వామ్యానికి తీవ్ర ముప్పు వాటిల్లిందని విమర్శ



**న్యూఢిల్లీ :** కేంద్ర ఎన్నికల సంఘం చేపడుతున్న 'సర్' ప్రక్రియపై మాజీ సిఇసి ఎస్‌వై ఖురేషీ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఈ ప్రక్రియ ప్రధానంగా ఓటర్ జాబితాలో పేర్ల తొలగింపు పైనే దృష్టి సారిస్తోందని ఆరోపించారు. సర్ వల్ల స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలకు ఆటంకం కలిగి ప్రజాస్వామ్యానికి తీవ్ర ముప్పు వాటిల్లిందని విమర్శించారు. వీలైనన్ని ఎక్కువ పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగిస్తున్నారని మండిపడ్డారు. ప్రస్తుతం జరుగుతున్న ప్రక్రియలో తొలగింపులకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని విమర్శించారు. ఓటరుగా నమోదు చేసుకోవడమనేది ఒక రాజ్యాంగపరమైన హక్కు అని, కానీ ఎన్నికల సంఘం ప్రజలకు ఏదో ఉపకారం చేస్తోందన్నట్లుగా పరిస్థితిని సృష్టిస్తోందని పిటిఐ వీడియోస్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఖురేషీ వ్యాఖ్యానించారు. ఓటర్ల జాబితా సవరణ కోసం చేపట్టిన ఈ ప్రత్యేక ప్రక్రియ (సర్) జరుగుతున్న తీరు అన్యాయంగా ఉందని మాజీ సిఇసి ఖురేషీ అన్నారు. 'ఎస్‌ఐఆర్ ప్రధానంగా ఓటర్ల పేర్ల తొలగింపుపైనే దృష్టి పెడుతోంది. ఓటర్ జాబితా నుంచి ఎంత మంది పేర్లను తొలగించగలమన్నదే వారి ప్రధాన ధ్యాసగా కనిపిస్తోంది. అయితే ప్రస్తుత ఎస్‌ఐఆర్ ప్రక్రియలో పాల్గొంటున్న సిబ్బందికి నాదొక సూచన. ఓటరు పేరు స్పెల్లింగ్, వయసు, అడ్రస్‌లో చిన్నపాటి తప్పులు ఉన్నప్పటికీ వారు సరైన వ్యక్తేనని మీకు తెలిస్తే ఆ తప్పులను పట్టించుకోవద్దు. తద్వారా ఏ ఒక్క ఓటరు కూడా తన ఓటు హక్కును కోల్పోకుండా చూడాలి. ఓటర్ జాబితా నుంచి వీలైనన్ని ఎక్కువ పేర్లను తొలగిస్తే మంచి మార్కులు వస్తాయన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. కోట్లాది మంది పేర్లను ఓటర్ జాబితా నుంచి తొలగించడంతో స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలకు ఆటంకం కలిగింది.' అని ఖురేషీ పేర్కొన్నారు. 'నేను సిఇసిగా ఉన్నప్పుడు ఎస్‌ఐఆర్ ప్రక్రియ చాలా స్పష్టంగా ఉండేది. ప్రతి ఏటా ఓటరు జాబితాను సవరించే ప్రక్రియను చేపట్టేవాళ్లం. 2002–2003లో బిహార్‌లో చివరిసారిగా ఎస్‌ఐఆర్ చేపట్టిన తర్వాత, ఓటర్ల జాబితాలు కంప్యూటరైజ్డ్ అయ్యాయి. దీంతో ఇకపై తరువాయి 8లో



భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి

## అమెజాన్ డేటా సెంటర్ తొలిమెట్టు

- లక్ష్యం నెరవేరాలంటే పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, ఉద్యోగ అవకాశాల కల్పన అవసరం
- ఫ్యూచర్ సిటీలో ప్రపంచంలోనే ఫార్చ్యూన్ 500 కంపెనీల పెట్టుబడులను ఆహ్వానించాలని నిర్దేశించుకున్నాం
- హైదరాబాద్‌ను కాలుష్యరహిత సుస్థిర మహానగరంగా తీర్చిదిద్దేందుకు ప్రోత్సాహకాలిస్తున్నాం
- డేటా సెంటర్ శంకుస్థాపనలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్/రంగారెడ్డి

దేశంలో 2.5 శాతం జనాభా ఉన్న తెలంగాణ ప్రస్తుతం దేశ జిడిపికి 5 శాతం మేరకు తోడ్పాటును అందిస్తోంది. 2047 నాటికి 10 శాతం మేరకు అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యం' అని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి వివరించారు. లక్ష్యం నెరవేరాలంటే అందుకు పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, ఉద్యోగావకాశాల కల్పన అవసరమని, ఆ దిశగా లక్ష్యాలను నిర్దేశించుకుని తెలంగాణ రైజింగ్–2047 విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించామని, ఈ విజన్ రూపకల్పనలో ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌తో పాటు జాతీయ, అంతర్జాతీయ నిపుణుల సహకారం తీసుకున్నామని ముఖ్యమంత్రి వివరించారు. 'తెలంగాణ రైజింగ్–2047 విజన్'లో భాగంగా 2034 నాటికి నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకునే దిశగా తెలంగాణ ప్రయాణం ప్రారంభమైందని ప్రకటించారు. ప్రపంచంలోనే ఒక అద్భుతమైన నగరంగా భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మించాలన్న సంకల్పానికి అమెజాన్ నెలకొల్పుతున్న డేటా సెంటర్ తొలి మెట్టుగా నిలుస్తుందని పేర్కొన్నారు. దేశంలోనే ఒక అభివృద్ధి చెందిన మోడల్ రాష్ట్రంగా తెలంగాణను నిలబెట్టడంలో అమెజాన్ భాగస్వామిగా నిలిచి 2034 నాటికి లక్ష కోట్ల రూపాయల తరువాయి 8లో

వేర్‌హౌస్ సామర్థ్యం మరో 5 లక్షల మెట్రిక్ టన్నులు పెంపు 03
ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కార్మికులే వెన్నెముక 03
బలమైన భవిష్యత్తుకు బాల్యమే పునాది 03

## మరో తొమ్మిది యూరియా ప్లాంట్లు



- కోటి టన్నుల ఉత్పత్తికి జాతీయ పెట్టుబడుల విధానం
- దిగుమతులపై ఆధారపడకుండా ఇక పూర్తి స్వయం సమృద్ధి
- సెమీకండక్టర్లు,సొంత మొబైల్ బ్రాండ్ల అభివృద్ధికి రూ.1.90 లక్షల కోట్లు
- రూ.25,500 కోట్లతో వారణాసికి రెండు హైవే ప్రాజెక్టులు
- కేంద్ర మంత్రివర్గం తీర్మానాలు

**న్యూఢిల్లీ :** దేశ రైతులు అత్యధికంగా ఉపయోగించే యూరియా ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించడంకోసం ఒక కొత్త జాతీయ పెట్టుబడుల విధానానికి (ఎన్‌ఐపి) కేంద్రమంత్రివర్గం బుధవారం ఆమోదం తెలియజేసింది. దీనివల్ల యూరియా దిగుమతులపై ఆధారపడకుండా దేశం పూర్తి స్వయంసమృద్ధి సాధిస్తుంది. అదేవిధంగా దేశంలో రెండో విడత సెమీకండక్టర్ల వ్యవస్థను విస్తరించడం, దేశీయ భారత్ మొబైల్ ఫోన్ బ్రాండ్ల ఉత్పత్తులు విడుదల చేయడం ద్వారా ప్రపంచ ఎలక్ట్రానిక్స్ కేంద్రంగా భారత్ స్థానాన్ని సుస్థిరం చేసేందుకు రూ.1.90 లక్షల కోట్లతో రెండు కార్యక్రమాలు చేపట్టేందుకు కూడా కేంద్రమంత్రివర్గం ఆమోద ముద్రలు వేసింది. ఇండియా సెమీకండక్టర్ మిషన్ (ఐఎస్‌ఎం–1.0)కు కొనసాగింపుగా తాజా నిర్ణయం ద్వారా 2.0 సెమీకండక్టర్ కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళతారు. అదేవిధంగా భారత్ మొబైల్ బ్రాండ్ల ఉత్పత్తి పథకం కింద 2030–31 నాటికి 60,000 ప్రత్యక్ష ఉద్యోగాల సృష్టితోపాటు 15 లక్షల కోట్ల ఎగుమతులను దేశం సాధిస్తుంది. కాగా దేశంలో యూరియా స్వయంసమృద్ధి తరువాయి 8లో

బిఐఇ రిజిస్ట్రేషన్, అఫిలియేషన్

## ఇక కఠినం

- జూనియర్ కళాశాలలు దరఖాస్తుల బాధ్యత ఇంటర్ విద్యాధికారులదే
- ఇప్పటికీ దరఖాస్తు చేసుకోకుండా నిబంధనలు ఉల్లంఘించిన కళాశాలలకు నోటీసులు
- ప్రత్యేక కోర్సులు నిర్వహించే కళాశాలలకు నోటీసులు, జరిమానా

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రైవేటు జూనియర్ కళాశాలల అనుబంధ గుర్తింపు (ఇంటర్మీడియట్ బోర్డ్ అఫిలియేషన్) పక్రియపైన ఇంటర్మీడియట్ బోర్డ్ ప్రత్యేక దృష్టి కేంద్రీ కరించింది. ఇక నుంచి జూనియర్ కళాశాలలకు ఇంటర్ బోర్డ్ (బిఐఇ) రిజిస్ట్రేషన్, అఫిలియేషన్ విషయంలో కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించింది. రిజిస్ట్రేషన్, అఫిలియేషన్ విషయంలో ఇక నుంచి జిల్లా ఇంటర్ విద్యాధికారులను బాధ్యులను చేయనున్నారు. దరఖాస్తు చేసుకునే బాధ్యతను కేవలం కళాశాలకే వదిలేయకుండా, జిల్లా పరిధిలో ఉన్న అన్ని కళాశాలలు దరఖాస్తులు చేసుకునేలా జిల్లాకు చెందిన ఇంటర్ విద్యా అధికారులే బాధ్యత వహించాలని ఇంటర్ బోర్డ్ నిర్ణయించింది. ఈ నెలాఖరు (జులై ) వరకు అనుబంధ గుర్తింపు పక్రియను పూర్తి చేయాలని ఇంటర్మీడియట్ బోర్డ్ నిర్ణయించింది. రాష్ట్రంలో ఇంటర్ బోర్డ్‌కు రిజిస్ట్రేషన్ కూడా చేసుకోని ప్రైవేటు జూనియర్ కళాశాలలు కూడా ఉన్నట్టు అధికారులు గుర్తించారు. ఇలాంటి కళాశాలల పట్ల కొంత కఠినంగానే వ్యవహారించాలని, గుర్తింపు, అఫిలియేషన్ విషయంలో జాప్యం చేయకుండా ఒక కాలపరిమితిలోపు ఈ ప్రక్రియను పూర్తి చేయాలని ఇంటర్ బోర్డ్ కార్యదర్శి అభిలాష అభినవ్ నిర్ణయించినట్టు తెలిసింది. ఇందులో భాగంగానే ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న తరువాయి 8లో

సిబిఎస్‌ఇ డిజిటల్ మార్కింగ్ విధానంపై

## విద్యార్థులలో నైరాశ్యం పట్ల 'సుప్రీం' ఆందోళన

**న్యూఢిల్లీ :** సిబిఎస్‌ఇ డిజిటల్ మార్కింగ్ విధానంపై విద్యార్థులలో నెలకొన్న 'నైరాశ్యం' పట్ల సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఆన్ స్క్రీన్ మార్కింగ్ (ఒఎస్‌ఎం) విధానం ద్వారా పరీక్షలు నిర్వహించేందుకు నిబంధనలు రూపొందించడానికి కేంద్రానికి, సిబిఎస్‌ఇకి ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం (పిఐఎల్) విచారణలో బుధవారం సుప్రీంకోర్టు సొలిసిటర్ జనరల్ (ఎస్‌జి) తుషార్ మెహతా సహాయాన్ని కోరింది. సిబిఎస్‌ఇ యొక్క ఒఎస్‌ఎం మూల్యాంకన వ్యవస్థ అనేది ఒక డిజిటల్ గ్రేడింగ్ విధానం. ఇందులో ఉపాధ్యాయులు భౌతిక జవాబు పత్రాలను నేరుగా పరిశీలించడానికి బదులుగా కంప్యూటర్ ద్వారా వాటిని స్కాన్ చేసిన ప్రతులను పరిశీలించి మూల్యాంకనం చేస్తారు. 'చిన్న పిల్లల్లో తరువాయి 12లో

నిర్మల్, మంచిర్యాల జిల్లాల్లో

## దారుణ హత్యలు



- ఇద్దరు వ్యక్తులు దుర్మరణం
- కత్తులు, గొడ్డళ్లతో కిరాతకంగా నరికి నిందితులు పరార్

ప్రజాపక్షం/నిర్మల్ / రెబ్బన

రాష్ట్రంలో దారుణ హత్యల సంస్కృతి ప్రజలను భయభ్రాంతులను చేస్తోంది. నిర్మల్, మంచిర్యాల జిల్లాల్లో జరిగిన దారుణ హత్యల్లో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం చెందారు. 24 గంటల వ్యవధిలోపు జరిగిన ఈ హత్యలు రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశం అయ్యాయి. పోలీసులు, స్థానికులు వెల్లడించిన వివరాలలోకి వెళితే...బుధవారం నిర్మల్ జిల్లా కేంద్రంలో పట్టపగలే అత్యంత దారుణమైన హత్య ఉదంతం చోటుచేసుకుంది. ఒక యువకుడిని ముగ్గురు దుండగులు బహిరంగంగా కత్తులతో పొడిచి దారుణంగా హత్య చేయడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.నిర్మల్ పట్టణంలోని విశ్వనాథ్‌పేట్ వైఎస్‌ఆర్ నగర్ కాలనీకి చెందిన అస్లం (23) అనే యువకుడు బుధవారం ఆటోలో వెళ్తుండగా, ముగ్గురు వ్యక్తులు ఒక వాహనంలో తరువాయి 12లో

విద్యాసంస్థల్లో డ్రగ్స్‌కు

## జీరో టాలరెన్స్



- ఉల్లంఘిస్తే గుర్తింపు రద్దు చేస్తాం
- డిజిపి సివి. ఆనంద్ హెచ్చరిక
- ప్రతీ విద్యాసంస్థలో సేఫ్టీ కోఆర్డినేటర్‌ను నియమించాలని సూచన

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణలోని అన్ని విద్యాసంస్థలను పూర్తిస్థాయిలో డ్రగ్స్ రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు చేపడుతోందని రాష్ట్ర డిజిపి సివి ఆనంద్ తెలిపారు. విద్యార్థుల భద్రత, శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని విద్యాసంస్థల్లో డ్రగ్స్‌కు 'జీరో టాలరెన్స్ పాలసీ' అమలు చేయనున్నట్లు స్పష్టం చేశారు. డ్రగ్స్ కార్యకలాపాలను ప్రోత్సహించినా, పట్టించుకోకపోయినా సంబంధిత విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైతే వాటి గుర్తింపు రద్దుకు ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామని హెచ్చరించారు. తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో అధికారులతో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో డిజిపి కీలక ఆదేశాలు జారీ చేశారు. దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే విద్యాసంస్థల్లో మాదకద్రవ్యాలకు ఎలాంటి స్థానం ఉండకూడదని, విద్యార్థులను డ్రగ్స్ బారిన పడకుండా రక్షించేందుకు సమగ్ర భద్రతా వ్యవస్థను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని తరువాయి 8లో



మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

సీతమ్మసాగర్ పర్యావరణ అనుమతులకు

## కేంద్రంతో నిరంతర సంప్రదింపులు

ప్రజాపక్షం/హైదరాబాద్

సీతమ్మసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు త్వరగా లభించేలా కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సీతారామ ఎత్తిపోతల పథకం, సీతమ్మసాగర్ ప్రాజెక్టుల పెండింగ్ సమస్యల పరిష్కారంపై నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో కలిసి సమీక్షించారు.బుధవారం సచివాలయంలో జరిగిన సమావేశంలో రెండు ప్రాజెక్టులకు సంబంధించిన అనుమతులు, నిర్మాణ పనుల పురోగతి, భూసేకరణ, సాంకేతిక అంశాలపై ఇరువురు మంత్రులు చర్చించారు. సీతమ్మసాగర్ ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతుల అంశం సుప్రీంకోర్టు పరిధిలో పెండింగ్‌లో ఉండటంతో 2023 మార్చి నుంచి పనులు నిలిచిపోయాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వంలోని సంబంధిత మంత్రిత్వ శాఖలు, అధికారులతో సమన్వయం చేసుకుని పర్యావరణ అనుమతులు సాధిస్తామని, అనుమతులు వచ్చిన వెంటనే పనులు పునఃప్రారంభిస్తామని మంత్రి తెలిపారు. ప్రాజెక్టు పూర్తయితే ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని వేలాది ఎకరాలకు సాగునీరు అందుతుందని పేర్కొన్నారు. సీతారామ ఎత్తిపోతల పథకంలోని పంప్‌హౌస్–1, పంప్ హౌస్2 మధ్య దోమలవాగుపై ప్రస్తుతం ఉన్న 0.20 టిఎంసిల నీటి నిల్వ సామర్థ్యాన్ని 0.50 టిఎంసిలకు పెంచడం, సీతారామ ప్రధాన కాలువపై పంప్‌హౌస్–1, 2, 3 మధ్య అవసరమైన ప్రాంతాల్లో ఎస్కేప్ రెగ్యులేటర్ల ఏర్పాటు చేయడం ద్వారా వర్షాకాలంలో అధిక వరద ప్రవాహాన్ని నియంత్రణతో పాటు కాలువలకు నష్టం వాటిల్లకుండ ఉపయోగపడతాయని తెలిపారు. సత్తుపల్లి ట్రంక్ కాలువలోని యాతలకుంట సొరంగం తవ్వకం పూర్తయిందని, తరువాయి 12లో



క్యూబాపై ఆంక్షలు


## తక్షణం ఎత్తివేయాలి

చైనా విదేశాంగశాఖ డిమాండ్

**బీజింగ్ :** క్యూబా జాతీయ సార్వభౌమాధికార హక్కులకు చైనా గట్టి మద్దతు తెలియజేసింది. ఆ దేశంలో విదేశీ జోక్యాన్ని చైనా తీవ్రంగా వ్యతిరేకిస్తోందని చైనా విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రతినిధి లిన్ జియాన్ చెప్పారు. అంతర్జాతీయ సమాజం విజ్ఞప్తులను మన్నించి ఆ దేశంపై ఆంక్షలను తక్షణం ఎత్తివేయాలని కోరారు. అంతర్జాతీయంగా ఉండాల్సిన నిష్పక్షపాతాన్ని, న్యాయాన్ని అమలు చేసేందుకు ఈ విషయంలో ప్రపంచదేశాలతో తరువాయి 12లో

# ఆహార ద్రవ్యోల్బణం.. ప్రమాదకరం..

ద్రవ్యోల్బణం అనేది ఆర్థికశాస్త్రంలో కనిపించే ఒక గణాంకం. అంతకు మించి, సామాన్య ప్రజల జీవితాలను నిశ్శబ్దంగా కుదిపేసే సామాజిక, ఆర్థిక వాస్తవం. ప్రభుత్వం విడుదల చేసే ద్రవ్యోల్బణ శాతాలు, ధరల సూచీలు, గణాంక నివేదికలు సాధారణంగా నిపుణుల చర్చలకే పరిమితమైన అంశాలుగా కనిపించినప్పటికీ, వాటి అసలు ప్రభావం ప్రతి ఇంటిలోనూ ఉంటుంది. గత నెల టోకు ధరల ద్రవ్యోల్బణం 9.87 శాతానికి పెరగడం, 2024 ఏప్రిల్ నుంచి అమలులో ఉన్న ప్రస్తుత శ్రేణిలో ఇదే అత్యధిక స్థాయికి చేరుకోవడం భారత ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న ఒత్తిడిని స్పష్టం చేస్తున్నది. అంతకుముందు మే నెలలో ఇది 9.68 శాతంగా ఉండగా, ఒక్క నెలలోనే మరింత పెరగడం ఆహార ధరల అసాధారణ పెరుగుదల ఎంత తీవ్రంగా ఉందో సూచిస్తోంది. అదే సమయంలో గృహ వినియోగదారులు ఎదుర్కొనే చిల్లర ద్రవ్యోల్బణం కూడా నాలుగున్నర శాతానికి చేరుకోవడంలో పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారింది. ఈ పెరుగుదలకు ప్రధాన కారణం ఆహార ధరలు. మునగకాయ ధరలు ఒక్క నెలలోనే దాదాపు రెట్టింపు కావడం, క్యాప్సికం, టమాటా, ఉల్లిపాయ వంటి ప్రతి కుటుంబం నిత్యం వినియోగించే కూరగాయల ధరలు ఆకాశానికి చేరడం సామాన్య ప్రజలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. ఇవి విలాసవంతమైన వస్తువులు కావు. రోజువారీ ఆహారంలో తప్పనిసరిగా ఉపయోగించేవి. అందువల్ల వీటి ధరల పెరుగుదల నేరుగా ప్రతి కుటుంబ ఆహార వ్యయాన్ని పెంచుతుంది. ముఖ్యంగా స్థిరమైన ఆదాయం లేని అసంఘటిత రంగ కార్మికులు, వ్యవసాయ కూలీలు, చిన్న ఉద్యోగులు, పెన్షనర్లు, పట్టణ పేదలు ఈ భారం నుంచి తప్పించుకునే పరిస్థితి ఉండదు. ఆహార ద్రవ్యోల్బణం సాధారణ ద్రవ్యోల్బణంతో పోలిస్తే మరింత ప్రమాదకరమైనది. పేద కుటుంబాలు తమ ఆదాయంలో అత్యధిక భాగాన్ని ఆహారంపైనే ఖర్చు చేస్తాయి. ధనిక కుటుంబాలకు ఆహార ధరల పెరుగుదల కొంత ఇబ్బంది కలిగించినా, వారి జీవనశైలిపై పెద్దగా ప్రభావం చూపకపోవచ్చు. కానీ రోజువారీ కూలీపై ఆధారపడే కుటుంబాలకు మాత్రం ఇదే పెద్ద సంక్షోభంగా మారుతుంది. ఒకప్పుడు కొనుగోలు చేసిన కూరగాయలను ఇప్పుడు సగానికి సగం తగ్గించుకోవాల్సి వస్తుంది. పప్పులు, పాలు, పండ్లు వంటి పోషకాహార పదార్థాలు క్రమంగా వారి ఆహారపు జాబితా నుంచి తొలగిపోతాయి. ఫలితంగా పోషకాహార లోపం, ఆరోగ్య సమస్యలు, పిల్లల్లో ఎదుగుదల లోపాలు వంటి దీర్ఘకాలిక ప్రభావాల ప్రమాదం. తక్కువ వర్షపాతం ఈ పరిస్థితిని మరింత క్లిష్టతరం చేసింది. వ్యవసాయం ఇప్పటికీ ప్రకృతిపైనే ఎక్కువగా ఆధారపడి ఉంది. ఎల్‌నినో పరిస్థితుల వల్ల వర్షాభావ పరిస్థితులు ఏర్పడితే, కూరగాయల ఉత్పత్తి తగ్గుతుంది. ఉత్పత్తి తగ్గితే సరఫరా తగ్గుతుంది. సరఫరా తగ్గితే ధరలు పెరగడం సహజం. అయితే సమస్య కేవలం ప్రకృతి కారణాలతోనే పరిమితం కాదు. సరైన నిల్వ సదుపాయాల లేమి, శీతల గిడ్డంగుల కొరత, సరఫరా వ్యవస్థలో ఉన్న లోపాలు, మధ్యవర్తుల ఆధిపత్యం, రవాణా వ్యయాల పెరుగుదల వంటి నిర్మాణాత్మక సమస్యలు కూడా ధరలను మరింత పెంచుతున్నాయి. రైతు తన పంటకు సరైన ధర పొందలేకపోతుంటే, వినియోగదారుడు అదే పంటను అధిక ధరకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి. ఈ విరుద్ధ పరిస్థితి వ్యవసాయ మార్కెట్‌లో ఉన్న అసమతుల్యతను బహిర్గతం చేస్తోంది. ఇంధన ధరల పెరుగుదల కూడా ఆహార ద్రవ్యోల్బణాన్ని మరింత వేగవంతం చేస్తోంది. డీజిల్ ధరలు పెరిగితే వ్యవసాయ యంత్రాల నిర్వహణ ఖర్చు పెరుగుతుంది. నీటిపారుదల వ్యయం పెరుగుతుంది. పంటలను మార్కెట్‌కు తరలించే రవాణా ఖర్చు పెరుగుతుంది. కోల్డ్ స్టోరేజ్ నిర్వహణ ఖర్చు పెరుగుతుంది. ఈ మొత్తం అదనపు వ్యయాన్ని చివరకు వినియోగదారుడే భరించాల్సి వస్తుంది. అందుకే ఇంధన ధరల పెరుగుదల ఎప్పుడూ కేవలం పెట్రోల్ బంకులకే పరిమితం కాకుండా, ప్రతి ఇంటి ఆహార ఎంపిక పైన కూడా ప్రభావం చూపుతుంది. ఇటీవల విడుదలైన ఉత్పత్తిదారుల ధరల సూచీ కూడా పెరుగుదల దిశగా సాగడం మరో హెచ్చరిక. పరిశ్రమలు ఉత్పత్తి చేసే వస్తువుల తయారీ వ్యయం పెరుగుతోందని ఇది సూచిస్తోంది. ముడి పదార్థాలు, విద్యుత్, ఇంధనం, రవాణా, కార్మిక వ్యయం అన్నీ పెరిగినప్పుడు తయారీదారులు చివరకు ఉత్పత్తుల ధరలను పెంచక తప్పదు. ఫలితంగా వినియోగ వస్తువుల ధరలు సైతం పెరుగుతాయి. దీనిని ఆర్థిక శాస్త్రంలో వ్యయ ప్రేరిత ద్రవ్యోల్బణం అంటారు. ఇలాంటి పరిస్థితుల్లో కేవలం వడ్డీ రేట్లను పెంచడం ద్వారా మాత్రమే ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడం సాధ్యం కాదు. సరఫరా వ్యవస్థను మెరుగుపరచడం, ఉత్పత్తి వ్యయాలను తగ్గించడం, వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడం వంటి చర్యలు కూడా అంతే అవసరం. ఆ దిశగా అడుగులు వేయకుండా, ఆహార ద్రవ్యోల్బణాన్ని దీర్ఘకాలంలో నియంత్రించడం సాధ్యం కాదు. రైతుకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, సాగునీరు, మార్కెట్ సమాచారం, సరైన కనీస మద్దతు ధర, నిల్వ సదుపాయాలు, రవాణా సౌకర్యాలు అందుబాటులో ఉండాలి. పంట కోత తర్వాత జరిగే నష్టాలను తగ్గించగలిగితే మార్కెట్‌లో సరఫరా మెరుగుపడుతుంది. అలాగే పండ్లు, కూరగాయల కోసం ఆధునిక శీతల సరఫరా గొలుసును విస్తరించడం అత్యవసరం. ఉత్పత్తి ప్రాంతం నుంచి వినియోగదారుడి వరకు సరఫరా వ్యవస్థ సమర్థంగా పనిచేస్తే ధరల్లో అనవసర హెచ్చుతగ్గులను గణనీయంగా తగ్గించవచ్చు. ప్రభుత్వం తక్షణ చర్యలతో పాటు దీర్ఘకాలిక వ్యూహాన్ని కూడా రూపొందించాల్సిన అవసరం ఉంది. నిల్వల్లో ఉన్న ఆహార ధాన్యాలను అవసరమైన ప్రాంతాలకు విడుదల చేయడం, మార్కెట్‌లో కృత్రిమ కొరతను సృష్టించే అక్రమ నిల్వలను అరికట్టడం, దిగుమతులు అవసరమైతే వేగంగా నిర్ణయాలు తీసుకోవడం, రైతులకు ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించే విధానాలు అమలు చేయడం వంటి చర్యలు సమన్వయంతో సాగాలి. అంతేకాకుండా వాతావరణ మార్పుల ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని వ్యవసాయాన్ని మరింత స్థిరంగా మార్చే విధానాలు కూడా అవసరం. ద్రవ్యోల్బణాన్ని కేవలం రిజర్వ్ బ్యాంకు లేదా ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిష్కరించే సమస్యగా చూడలేం. ఇది వ్యవసాయం, వాణిజ్యం, రవాణా, ఇంధనం, నీటిపారుదల, వాతావరణ విధానాలు, సామాజిక సంక్షేమం వంటి అనేక రంగాలకు సంబంధించిన సమగ్ర సవాలు. ఒకవైపు రైతుకు న్యాయమైన ధర లభించాలి. మరోవైపు వినియోగదారుడికి అందుబాటు ధరల్లో ఆహారం లభించాలి. ఈ రెండు లక్ష్యాల మధ్య సమతుల్యత సాధించగలిగినప్పుడే నిజమైన ధరల స్థిరత్వం సాధ్యమవుతుంది.



## స్మార్ట్‌వాచ్‌లు, స్మార్ట్‌గ్లాసులు ధరించొద్దు

**పార్లమెంట్ సమావేశాలకు హాజరయ్యే ఎంపిలు స్మార్ట్‌వాచ్‌లు, స్మార్ట్‌గ్లాసులు ధరించొద్దు. దీనివల్ల భద్రతకు, వ్యక్తిగత గోప్యతకు భంగం వాటిల్లే ప్రమాదం ఉంది. పార్లమెంట్ ఆవరణలో ఎంపిలు ధర్నాలు చేయడం, ప్లకార్డులు ప్రదర్శించడం, ఆయుధాలు ప్రదర్శించడం, మతపరమైన కార్యక్రమాలు నిర్వహించ డం వంటి వాటికీ దూరంగా ఉండాలి. ఎఐతో రూపొందించిన చిత్రాలు, పోస్టర్లు; అవమానకర రీతిలో రాసిన స్లోగన్లతో కూడిన ప్లకార్డులు, బ్యానర్ల నూ ప్రదర్శిం-చొద్దు. సమావేశాల సమయంలో తోటి ఎంపిలు తమ ఛాంబర్లకు వెళ్లడానికి వీలుగా పార్లమెంట్ ప్రవేశద్వారాల వద్ద ఎలాంటి నిరసనలు లేదా ప్రదర్శనలు నిర్వహించవద్దు.**

– లోక్‌సభ సచివాలయం



## స్థిరమైన అటవీ సంరక్షణకు దిక్సూచి జపనీస్ ‘దైసుగి’

జపాన్‌లోని క్యోటో ప్రాంతంలో పుట్టిన ఈ దైసుగి పద్ధతి, ముఖ్యంగా ‘కిటాయామా సెడార్’ అనే ప్రత్యేకమైన దేవదారు వృక్షాలపై ప్రయోగిస్తారు. జపనీస్ భాషలో ‘దై’ అంటే పీఠం లేదా బల్ల అని, ‘సుగి’ అంటే సెడార్ (దేవదారు) చెట్టు అని అర్థం. అంటే, ఒక పెద్ద తల్లిచెట్టును పీఠంగా మార్చి, దానిపై నుండి అనేక నిటారైన చిన్న చెట్లను (కొమ్మలను) పెంచడమే ఈ విధానం యొక్క ముఖ్య ఉద్దేశం.

14వ శతాబ్దంలో జపాన్‌లో సాంప్రదాయ ఉద్భవ గృహాల ప్రాచుర్యం పొందింది. ఈ తరహా ఇళ్లకు ఎక్కడా వంకరలు లేని, అత్యంత నిటారైన, మృదువైన కలప స్తంభాలు అవసరమయ్యేవి. అయితే, జపాన్‌లోని పర్వత ప్రాంతాలలో నిటారైన చెట్లను పెంచడానికి సరిపడా భూమి లేకపోవడం మరియు రవాణా సౌకర్యాలు తక్కువగా ఉండటంతో, అప్పటి అటవీ కార్మికులు ఈ సంక్షోభాన్ని అధిగమించడానికి ఒక సరికొత్త ఉపాయాన్ని ఆలోచించారు. అదే ‘చెట్టును నరకకుండా, కొమ్మలనే చెట్లుగా మార్చడం’.

ఈ పద్ధతి బోన్సాయ్ కళను పోలి ఉంటుంది, కానీ ఇది భారీ స్థాయిలో కలప ఉత్పత్తి కోసం చేసే ప్రక్రియ. మొదట ఒక బలమైన కిటాయామా సెడార్ మొక్కను నాటుతారు. అది కొంత ఎత్తుకు పెరిగిన తర్వాత, దాని పైభాగం మరియు పక్క కొమ్మలను క్రమం తప్పకుండా కత్తిరిస్తారు నిరంతరం కత్తిరించడం వల్ల ఆ చెట్టు పైకి పెరగడం ఆగిపోయి, దాని కాండం ఒక బలమైన పీఠంలాగా మారుతుంది.ఈ పీఠం నుండి నిలువుగా పైకి చిగురించే కొమ్మలను మాత్రమే పెరగనిస్తారు. ఇవి ఎలాంటి వంకరలు లేకుండా, నేరుగా ఆకాశంలోకి దూసుకుపోతాయి. ప్రతి 15 నుండి 20 సంవత్సరాలకు ఒకసారి, ఈ పైకి పెరిగిన నిటారైన కొమ్మలను మాత్రమే జాగ్రత్తగా నరికి కలపగా వాడుకుంటారు. మూలంలో ఉన్న తల్లి చెట్టును అలాగే వదిలేస్తారు. ఆ తల్లి చెట్టు సుమారు 200 నుండి 300 సంవత్సరాల పాటు జీవిస్తూ, నిరంతరం కొత్త కలపను అందిస్తూనే ఉంటుంది. జపాన్ వంటి పర్వత ప్రాంతాలు మరియు ఇరుకైన లోయలు ఎక్కువగా ఉన్న దేశాల్లో సాధారణ పద్ధతిలో విస్తారంగా అడవులను పెంచడం సాధ్యం కాదు. దైసుగి విధానంలో ఒకే ఒక్క తల్లి చెట్టు (మదర్ ట్రీ) కాండంపైనే పదుల సంఖ్యలో నిటారైన కొమ్మలను వృక్షాలుగా పెంచుతారు. దీనివల్ల చాలా తక్కువ స్థలంలోనే అత్యధిక మొత్తంలో కలపను ఉత్పత్తి చేసే వీలు కలుగుతుంది.

ఈ పద్ధతి ద్వారా లభించే కలప సాధారణ పద్ధతిలో పెరిగే దేవదారు (సెడార్) కలప కంటే దాదాపు రెండు రెట్లు (200%) ఎక్కువ బలాన్ని, దట్టమైన నిర్మాణాన్ని కలిగి ఉంటుంది. ఈ కొమ్మలు ఎక్కడా వంకరలు లేకుండా, గింజలు లేకుండా నేరుగా పైకి ఎదుగుతాయి. అంతేకాకుండా, ఈ కలపకు సుమారు 140% ఎక్కువ సాగే గుణం ఉండటం వల్ల, జపాన్ లాంటి భూకంప పీడిత ప్రాంతాలలో తట్టుకుని నిలబడే ఇళ్ల నిర్మాణాలకు, పైకప్పు స్తంభాలకు ఇది అత్యంత ఆదర్శవంతమైనదిగా నిలుస్తుంది. కలప కావాలంటే దైసుగి విధానంలో మూల వృక్షాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ నరకరు. కేవలం పైకి పెరిగిన కొమ్మలను మాత్రమే క్రమ పద్ధతిలో నరికి తీసుకుంటారు. ఒకసారి కొమ్మలను సేకరించిన తర్వాత, అదే తల్లి చెట్టు నుండి మళ్లీ కొత్త చిగుళ్లు వచ్చి, మరో 15–20 ఏళ్లలో సరికొత్త కలప సిద్ధమవుతుంది. ఇలా ఒకే చెట్టు సుమారు 200 నుండి 300 సంవత్సరాల పాటు నిరంతరాయంగా కలపను అందిస్తూనే ఉంటుంది. కాలక్రమేణా ఆధునిక నిర్మాణ సామాగ్రి అందుబాటులోకి రావడం వల్ల జపాన్‌లో కూడా ఈ దైసుగి పద్ధతి వాడకం కొంతవరకు తగ్గింది. భవిష్యత్తులో స్థిరమైన అటవీ పెంపకానికి ప్రపంచవ్యాప్తంగా ఇటువంటి సాంప్రదాయ పద్ధతులను పునరుద్ధరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**సుధాకర్ ఎవి,** 9000674747



**డి.రాజా**
సిపిఐ ప్రధాన కార్యదర్శి

## దేశవ్యాప్త రాజకీయ ప్రచారానికి సిపిఐ సన్నద్ధం

# ఎందుకు మార్పు తప్పనిసరి?

భారతదేశం నేడు నిర్ణయాత్మక క్షణంలో ఉంది. నరేంద్ర మోదీ ప్రభుత్వ దశాబ్దకాల అధికారం ఆందోళనకు, ఆశాభంగానికి, కష్టనష్టాలు పెరుగుదలకు నిలకడగా బాటవేసింది. బిజెపి ఎన్నిక తర్వాత ఎన్నికకు అభివృద్ధి, ఉపాధి, సౌభాగ్యం, మంచి పరిపాలన, మెరుగైన భవిష్యత్ వాగ్దానం చేసింది. దేశం తద్భిన్నంగా, పెరుగుతున్న నిరుద్యోగం, దుర్భరమైన ద్రవ్యోల్బణం, పెరుగుతున్న అసమానత, బలహీన పడుతున్న గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, క్షీణిస్తు న్న ప్రజాస్వామ్య వాతావరణం, పెరుగుతున్న సామాజిక ఉద్రిక్తతలు ఎదుర్కొంటున్నది. ఈ ప్రశ్నలు మోదీ ప్రభుత్వంనుంచి సమాధానాలు డిమాండ్ చేసినపుడల్లా, వారు జాతీయ సంభాషణను వేరే అంశాలపైకి మళ్లిస్తున్నారు. సామాన్య ప్రజల రోజువారీ ఆందోళనలను పరిష్కరించే బదులు బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లు పదేపదే మతమార్గాల్లో ప్రజలను విభజించటం, భావోద్వేగ విజ్ఞప్తు లు చేయటం, ఉద్దేశపూర్వకంగా సృష్టించే వివాదాలవైపు మరలుతున్నారు. జవాబుదారీతనాన్ని తప్పించుకునేందుకు మతాన్ని ముందుకు తెస్తున్నారు. వైఫల్యాన్ని మరుగుపరిచేందుకు ద్వేషాన్ని ప్రోత్సహిస్తున్నారు. విభజన ప్రజ లు ఎదుర్కొంటున్న వాస్తవిక సమస్యల నుంచి ప్రజల దృష్టి మరల్చుతుంది కాబట్టి దాన్ని ప్రోత్సహిస్తున్నారు.


నరేంద్రమోదీ ప్రభుత్వం దశాబ్దకాలంపైగా, అపూర్వమైన అభివృద్ధి సాధించామన్న చిత్రాన్ని ప్రజలముందుంచుతున్నది. అయితే కోట్లాది ప్రజల జీవితానుభవం భిన్నమైన కథ చెబుతున్నది. యువకులు పోటీ పరీక్షలకోసం సంవత్సరాల తరబడి శ్రమిస్తున్నారు. కాని జరుగుతున్నదేమిటి? రిక్రూట్‌మెంట్ జాప్యం, పదేపదే ప్రశ్నాపత్రాలు లీకులతో పరీక్షల రద్దు, అవినీతి. ప్రభుత్వ ఉద్యోగాల్లో ఖాళీలు నింపడం లేదు. భద్రమైన ఉద్యోగం స్థానంలో కాంట్రాక్టు ఉద్యోగాలు వచ్చాయి. విద్యాధిక యువత డిగ్రీలు చేతబట్టుకుని ఒక పోటీ పరీక్షనుంచి మరో పరీక్షకు పరుగులు పెడుతున్నారు. అయితే వారి ఆకాంక్షలకు తగిన అవకాశాలు కనిపించటం లేదు. విద్య తమ పిల్లల భవిష్యత్‌కు భద్రత చేకూర్చుతుందని తల్లిదండ్రులు తమ పొదుపు సొమ్ము అంతా వెచ్చిస్తున్నారు. అందుకు బదులుగా అసంఖ్యాకంగా యువ భారతీయులు నిరాశానిస్పృహల్లోకి, నిరుద్యోగంలోకి, రేపటి గూర్చిన అగమ్యంలోకి నెట్టబడుతున్నారు. బిజెపి ప్రభుత్వ అతిపెద్ద వైఫల్యాల్లో ఒకటి నిరుద్యోగం అనే వాస్తవాన్ని ఎంతపెద్దగా ప్రచారం చేసుకున్నా దాచలేరు.

నిరుద్యోగంతోపాటు ద్రవ్యోల్బణం కృంగదీస్తున్న భారమవుతున్నది. తమ ఆదాయాలు పెరుగుతున్న ధరల వేగాన్ని అందుకోలేకపోతున్నాయని మార్కెట్‌కు వెళ్లిన ప్రతిసారీ ప్రజలకు గుర్తుచేస్తున్నది. ఆహారం, వంటగ్యాస్, రవాణా, విద్యుచ్ఛక్తి, ఆరోగ్య సంరక్షణ, విద్యపై ఖర్చు నిలకడగా పెరుగుతున్నది. వేతన ఉద్యోగులు తమ ఆదాయాలు అవసరాలకు సరిపోవటంలేదని బాధపడుతున్నారు. వేతన కార్మికులేమో కనీస అవసరాలు తీర్చుకోవటానికి సైతం అవస్థపడుతున్నారు. చిన్నపాటి వర్తకులు ప్రజల కొనుగోలు శక్తి క్షీణింపు పర్యవసానం చవిచూస్తున్నారు. కుటుంబాలు కేవలం మనుగడకోసం వైద్య చికిత్స వాయిదా వేసుకుంటున్నాయి, అత్యవసర వ్యయం తగ్గించుకుంటున్నా యి, అప్పులు చేస్తున్నాయి. సామాన్య ప్రజలేమో పెరుగుతున్న ఆర్థిక అస్థిరత ను అనుభవిస్తుండగా, మోదీ ప్రభుత్వమేమో ఆర్థిక విజయాల పతాక శీర్షికల తో వేడుక కొనసాగిస్తున్నది.

గ్రామీణ భారతంలో సంక్షోభం మరీ తీవ్రంగా ఉంది. కోట్లాదిమంది వ్యవసాయమే జీవనోపాధిగా కొనసాగుతున్నప్పటికీ, రైతులేమో పెరుగుతున్న పెట్టుబడుల ఖర్చులు, ఆదాయంలో అస్థిరత, పెచ్చుపెరుగుతున్న అప్పులతో సతమతమవుతున్నారు. రైతులు దేశవ్యాప్తంగా సుదీర్ఘకాలం పోరాటం చేసినప్పటికీ కనీస మద్దతు ధరకు లీగల్ గ్యారంటీ కోసం చేస్తున్న డిమాండ్ అపరిష్కృతంగానే ఉంది. రైతుల చరిత్రాత్మక ఉద్యమం తర్వాత బిజెపి ప్రభుత్వం వివాదాస్పదమైన వ్యవసాయ చట్టాలను ఉపసంహరించుకుంది. అయినా అందులోని ప్రధాన డిమాండ్ ఎంఎస్‌పికి లీగల్ గ్యారంటీ నెరవేరలేదు. రైతులకు తమ ఉత్పత్తుల కొనుగోలుకు హామీ, అందుబాటులో పరపతి, ఇరిగేషన్, గిట్టుబాటుధరలు అవసరం. వారికి ప్రసంగాలు, ప్రజాసంబంధాల ప్రచారాలు అవసరం లేదు.

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని ఒక పద్ధతి ప్రకారం ధ్వంసం చేయటం కూడా అంతే బాధాకరం. గ్రామీణ కుటుంబాలకు ఉపాధి, ఆదాయ భద్రత కలిగించేందుకు నరేగా చట్టం చేయబడింది. కష్టకాలంలో కోట్లాదిమంది పేదలకు అది జీవనమార్గం అయింది. ఈ ప్రభావవంతమైన కార్యక్రమాన్ని విస్తరించేబదులు, నరేంద్రమోదీ ప్రభుత్వం తగినంత బడ్జెట్ కేటాయించకుండా, వేతనం చెల్లింపు ఆలస్యం చేస్తూ, పరిపాలనా సంబంధమైన ఆంక్షలు విధిస్తూ క్రమంగా బలహీనమొనర్చింది. ఉపాధికి గ్యారంటీ ఇవ్వటం దాతృత్వం కాదు, అది చట్టబద్ధ హక్కు. గ్రామీణ భారత్‌కు మరింత శక్తివంతమైన ఉపాధి గ్యారంటీలు అవసరం.

ప్రభుత్వ విద్య సమాన అవకాశాలు తెస్తుందని ఒకప్పుడు భావించబడింది. ఇప్పుడు అది కూడా ఇబ్బందుల్లో ఉంది. ప్రభుత్వ సంస్థలకు ఇతోధిక పెట్టుబడి అవసరం కాగా, ప్రభుత్వ సంస్థలను ఎండగట్టి ప్రైవేటు విద్యావ్యాపారం విస్తరిస్తున్నారు. అదే అలక్ష్యం ఆరోగ్యసంరక్షణలో కూడా కనిపిస్తుంది. నాణ్యమైన ప్రభుత్వ వైద్యం తగినంతగా లేనందున ప్రజలు తమ సొంత జేబుల నుంచి చాలా పెద్ద మొత్తాలు ఖర్చు చేస్తున్నారు. ఇవి బిజెపి ప్రభుత్వం ఎంచుకున్న విధానాలు. సామాన్య ప్రజలు వాటి పర్యవసానాలు




అనుభవిస్తున్నారు.

నిజమైన సంపద సృష్టికర్తలు కార్మికులు. దేశ ఆర్థికాభివృద్ధికి వారు నిత్యం పాటుపడుతున్నారు. అయితే అభద్రత ఎదుర్కొంటూనే ఉన్నారు. స్థిరమైన ఉద్యోగాలు తగ్గిపోతూ తగినంత సామాజిక భద్రతలేని కాంట్రాక్టీకరణ, పొరుగు సేవలు, అనియత పనులు పెరుగుతున్నాయి. కార్మిక రక్షణలను క్రమంగా తగ్గిస్తూ కార్పొరేట్ ప్రయోజనాలకు విపరీతమైన ప్రోత్సాహం ఇస్తున్నారు.

మహిళలు వివక్షత ఎదుర్కోవటం కొనసాగుతున్నది. సాధికారిత నిత్యం వల్లించటం మినహా సమాన అవకాశాలు కల్పించటంలేదు. మహిళలకు రిజర్వేషన్ కల్పించిన రాజ్యాంగ సవరణను ఇక ఎంతమాత్రం జాప్యం చేయకుండా అమలు జరపాలి. దళితులు, ఆదివాసీలు వివక్ష, అత్యాచారాలు, నివాస ప్రదేశాల నుంచి తొలగింపు ఎదుర్కొంటున్నారు. అభివృద్ధి అంటే ఉన్నది ఊడగొట్టటం కాదు. గాఢమవుతున్న అసమానతతో ప్రజాస్వామ్యం సహజీవనం చేయజాలదు.

దేశంలోని ప్రజాస్వామిక సంస్థలు కూడా తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నాయి. ప్రజాస్వామ్యం అంటే కేవలం ఎన్నికలు జరపటం కాదు. దానికి స్వతంత్ర రాజ్యాంగ సంస్థలు, స్వేచ్ఛాయుతమైన పత్రికారంగం, స్వతంత్రమై న న్యాయవ్యవస్థ, సమాఖ్య వ్యవస్థ (ఫెడరలిజం) పట్ల గౌరవం, అసమ్మతి వ్యక్తీకరణకు రాజ్యాంగ హక్కు అవసరం. మోదీ ప్రభుత్వాన్ని విమర్శించే వారి ని ప్రజాస్వామిక హక్కులు ఉపయోగించుకుంటున్న పౌరులుగా కాకుండా శత్రువులుగా చూడటం పెరుగుతున్నది. ఆత్మవిశ్వాసంగల ప్రభుత్వం ప్రశ్న లు ఆహ్వానిస్తుంది, అభద్రతతో ఉన్న ప్రభుత్వం వాటికి భయపడుతుంది.

భారతదేశ ఎన్నికల క్రమంలో విశ్వాసం పునరుద్ధరించటం ఎంతో అవసరం. స్వేచ్ఛాయుతమైన ఎన్నికలు పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి పునాది. అవి నిష్పక్షపాతంగా నిర్వహించబడటమేగాక అలా కనిపించాలి కూడా. బిహార్, పశ్చిమబెంగాల్‌లో ఓటరు జాబితాల ప్రక్షాళన (ఎస్‌ఐఆర్) లో ఏకపక్షంగా తొలగింపుల వల్ల ఎందరో అర్హులు ఓటుహక్కు కోల్పోయారన్న ఆందోళనలు వ్యక్తమయినాయి. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల్లో తారుమారులతో ఎన్నికల వ్యవస్థలో విశ్వాసం సన్నగిల్లుతున్నది. ముఖ్య ఎన్నికల కమిషనర్, ఇతర కమిషనర్‌ల ఎంపికలో ప్రభుత్వ జోక్యం పెరగటం వల్ల అవి విమర్శలపాలవుతున్నాయి. ప్రజాస్వామ్యయుత క్రమంలో విశ్వాస పునరుద్ధరణకై సమగ్రమైన ఎన్నికల సంస్కరణలు తక్షణావసరం. ఎన్నికల్లో ధనబలం, కండబలం ప్రవాహాన్ని అణచివేయటానికై ఎన్నికల నిధులు ప్రభుత్వం సమకూర్చాలన్న ఇంద్రజిత్‌గుప్తా కమిటీ సిఫారసులు తక్షణం అమలు జరపాలి. ఈ వైఫల్యాలను విస్మరించటం అసాధ్యమైనప్పుడల్లా ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి మతపరంగా సమాజ విభజనవైపు మరలుతాయి. ఉమ్మడి ప్రయోజనాలను పంచుకునే ప్రజలను విభజించటం ఆర్‌ఎస్‌ఎస్ రాజకీయం.

మతవిశ్వాసం కోట్లాదిమంది భారతీయుల జీవితాల్లో పవిత్రమైన స్థానం ఆక్రమించుకుని ఉంది. అందువల్లనే అయోధ్య రామాలయం కోసం వసూలు చేసిన విరాళాలు, భక్తులు సమర్పించుకున్న కానుకలు దొంగతనం కావటం భక్తులకు తీవ్రమైన మనస్తాపం కలిగించింది. ఈ ఆరోపణలు పారదర్శకత, జవాబుదారీతనం గూర్చి తీవ్రమైన ప్రశ్నలు లేవనెత్తాయి. దీనిపై సబబైన, స్వతంత్ర, విశ్వసనీయత కలిగిన దర్యాప్తు అవసరం. ఇది ద్రవ్య జవాబుదారీతనానికి మించిన సమస్య. ఆర్‌ఎస్‌ఎస్, బిజెపిలు దశాబ్దాల పాటు భగవాన్ రాముని పేరుతో ప్రజల్ని సమీకరించా యి. ఆయన పేరుతో ఉన్న ఆలయం పనితీరు గూర్చి ఇప్పుడు ప్రశ్నలు లేవనెత్తబడుతున్నప్పుడు వాటిని కొట్టిపారేయ వీలులేదు. ఆర్‌ఎస్‌ఎస్ మతాన్ని వ్యాపారంగా, రాజకీయ అధికారానికి సాధనంగా ఉపయోగించింది. ప్రజలను ఐక్యం చేయటానికి బదులు విభజించటానికి ఉద్దేశించిన ఎడతెగని ప్రచారంతో వాస్తవ సమస్యలను సమాధి చేస్తున్నది మోదీ ప్రభు త్వం.

ఇంతకన్నా మెరుగైన స్థితికి భారత్ అర్హురాలు. కొత్త వివాదాలు సృష్టించే బదులు ప్రశ్నలకు జవాబుచెప్పే ప్రభుత్వం అవసరం. ఉపాధి, భద్రత, ప్రభుత్వ విద్య, ఆరోగ్యం, కార్మికుల అవసరం. ఉపాధి, భద్రత, ప్రభుత్వ విద్య, ఆరోగ్యం, కార్మికుల హక్కులకు రక్షణ, నరేగా పటిష్టత, రైతులకు గిట్టుబాటు ధరలకు గ్యారంటీ, సామాజిక న్యాయ పరిరక్షణ, అర్థవంతమైన ఎన్నికల సంస్కరణలు అమలుజరిపే, రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యాన్ని కాపాడుకు నే విధానాలు దేశానికి అవసరం. అన్నిటికన్నా ముఖ్యంగా, ఎన్నికల లబ్ధి కోసం ప్రజలను విభజించే బదులు ఐక్యం చేసే ప్రభుత్వం దేశానికి అవసరం.

భారత కమ్యూనిస్టు పార్టీ ఈ నిశ్చితాభిప్రాయంతోనే ఆగస్టు 6 నుంచి 15వరకు పాదయాత్రల ద్వారా దేశవ్యాప్త ప్రచారోద్యమానికి పిలుపు ఇచ్చింది. ఇవి ప్రతి గ్రామం, పట్టణం, నగరానికీ ప్రజల ఐక్యత, న్యాయం, ప్రజాస్వామిక మార్పు సందేశాన్ని తీసుకెళతాయి. **ఈ పాదయాత్రలు 2026 సెప్టెంబర్ 1న రాంలీలామైదాన్‌లో జరిగే ‘మార్పు అవ-సరం’ ర్యాలీకి చేరుకుంటాయి.** పైన ప్రస్తావించిన వివిధ తరగతుల ప్రజానీకం కోసం ఉద్దేశించిన కోర్కెలతోపాటు ప్రజాస్వామిక విలువల పునరుద్ధరణ, భారత లౌకిక, ప్రజాతంత్ర రిపబ్లిక్ పరిరక్షణ, దాని రాజ్యాంగం పరిరక్షణను దేశం నలుమూలల నుంచీ చేరుకున్న ప్రజలు డిమాండ్ చేస్తారు.

*బద్లావ్ జరూరీ హై*
*మార్పు అవసరం*
*ఢిల్లీ చలో*
*1 సెప్టెంబర్, రాంలీలా మైదాన్*

## కృత్రిమ మేధ మానవాళికి వరం కావాలి, శాపం కాదు

ఒక ఎలక్ట్రానిక్ ఉపకరణం మానవుణ్ణి అనుకరించడం, నేర్చుకోవడం, నిర్ణయాలను తీసుకోవడం లాంటి విధులను నిర్వహించడాన్ని కృత్రిమ మేధ (ఆర్టిఫీసియల్ ఇంటెలిజెన్స్ లేదా ఏఐ) అని చెప్పవచ్చు. నేడు ఎఐ రంగం ఒక టెక్నాలజీ అభివృద్ధే కాదని, రానున్న తరాల మానవ జీవితాలను విప్లవాత్మకంగా ప్రభావితం చేయనుందని తెలుసుకోవాలి. గత కొన్ని దశాబ్దాలుగా ఎఐ ప్రారంభ స్థాయి నుంచి నేడు భాషలను తర్జుమా చేయడం, ముఖాలను గుర్తించడం, వేలి ముద్రలను పసిగట్టడం, వాహనాలను ప్రోగ్రామింగ్‌కు అనుగుణంగా ఆటోమేటిక్‌గా నడపడం, రోగాలను నిర్ధారణ చేయడం, చికిత్సతో పాటు రోబోటిక్ సర్జరీలు చేయడం లాంటి పనులను చేసే స్థాయికి అభివృద్ధి చెందింది. 2021లో ఎఐ ప్రాధాన్యాన్ని గుర్తించిన జాసన్ కిర్టన్ అను శాస్త్రజ్ఞుడు ప్రతి ఏట 16 జూలై రోజున ఎఐ ప్రశంసా దినోత్సవం లేదా ఎఐ అప్రీషియేషన్ డే నిర్వహించుకోవాలని ప్రపంచ మానవాళికి సందేశం ఇవ్వడంతో అది ప్రతి ఏటా సాంప్రదాయంగా ప్రపంచ దేశాలు జరుపుకోవడం కొనసాగుతున్నది.

**నిత్య జీవితంలో ఎఐ ప్రయోజనాలు:**

మానవాళి జీవనశైలితో ఎఐ విడదీయరాని సంబంధాన్ని ఏర్పరుచుకుంటున్నది. నేడు వైద్యరంగంలో వ్యాధి నిర్ధారణ, చికిత్స, సర్జరీ లాంటి ప్రయోజనాలను కలిగి ఉన్నది. రవాణా రంగంలో ట్రాఫిక్ నియంత్రణ, ఆటోమెటిక్ వాహనాల రూపకల్పన లాంటివి జరుగుతున్నాయి. విద్యారంగంలో నూతన ఆకర్షణీయ బోధనా పద్ధతులు, ట్యూటర్ విధులను ఎఐ సుసాధ్యం చేస్తున్నది. వినియోగదారుల సేవల్లో చాట్‌బూట్, వర్చువల్ ఏజెంట్స్ లాంటి విధులు నిర్వహించడంలో ఎఐ సఫలం అవుతున్నది. పర్యావరణ పరిరక్షణలో వాతావరణ నమూనాలు, శక్తి నియంత్రణ లాంటి పలు విధులను ఎఐ నిర్వహిస్తున్నది. వీటితోపాటు వినోదం, బ్యాంకింగ్, టెలీకమ్యూనికేషన్స్, ఆటోమొబైల్స్, గృహ విధులు లాంటి అనేక




ప్రయోజనాలను ఎఐ కలిగి ఉన్నదని మన అనుభవం చెబుతున్నది. ఎఐ రంగం వరంగానే కాకుండా శాపంగా పలు నష్టాలను కూడా చూపుతోంది. పలు అనైతిక సమస్యలు, వ్యక్తిగత డాటా దుర్వినియోగాలు, ఉద్యోగాల్లో కోతలు, ఇతర పలు లోపాలను కలిగి ఉండడంతో కొంత జాగ్రత్త వహించాల్సి వస్తున్నది. ఎఐ టెక్నాలజీ ఒక ఇంజనీరింగ్ విభాగంలో శ్రమించే వారి అంశమే కాదు, ఆధునిక టెక్నాలజీని వినియోగించే లేదా వినియోగించని ప్రతి ఒక్కరికీ జీవితాలపై ప్రభావాన్ని చూపడం ఖాయమని తెలిసిపోయింది.

ఎఐ రంగం నైతిక విలువలకు లోబడి ఉండడంతో పాటు పారదర్శకత కలిగి మానవాళికి మేలు చేకూర్చే విధంగా ఉండాలని కోరుకోవాలి.

**భారతదేశంలో ఎఐ టెక్నాలజీ:**

భారత్‌లో ఎఐ రంగం వేగంగా వినియోగించబడుతూ, పలు విజయాలను నమోదు చేస్తున్నప్పటికీ ఇతర అభివృద్ధి చెందిన దేశాల టెక్నాలజీలతో పోల్చితే కొంత మందగమనం జరుగుతున్నట్లు అర్థం అవుతున్నది. ఏఐ విసురుతున్న పలు సవాళ్లను అధిగమిస్తూ రానున్న రోజుల్లో ఈ రంగంలో భారత్ కూడా పటిష్టమైన అడుగులు వేయాలని కోరుకుందాం. ఏఐ ప్రశంస దినం వేదికగా ఎఐ అనువర్తనాలను వివరించడం, చర్చలు నిర్వహించడం, ఎఐ ప్రాజెక్టులను ప్రదర్శించడం, ఎఐ పరిశోధకులను గుర్తించి ప్రశంసించడం, నైతికతను కాపాడడం లాంటి కార్యక్రమాలను నిర్వహించవచ్చు.

ఎఐ విప్లవం చూపిన బాటలో నడుస్తూ, ఎఐ టూల్స్‌ను మానవాళి శ్రేయస్సుకు వాడుకోవడం, భారతంలో మరో తరం ఎఐ విప్లవానికి నాంది పలకడం లాంటివి జరగాలని కోరుకుందాం, మానవుడి మేధస్సుకు ఎఐ సరి సమానం కాదని కూడా నమ్ముదాం.

**(16 జులై కృత్రిమ మేధ ప్రశంసా దినోత్సవం సందర్భంగా)**

డాక్టర్ : బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# వేర్‌హౌస్ సామర్థ్యం మరో 5 లక్షల మెట్రిక్ టన్నులు పెంపు



మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో రానున్న రెండేళ్లలో వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా 48 కొత్త గోదాములను అందుబాటులోకి తీసుకు రానున్నామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మొదటి దశలో 17 గోదాములను 2027 జనవరి నాటికి పూర్తి చేసి 2.12 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యాన్ని, రెండో దశలో 31 గోదాములను 2028 డిసెంబర్ నాటికి పూర్తి చేసి మరో 3.66 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యాన్ని అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. బుధవారం సచివాలయంలో తెలంగాణ రాష్ట్ర వేర్‌హౌసింగ్ కార్పొరేషన్, మార్క్‌ఫెడ్, హాకా కార్పొరేషన్‌ల మేనేజింగ్ డైరెక్టర్లతో మంత్రి సమీక్ష సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్ర వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ ఆధీనంలో 52 స్వంత గోదాములు ఉండగా, వాటి నిల్వ సామర్థ్యం సుమారు 6 లక్షల మెట్రిక్ టన్నులని తెలిపారు. ప్రస్తుతం 104 శాతానికి పైగా ఆక్యుపెన్సీతో 6.33 లక్షల మెట్రిక్ టన్నుల వ్యవసాయ ఉత్పత్తులు నిల్వ ఉన్నాయని చెప్పారు. రాష్ట్రంలో ప్రస్తుతం 48 కొత్త గోదాముల నిర్మాణం కొనసాగుతుండగా అదనంగా 32 గోదాముల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని, వాటి ద్వారా మరో 3.25 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం పెరుగుతుందని తెలిపారు.జిల్లాల వారీగా రానున్న 20 సంవత్సరాల గిడ్డంగుల అవసరాలపై సమగ్ర అధ్యయనం చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. దీర్ఘకాలిక అవసరాలకు అనుగుణంగా గోదాముల నిర్మాణం చేపట్టడంతో పాటు, గిడ్డంగుల్లో నిల్వ చేసే వ్యవసాయ ఉత్పత్తుల నాణ్యత దెబ్బతినకుండా శాస్త్రీయ విధానాలను అమలు చేయాలని సూచించారు.కొత్తగా నిర్మించే ప్రతి గోదాముపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసి విద్యుత్‌ను స్వయంగా ఉత్పత్తి చేసుకోవాలని, మిగులు విద్యుత్‌ను గ్రిడ్‌కు విక్రయించి అదనపు ఆదాయం పొందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. అలాగే మార్క్‌ఫెడ్, మార్కెటింగ్, హాకా, వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ల ఆధీనంలోని గోదాములను సమన్వయంతో వినియోగించి ప్రభుత్వ వ్యయాలను తగ్గించాలని సూచించారు. ప్రభుత్వ కార్పొరేషన్లు వడ్డీ భారాన్ని తగ్గించుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని, అవసరం లేకుండా ప్రైవేట్ గోదాములను అద్దెకు తీసుకోవద్దని మంత్రి స్పష్టం చేశారు. కొత్త గోదాముల నిర్మాణంలో నాణ్యతకు ప్రాధాన్యం ఇచ్చి, ప్రపంచస్థాయి ప్రమాణాలతో ఆధునిక నమూనాలను అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కార్మికులే వెన్నెముక

**కార్మిక సంక్షేమంలో ఆదర్శంగా తెలంగాణ**

**బ్రిక్స్ ట్రేడ్ యూనియన్ ఫోరంలో మంత్రి జి. వివేక్ వెంకటస్వామి**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కార్మికులే వెన్నెముక అని తెలంగాణ రాష్ట్ర కార్మిక, ఉపాధి, శిక్షణ, ఫ్యాక్టరీస్, గనుల శాఖ మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి అన్నారు. ప్రతి దేశ అభివృద్ధి వెనుక కార్మికుల శ్రమ, నైపుణ్యం, అంకితభావం దాగి ఉంటాయని పేర్కొన్నారు. కార్మికుల గౌరవం, న్యాయమైన వేతనాలు, సురక్షితమైన పని వాతావరణం, సామాజిక భద్రత కల్పించడం ప్రతి ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. బ్రిక్స్ ట్రేడ్ యూనియన్ ఫోరం సమ్మిట్ 2026లో భాగంగా బుధవారం హైదరాబాద్‌లోని మారియట్ హోటల్‌లో 'బెస్ట్ ట్రైపార్టైట్ ప్రాక్టిసెస్ ఇన్ బ్రిక్స్ ప్లస్ కంట్రీస్' అంశంపై జరిగిన చర్చలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రభుత్వం, యాజమాన్యం, కార్మిక సంఘాల మధ్య సమన్వయంతో కూడిన త్రైపాక్షిక వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. కార్మిక శాఖ ఆధ్వర్యంలో పరిశ్రమలు, యాజమాన్యాలు, ట్రేడ్ యూనియన్లతో నిరంతర సంప్రదింపులు, సామరస్యపూర్వక చర్చలు నిర్వహిస్తూ పారిశ్రామిక వివాదాలను శాంతియుతంగా పరిష్కరిస్తున్నామని తెలిపారు. ఈ విధానం వల్ల రాష్ట్రంలో పారిశ్రామిక శాంతి, ఉత్పాదకత, పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఏర్పడిందన్నారు. కృత్రిమ మేధస్సు (ఎఐ), ఆటోమేషన్, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో కార్మిక సంఘాల పాత్ర మరింత కీలకంగా మారిందన్నారు. 'తెలంగాణ రైజింగ్2047' విజన్‌లో భాగంగా రాష్ట్రానికి భారీ స్థాయిలో పెట్టుబడులు రానున్నాయని, వాటికి అవసరమైన నైపుణ్య మానవ వనరులను సిద్ధం చేయడంలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు కీలక పాత్ర పోషిస్తాయని మంత్రి పేర్కొన్నారు. అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) ప్రతిపాదించిన 'సామాజిక న్యాయం ద్వారానే శాశ్వత శాంతి సాధ్యం' అనే సిద్ధాంతాన్ని తెలంగాణ ప్రభుత్వం ఆచరణలో అమలు చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. బ్రిక్స్ దేశాల మధ్య ఇలాంటి చర్చలు ప్రపంచ కార్మిక సంక్షేమ విధానాలకు కొత్త దిశానిర్దేశం చేస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

# పేద విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభుత్వం దృష్టి

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పేద, దళిత, గిరిజన విద్యార్థుల విద్యా భవిష్యత్తును తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. అ ర్హులైన ఒక్క విద్యార్థి కూడా గురుకుల విద్యకు దూరం కాకుండా అధికారులు పూర్తి బాధ్యతతో వ్యవహరించాలని, గురుకుల సీట్ల కేటాయింపు ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండదని స్పష్టం చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని డిఎస్‌సి భవన్‌లో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (టిజిఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్) కార్యాలయాన్ని మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వివిధ జిల్లాల నుంచి వచ్చిన తల్లిదండ్రుల నుంచి వినతిపత్రాలు స్వీకరించి, వారి సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. దూర ప్రాంతాలు, మారుమూల గ్రామాల నుంచి వచ్చిన తల్లిదండ్రులు తమ పిల్లలకు సమీప జిల్లాల్లోనే సీట్లు కేటాయించాలని కోరగా, అర్హులైన విద్యార్థులకు సాధ్యమైనంత మేరకు అనుకూల జిల్లాల్లో ప్రవేశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాల ని అధికారులను ఆదేశించారు. సీట్ల కేటాయింపు ప్రక్రియలో పారదర్శకత, మానవీయ దృక్పథం పాటించాలని, ప్రతి దరఖాస్తును నిబంధనల మేర కు పరిశీలించి అర్హులైన ప్రతి విద్యార్థికి న్యాయం చేయాలని సూచించారు.మారుమూల ప్రాంతాల నుంచి కార్యాలయానికి వచ్చే తల్లిదండ్రులతో అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారికి సరైన సమాచారం, మార్గదర్శకత్వం అందించాలని మంత్రి ఆదేశించారు. గురుకుల విద్యా వ్యవస్థను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, విద్యార్థులకు నాణ్యమైన విద్య, పోషకాహారం, ఆధునిక మౌలిక వసతులు, పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ, మెరుగైన వసతి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్ర భుత్వ లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు బా ధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.

# తెలంగాణ ఎస్‌సి విద్యార్థుల అభివృద్ధికి కేంద్రం అండగా ఉంటుంది


కేంద్రమంత్రి రామ్‌దాస్ అథవాలే రాష్ట ప్రభుత్వానికి హామీ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలోని షెడ్యూల్డ్ కులాల విద్యార్థుల సంక్షేమం, విద్యా ప్రమాణాల మెరుగుదల, హాస్టళ్ల సమగ్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ మంత్రి రామ్‌దాస్ అథవాలే హామీ ఇచ్చారు. హైదరాబాద్ పర్యటనలో భాగంగా బుధవారం టూరిజం ప్లాజాలో రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కేంద్ర మంత్రిని కలిసి రాష్ట్ర ప్రభుత్వం తరఫున వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణకు పెండింగ్‌లో ఉన్న కేంద్ర నిధుల నుంచి తక్షణమే రూ.150 కోట్ల విడుదలకు కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు మంత్రి అడ్లూరి తెలిపారు. అలాగే రాష్ట్రంలోని ఎస్‌సి సంక్షేమ పాఠశాలలు, హాస్టళ్ల ఆధునీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం కోరిన రూ.300 కోట్ల ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీపై వచ్చే నెలలో సంబంధిత అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించి నిర్ణయం తీసుకుంటామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వం సామాజిక న్యాయాన్ని పరిపాలనకు కేంద్రబిందువుగా తీసుకుని ఎస్‌సిల అభ్యున్నతికి పలు కార్యక్రమాలు అమలు చేస్తోందని లక్ష్మణ్ కుమార్ కేంద్ర మంత్రికి వివరించారు. విద్యనే సామాజిక సాధికారతకు ప్రధాన సాధనంగా భావిస్తూ గురుకుల విద్యా వ్యవస్థ, సంక్షేమ హాస్టళ్లు, విద్యార్థుల సంక్షేమ పథకాలకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. అయితే కేంద్ర ప్రాయోజిత పథకాల కింద తెలంగాణకు రావాల్సిన నిధులు పెండింగ్‌లో ఉండటం వల్ల సంక్షేమ కార్యక్రమాల అమలుపై అదనపు ఆర్థిక భారం పడుతోందని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు .ఎస్‌సి సంక్షేమ పాఠశాలలు, హాస్టళ్లలో భవనాల మరమ్మతులు, అదనపు తరగతి గదుల నిర్మాణం, డైనింగ్ హాళ్లు, ఆధునిక వంటశాలలు వంటి సదుపాయాల కోసం రూ.300 కోట్ల ప్రత్యేక ప్యాకే జీ మంజూరు చేయాలని కేంద్రాన్ని కోరినట్లు మంత్రి వివరించారు.

# కులాలతో రాజకీయం చేస్తే మనుగడ ఉండదు : నెల్లికంటి

**ఈశ్వరమ్మకు సంఘీభావం తెలిపిన ఎంఎల్‌సి సత్యం**



**ప్రజాపక్షం/ఎల్‌బినగర్ :** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యులు పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్‌ను బుధవారం సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల ఈశ్వరమ్మపై తెలంగాణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేసి అవమానించిన నేపథ్యంలో ఆమెను హైదరాబాద్‌లోని నివాసంలో పరామర్శించిన నెలికంటి సత్యం ఈశ్వరమ్మ యాదవ్‌కు ధైర్యం చెప్పారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడు ప్రజా పతినిధులు, రాజకీయ నాయకులు పరస్పర గౌరవించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మహిళల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయడం సమాజానికి మంచిది కాదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

# విద్యార్థుల జీవితాలతో కేంద్రం చెలగాటం

టిపిసిసి అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశంలో విద్యా విధానాన్ని కేంద్ర ప్రభుత్వం పూర్తిగా వ్యాపారంగా మార్చి విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్ తీవ్రంగా విమర్శించారు. 'నీట్ పేపర్ లీకేజీతో లక్షలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర మనోవేదనకు గురయ్యారు. విద్యా వ్యవస్థలో చోటుచేసుకున్న వైఫల్యాలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలి' అని ఆయన డిమాండ్ చేశారు. హైదరాబాద్ బోయినపల్లిలో నిర్వహించిన 'ఛత్రోంకి గూంజ్' కార్యక్రమంలో మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమానికి కన్వీనర్, ప్రభుత్వ విప్ డాక్టర్ బల్మూర్ వెంకట్, ఎమ్మెల్యే శ్రీగణేష్, కార్పొరేషన్ చైర్మన్లు, మాజీ కేంద్ర మంత్రి ఎస్.వేణుగోపాల్ చారి, కాంగ్రెస్ అనుబంధ సంఘాల నాయకులు, విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, దేశంలో విద్యా విధానాన్ని కేంద్ర ప్రభుత్వం పూర్తిగా వ్యాపారంగా మార్చిందని, ఉద్యోగ, విద్యా పోటీ పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీలతో లక్షలాది మంది విద్యార్థులు, యువత భవిష్యత్తును అంధకారంలోకి నెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. నీట్ సహా పలు జాతీయ స్థాయి పరీక్షల్లో జరిగిన పేపర్ లీకేజీలు దేశ విద్యా వ్యవస్థపై విద్యార్థులు, తల్లిదండ్రుల విశ్వాసాన్ని దెబ్బతీశాయన్నారు. ఇన్ని ఆరోపణలు, ఆధారాలు వెలుగులోకి వచ్చినప్పటికీ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయకపోవడం దురదృష్టకరమని, ఆయనపై కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం మరింత బాధాకరమని విమర్శించారు. విద్యార్థుల హక్కులను కాపాడేందుకు, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికే లోక్‌సభలో ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా 'ఛత్రోంకి గూంజ్' కార్యక్రమాన్ని చేపట్టారని తెలిపారు. ఈ ఉద్యమంలో ప్రతి విద్యార్థి, ప్రతి యువకుడు భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పరీక్షల నిర్వహణలో పూర్తి పారదర్శకత, జవాబుదారీతనం కలిగిన వ్యవస్థను కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని ఆయన కోరారు. దేశ విద్యా వ్యవస్థను రక్షించేందుకు, విద్యార్థుల భవిష్యత్తు ను కాపాడేందుకు జరుగుతున్న ఈ ఉద్యమానికి విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున మద్దతు తెలపాలని మహేష్ కుమార్ గౌడ్ విజ్ఞప్తి చేశారు.

# ప్రతి ఉద్యమకారుడికీ న్యాయం చేస్తాం

నిజామాబాద్, కామారెడ్డి, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల ముఖాముఖిలో పేర్కొన్న కమిటీ




**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఉద్యమకారుల ప్రతి డిమాండ్‌ను సానుకూలంగా నమోదు చేస్తున్నామని, ఒక్క నిజమైన ఉద్యమకారుడికి కూడా అన్యాయం జరగకుండా చూస్తామని కమిటీ సభ్యులు హామీ ఇచ్చారు. తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ ఆధ్వర్యంలో అమరవీరుల స్మారక చిహ్నం (అమరదీపం) వద్ద నిజామాబాద్, కామారెడ్డి, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల ఉద్యమకారులతో బుధవారం ముఖాముఖి సమావేశం నిర్వహించారు. కమిటీ చైర్మన్ డా.కె.కేశవరావు, సభ్యుడు ప్రొఫెసర్ ఎం. కోదండరామ్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు మోతె శోభన్ రెడ్డి, ఎస్. రాములు నాయక్ పాల్గొని ఉద్యమకారుల అభిప్రాయాలు, ఆధారాలను పరిశీలించారు. సమావేశంలో ఉద్యమకారులు 250 గజాల ఇంటి స్థలం, గౌరవప్రదమైన నెలవారీ పెన్షన్, ఉద్యమకారుల పిల్లలకు విద్య, ఉద్యోగాల్లో ప్రత్యేక కోటా, మహిళా ఉద్యమకారులకు ప్రత్యేక పథకాలు, ఉచిత కార్పొరేట్ వైద్యం, కెజి నుంచి పిజి వరకు ఉచిత విద్య, ఆర్‌టిసి బస్సుల్లో జీవితకాల ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరారు. జూలై 22 వరకు జిల్లా ల వారీగా ముఖాముఖి సమావేశాలు కొనసాగించి, సమగ్ర నివేదికను సిఎం రేవంత్ రెడ్డికి సమర్పిస్తామని కమిటీ చైర్మన్ డా.కేశవరావు తెలిపారు.

# దేశవ్యాప్తంగా పారక్వాట్ గడ్డి మందు నిషేధాన్ని స్వాగతిస్తున్నాం

తెలంగాణ రైతు కమిషన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశవ్యాప్తంగా పారక్వాట్ (గడ్డి మందు)ను నిషేధిస్తూ కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయడం శుభపరిణామమని తెలంగాణ వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని బిఆర్‌కె భవన్‌లోని రైతు కమిషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి, కమిషన్ సభ్యులు భూమి సునీల్, గోపాల్ రెడ్డి, రాములు నాయక్, కోహెడ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, కమిషన్ స్పెషల్ ఆఫీసర్ కేశవులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా చైర్మన్ కోదండరెడ్డి మాట్లాడుతూ పారక్వాట్ గడ్డి మందు వల్ల దేశవ్యాప్తంగా 4,200 మంది పైగా రైతులు, వ్యవసాయ కూలీలు, అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోయారని, తెలంగాణలోనే 200 మంది మృ తి చెందడం ఆందోళనకరమన్నారు. పెద్దపల్లి జిల్లాలో ఇప్పటికీ ఓ గర్భిణి ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్న విషయాన్ని గుర్తు చేశారు.పారక్వాట్ అత్యంత ప్రమాదకరమైనదని వైద్య నిపుణులు రైతు కమిషన్ దృష్టికి తీసుకురావడంతో, దానిని నిషేధించాలని ఈ ఏడాది మార్చి 16న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలి సి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. అనంతరం తెలంగాణ శాసనసభలో ఏకగ్రీవంగా తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపగా, కేంద్రం దేశవ్యాప్తంగా నిషేధ నిర్ణయం తీసుకోవడం సంతోషకరమన్నారు. పారక్వాట్‌తో పాటు గ్లైఫోసేట్ కలుపు మందు, హెచ్‌టిబీటీ పత్తి విత్తనాలపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని కొదండరెడ్డి డిమాండ్ చేశారు. రసాయనాల అధిక వినియోగం రైతుల సమస్య మాత్రమే కాదని, ప్రజారోగ్యానికి కూడా ముప్పుగా మారిందని కమిషన్ సభ్యులు భూమి సునీల్ పేర్కొన్నారు. సమస్య తీవ్రరూపం దాల్చిన తర్వాత చర్య లు తీసుకోవడం కంటే ముందస్తు నివారణ చర్యలే శాశ్వత పరిష్కారమని అభిప్రాయపడ్డారు. వ్యవసాయ రంగానికి మరింత ప్రాధాన్యం కల్పించి తగిన నిధు లు కేటాయించాలని, వ్యవసాయ చట్టాలపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని కోరారు. మరోవైపు విషపూరితమైన గడ్డి కలుపు మందుల వల్ల పశువులు సైతం బలవుతున్నాయని మరో సభ్యులు గోపాల్ రెడ్డి తెలిపారు. పారక్వాట్ గడ్డి మందుతో ఎక్కువగా రైతు, రైతు కూలీలే ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం బ్యాన్ చేయడం సంతోషమన్నారు.



# సిపిఐతో కాంగ్రెస్‌కు ఎలాంటి విభేదాలు లేవు

మా మైత్రి కొనసాగుతుంది : మహేష్ కుమార్ గౌ డ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** "సిపిఐతో కాంగ్రెస్ పార్టీ మైత్రి కొనసాగుతుంది. కాంగ్రెస్‌కు సిపిఐ మిత్రపక్షమే. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుతో తమకు ఎలాంటి విభేదాలు లేవు. ఆయన అంటే మాకు గౌరవం" అని టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. స్థానిక సమస్యలను స్థానికంగానే పరిష్కరించుకోవాలని, ప్రతి చిన్న విషయానికి గాంధీభవన్‌కు రావద్దని కాంగ్రెస్ శ్రేణులకు ఆదేశించినట్లు ఆయన చెప్పారు. కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు రేణుకా చౌదరి వ్యాఖ్యలపై ఆమెతో చర్చించానని, ఆమె వ్యాఖ్యలను తప్పుగా ప్రచారం చేశారని, ఖమ్మంలో బిజెపి, బిఆర్‌ఎస్ కాంగ్రెస్ వైపు చూస్తున్నాయని మాత్రమే ఆమె అన్నారన్నారని మహేష్‌కుమార్ గౌడ్ వివరించారు. గాంధీభవన్‌లో బుధవారం తనను కలిసిన మీడియా ప్రతినిధులతో మహేష్‌కుమార్ గౌడ్ ఇష్టాగోష్టిగా మాట్లాడారు. నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియ ప్రారంభమైందని, ఈ నెలాఖరులోగా నామినేటెడ్ ప దవుల భర్తీ పూర్తి చేస్తామని మహేష్‌కుమార్ గౌడ్ వెల్లడించారు. సుమా రు 50 నామినేటెడ్ పదవులను భర్తీ చేస్తామని, త్వరలో డైరెక్టర్ పదవుల భర్తీని కూడా చేపడతామన్నారు. నలుగురు, ఐదుగురు మినహా డిసిసి అ ధ్యక్షుల పనితీరు బాగుందని, మరో రెండు రోజుల పాటు సమావేశాలు కొనసాగుతాయన్నారు. పార్టీ మండల కమిటీల నియామకంలో డిసిసిల నిర్ణయమే ఫైనల్ అని మహేష్‌కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

# బలమైన భవిష్యత్తుకు బాల్యమే పునాది

**చిన్నారులకు నాణ్యమైన పోషకాహారం, విద్య, సంరక్షణ అందిస్తేనే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించగలం : మంత్రి సీతక్క**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** బలమైన భవిష్యత్తుకు బాల్యమే పునాదిలాంటిదని , చిన్నారులకు నాణ్యమైన పోషకాహారం, విద్య, సంరక్షణ అందిస్తేనే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించగలమని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. నాసిరకం సరుకులు సరఫరా చేసే కాంట్రాక్టర్ల ను బ్లాక్ లిస్ట్‌లో పెడతామని హెచ్చరించారు. వచ్చే నెల నుంచి రాష్ట్రవ్యాప్తంగా బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని అమలు చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. 'మహిళా శిశు సంక్షే మ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పురోగతి'పై జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులతో మంత్రి సీతక్క బుధవారం సచివాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష ని ర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రాల్లో పోషకాహార సరఫరా, టేక్ హోమ్ రేషన్, అంగన్వాడీ తొలిముద్ద (బ్రేక్‌ఫాస్ట్ పథకం), అమ్మ మాట అంగన్వాడీ బాట, నూతన అంగన్వాడీ భవనాల నిర్మాణం, మౌలిక వసతులు, నియామకాలు, బాల్య వివాహాల నివారణ, శిశు రక్షణ, దత్తత ప్రక్రియతో పాటు వివిధ పథకాల బడ్జెట్ విడుదల, వ్యయంపై జిల్లాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ మారు మూల చివరి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని కూడా జిల్లా అధికారులు సందర్శించాలని మంత్రి ఆదేశించారు. జిల్లా మహిళా, శిశు సంక్షేమ అధికారులు, సూపర్‌వైజర్లు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో అందిస్తున్న భోజనం నాణ్యతను పరిశీలించేందుకు డిబ్ల్యుఒలు, సూపర్‌వైజర్లు తరచూ కేంద్రాల్లో భోజనం చేయాలని సూచించారు. గుడ్లు, పప్పు, పాలు, ఇతర పోషకాహార పదార్థాల ఇండెంట్, సరఫరాలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని మంత్రి సీతక్క హెచ్చరించారు. పిల్లలకు నాణ్యమైన ఆహారం అందాలని, గర్భిణులు, బాలింతల విషయంలోనూ ఎలాంటి రాజీ ఉండబోదని స్పష్టం చేశారు. ఇప్పటికే ప్రభుత్వం మంజూరు చేసిన 2,500 నూతన అంగన్వాడీ భవనాల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. అవసరాన్ని బట్టి భవిష్యత్తులో మరో 2,500 నుంచి 3,000 అంగన్వాడీ భవనాల నిర్మాణానికి చర్యలు చేపడతామన్నారు. వలస కార్మికుల పిల్లల కోసం కార్మిక శాఖ సహకారంతో మొబైల్ అంగన్వాడీలను ఏర్పాటు చేశామన్నారు. అంగన్వాడీ వ్యవస్థలో అంకితభావంతో పనిచేస్తున్న అధికారులు, టీచర్లు, ఆయాలను గుర్తించాలని మంత్రి సీతక్క సూచించారు. ఆగస్టు 15 నాటికి ఉత్తమ సేవలందిస్తున్న వారిని ఎంపిక చేసి సన్మానించేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి జిల్లా నుంచి ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఇద్దరు టీచర్లతో త్వరలో సమావేశమై వారి సమస్యలను వింటామని, క్షేత్రస్థాయిలో బాగా పనిచేసే సిబ్బంది అనుభవాలు, సూచనలను స్వీకరించి వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామన్నారు. ఈ సమీక్ష సమావేశంలో రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులు బి. అపర్ణ, మర్రిపల్లి చందన, ప్రేమలతా అగర్వాల్, కంచర్ల వందనగౌడ్, మ హిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి శృతి ఓజా, టిజి ఫుడ్స్ ఎండి చంద్రశేఖర్ రెడ్డి, జాయింట్ డైరెక్టర్ మోతి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ప్రీమియంలకు సరిపడా పాలసీలు పొందాలి

టిజిఎల్ఐ సంచాలకుడు వి.శ్రీనివాసు

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** తెలంగాణ ప్రభుత్వ జీవిత బీమా (టిజిఎల్ఐ) పాలసీదారులైన ఉద్యోగులు, ఉపాధ్యాయులు బీమా అర్హత వయస్సు (56) ఏళ్ల లోపు ఉండి వారి జీతభత్యముల నుంచి నెలసరి బీమా ప్రీమియంలను క్రమం తప్పకుండా తగ్గించుతూ, దానికి సరిపడే విధంగా ప్రతిపాదన పత్రాలు సంబంధిత జిల్లా బీమా కార్యాలయాలకు సమర్పించి, పాలసీలు పొందిఉన్నట్లయితే, వారు మాత్రమే బీమా ప్రయోజనాలకు అర్హులు అవుతారని తెలంగాణ ప్రభుత్వ జీవిత బీమా శాఖ సంచాలకులు వి.శ్రీనివాసు తెలిపారు. కొంతమంది చందాదారులు (ఉద్యోగ, ఉపాధ్యాయులు) బీమా అర్హత వయస్సు 56 సంవత్సరాల లోపు ఉండి ప్రీమియములు (మొదటి/ తదుపరి) క్రమం తప్పకుం డా తగ్గిస్తున్నప్పటికీ, సంబంధిత జిల్లా బీమా కార్యాలయాలలో ప్రతిపాదన ప త్రాలను సమర్పించకపోవడం వలన నేటికీ పాలసీలు పొందియుండలేదని, అ టువంటి వారు అన్నిరకాల బీమా ప్రయోజనాలకు అనర్హులవుతారని తెలిపారు. అనగా, ప్రీమియం (మొదటి/తదుపరి) మినహాయింపులు, పాలసీలు పొందడానికి ప్రతిపాదన పత్రాల సమర్పణ, ఈ రెండు కూడా చందాదారుని వయస్సు (56) సంవత్సరాలు దాటకముందే పూర్తికావాలి అన్నారు. అందువల్ల వారు, వారి డిడిఓలు తగిన చొరవ తీసుకుని సరియైన విధంగా పూరించబడిన పత్రాల ను సంబంధిత జిల్లా బీమా కార్యాలయాలలో సమర్పించి, వాటికి తగిన విధం గా పాలసీలను పొందాలని, ఆ పాలసీలను ఐఎఫ్ఎంఐఎస్ పోర్టల్ నందలి ఉద్యోగుల మాస్టర్ జాబితాలో అప్‌డేట్ కూడా చేసుకోవాలని సంచాలకులు వి.శ్రీనివాసు తెలిపారు.


GHMC గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్
డివిజన్-30, జిహెచ్ఎంసి

| NIT NO. | పని వివరణ | అంచనా విలువ | బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేదీ / ఆఖరి తేదీ & సమయం | అధికారి పేరు & చిరునామా |
|---|---|---|---|---|
| NIT No. 14/E.E-30/GHMC/2026-27, Dated: 14.07.2026 | జిహెచ్ఎంసి, కెజడ్, డివిజన్-30 క్రింద వివిధ సివిల్ ఇంజనీరింగ్ పనులు | రూ. 110.70 లక్షలు | బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ: 15.07.2026 ఉ.11:00గం.లకు, మరియు బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేదీ & సమయం : 18.07.2026 ఉ.11:00గం.ల వరకు. | ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-30, జిహెచ్ఎంసి 5వ అంతస్తు, అబిడ్స్ పార్కింగ్ కాంప్లెక్స్, అబిడ్స్, హైదరాబాద్. |

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్‌లో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-30, జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 6099-PP/CL/ADVT/2026-27, Date: 15-07-2026

# విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలి

కలెక్టర్, ప్రభుత్వసలహాదారు సుదర్శన్‌రెడ్డి

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులున్నారని, అంకితభావంతో విధులు నిర్వర్తిస్తూ నాణ్యమైన విద్యను బోధించటంతో విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్‌రెడ్డి సూచించారు. జిల్లాలో ఉత్తీర్ణత మెరుగుపడిందని, ఇదే స్ఫూర్తితో కృషి చేస్తూ నూటికి నూరు శాతం ఉత్తీర్ణత నమోదయ్యేలా చొరవ చూపాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో గురువారం జిల్లా విద్యాశాఖ పనితీరుపై కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్సియల్ స్కూల్స్, గురుకులాల నిర్వహణ తీరుతెన్నులు సాధించిన ఫలితాలు, మౌలిక సదుపాయాల స్థితిగతులు తదితర అంశాలపై సమీక్ష జరిపి అధికారులకు దిశానిర్దేశంచేశారు. విద్యారంగానికి సిఎం రేవంత్‌రెడ్డి ఎనలేని ప్రాధాన్యతనిస్తున్నారని, ప్రభుత్వపాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కోట్లాది రూపాయలను వెచ్చిస్తున్నారన్నారు. విద్యా ప్రమాణాలను మెరుగుపర్చే విషయంలో ప్రభుత్వం ఎంతమాత్రం రాజీ పడబోదని సుదర్శన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఒక్కో విద్యా సంస్థకు 200 కోట్ల చొప్పున ఖర్చు చేస్తూ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ స్కూల్స్‌ను ఏర్పాటు చేస్తోందన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ విద్యారంగంలో నిజామాబాద్ జిల్లా పనితీరు సంతృప్తికరంగా ఉందన్నారు. ప్రభుత్వ బడులలో విద్యార్థులు ప్రవేశాల విషయంలో రాష్ట్రంలో జిల్లా 5వ స్థానంలో ఉందని, ఈ నెలాఖరు వరకు లక్ష్యానికనుగుణంగా ప్రవేశాలు పూర్తి చేసి జిల్లాను ముందంజలో నిలుపుతామని తెలిపారు. గత యేడాదితో పోలిస్తే ప్రస్తుత విద్యా సంవత్సరంలో 21 శాతం మేర ఎక్కువ ప్రవేశాలు జరిగాయని, నెలాఖరు నాటికి మరో 7శాతం ప్రవేశాలు పెంపొందించేలా కార్యాచరణతో ముందుకెళుతున్నామన్నారు.అన్ని స్కూల్స్ తో పాటు పాఠశాలల్లోనూ మంచి ఫలితాలు వచ్చాయని వివరించారు.ఎస్‌ఎస్‌సిలో టాపర్లుగా నిలిచిన లహారిక, సౌజన్య, సంజన, లాస్య, అభిజ్ఞ తదితరులకు జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించగా సుదర్శన్‌రెడ్డి తరపున ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున నగదు పారితోషికం అందించి ప్రోత్సహించారు. కార్యక్రమంలో తాహెర్‌బిన్ హందాన్, గంగాధర్, భుజంగరావు, రాజిరెడ్డి, శేఖర్‌గౌడ్, అశోక్, సాయగౌడ్, అధికారులు, ఆర్‌సీఓలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.




## రికార్డులు సక్రమంగా.. నిర్వహించకపోతే చర్యలు

కలెక్టర్ హరిత



**ప్రజా పక్షం/పెంచికల్‌పేట్ :** రికార్డుల నిర్వహణలో లోపాలు పునరావృతమైతే పంచాయితీ కార్యదర్శి సర్పంచ్‌పై చట్టపరమైన శాఖాపరమైన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ హరిత హెచ్చరించారు. కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేట్ మండలంలోని చేద్వాయి గ్రామపంచాయతీలో బుధవారం ఆమె ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధి నిధుల వినియోగంపై పంచాయతీ కార్యదర్శి సర్పంచ్‌ను నిలదీశారు. గ్రామాభివృద్ధి కోసం ఇప్పటివరకు ఎంత నిధులు వచ్చాయి ఏ పనులకు ఎంత మొత్తం ఖర్చు చేశారు అనే వివరాలను వెంటనే చూపించాలని ఆదేశించారు. గ్రామపంచాయతీకి సంబంధించిన ప్రతి రూపాయి ఆదాయం ఖర్చు వివరాలు రిజిస్టర్లలో రికార్డుల్లో స్పష్టంగా నమోదు చేసి అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. అధికారులు అడిగినప్పుడు వెంటనే చూపించగలగాలని రికార్డులు లేకపోవడం సరైన సమాధానాలు చెప్పకపోవడం తీవ్రమైన నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు. వచ్చిన నిధులు చేపట్టిన అభివృద్ధి పనులు వాటికి చేసిన ఖర్చుల వివరాలను సమగ్రంగా సిద్ధం చేసి సమర్పించాలని ఆమె ఆదేశించారు.

## పకడ్బందీగా భూముల రీ సర్వే ప్రక్రియ

అదనపు కలెక్టర్ వి. రాములు



**ప్రజాపక్షం/మంచిర్యాల :** ప్రభుత్వం చేపట్టిన భూముల రీ సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ వి రాములు స్పష్టం చేశారు. భీమారం మండలంలోని మద్దికల్ గ్రామంలో జరుగుతున్న భూముల రీ సర్వే కార్యక్రమాన్ని బుధవారం ఆయన మండల తహసిల్దార్ తో కలిసి పరిశీలించారు. మద్దికల్ గ్రామంలో మొత్తం 853 సర్వే నంబర్లలో 4 వేల 810 ఎకరాల విస్తీర్ణం గల భూమి ఉందని, ముగ్గురు లైసెన్స్‌డ్ సర్వేయర్లు, ఒక సర్వేయర్ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్, ప్రజా ప్రతినిధులు, రైతుల సమక్షంలో సర్వే పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రీ సర్వే ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా నిర్వహించాలని ఆదేశించారు. తద్వారా భవిష్యత్తులో భూ వివాదాలకు అవకాశం ఉండదని, స్పష్టమైన వివరాలతో నక్షా రూపొందించడం జరుగుతుందని వివరించారు. అనంతరం మండలంలోని ఆరెపల్లి గ్రామం, భీమారం మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించి ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పురోగతిని సమీక్షించారు. ఎన్యుమరేషన్ ఫారాల డిజిటైజేషన్ పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా ఎస్ ఐ ఆర్ ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆ తర్వాత అంకుశాపూర్ గ్రామంలోని సమతా అగ్రో ఇండస్ట్రీస్‌ను పరిశీలించి మిల్లింగ్ ప్రక్రియను వేగవంతం చేసి ప్రభుత్వానికి అందించాల్సిన సిఎమ్‌ఆర్ బియ్యాన్ని నిర్దేశిత గడువులోగా సరఫరా చేయాలని రైస్ మిల్లు నిర్వాహకులకు సూచించారు.

## ఎన్యూమరేషన్ ఫారాలు ఆన్ లైన్‌లో పూర్తి

కలెక్టర్ భవేశ్ మిశ్రా



**ప్రజా పక్షం/భైంసా :** ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ఎన్యుమరేషన్ ఫాం ల డిజిటలైజేషన్ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.బుధవారం సాయంత్రం భైంసా పట్టణంలో ఎస్ఐఆర్ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు.పంపిణీ చేసిన ఎస్ఐఆర్ ఫాంలు,పూర్తి చేసిన ఆన్ లైన్ ప్రక్రియ, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రక్రియను మొత్తం పూర్తి పారదర్శకంగా పూర్తిచేయాలని ఆదేశించారు.అనంతరం నిర్మల్ పట్టణంలోని 24 వ వార్డులో ఎస్ఐఆర్ తీరును పరిశీలించారు.ఆన్ లైన్ ప్రక్రియకు సంబంధించిన పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. బిఎల్‌ఓ యాప్ ను పరిశీలించారు.స్థానిక ఓటర్లతో మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ఫారములు పూరించి, వెంటనే ఫారములు బిఎల్‌ఓ లకు అందించాలని తెలిపారు.భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, తహసిల్దార్లు శశిభూషణ్,రాజు,ఎంపీడీవో నీరజ్, స్థానిక ప్రజాప్రతినిధులు,ఇతర అధికారులు,సిబ్బంది, పాల్గొన్నారు.

## కరుణించని వరణుడు

వర్షపు జాడలేక ఆందోళన చెందుతున్న రైతు

**ప్రజాపక్షం/ముధోల్ :** ముధోల్ నియోజకవర్గ కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో గత 15 నుండి 20 రోజులుగా వర్షపు చుక్కనీరు లేక పంటలు ఎండిపోయే దశకు చేరాయి.ప్రతి సంవత్సరం కంటే ఈ సంవత్సరం వర్షం సాధారణం కంటే తక్కువగానే కురవడం పెద్ద ఆందోళనగా మారింది.ఇప్పటికే రైతులందరు తమ పంట పొలాల్లో విత్తనాలు విత్తి వరణుడి రాకకోసం ఆకాశం వైపు చూస్తూ నివ్వెరపోతున్నారు.విత్తనాల ధరలు పెరిగిన వేళ రైతులకు వాతావరణం సహకరించకపోవడం కోలుకోలేని దెబ్బగా మారింది.కొందరు రైతులు మొదటి సారి విత్తినప్పుడు మొలకలు వెళ్లని రైతులు రెండు సార్లు విత్తి ఇప్పటికే ఆర్థిక సంక్షోభంలో ఉన్నారు. కనీసం ఇప్పుడైనా వర్షం కురిసి కుంగిపోతున్న పంటలను కాపాడుతుందేమోనని అనుకుంటున్న తరుణంలో వర్షాలు కురవకపోవడమే కాక తీవ్రమైన ఎండ కొడుతోంది.దీంతో మొక్కలు వాడిపోవడమే కాకుండా తీవ్రమైన వేడిమీతో మనుషులు సైతం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.బోరు మోటార్లు ఉన్న రైతులు తమ పంటలను కాపాడుకోవడానికి స్ప్రింక్లర్లతో, డ్రిప్‌లతో భూమిని తడుపుతున్నారు. ఎంత తడిపిన పై వర్షం లేక పంటలు దిగుబడి సాధించడం కష్టమేనని రైతులు వాపోతున్నారు.అయితే బోరు మోటార్లు ఉన్న రైతులు ఎంతో కొంత తమ భూమిని తడిపి పంటలను కాపాడుకోగా బోర్లు లేని రైతుల పరిస్థితేంటో ప్రశ్నార్థకంగా మారింది. వీరితో పాటు వ్యవసాయమే జీవనాధారంగా బతుకుతున్న కౌలు రైతుల దుస్థితి మరింత చిన్నాభిన్నం అయ్యేలా ప్రతికూల వాతావరణంలో కొట్టుమిట్టాడుతున్నారు. రానున్న ఒకటి రెండు రోజుల్లో వర్షం కురవని యెడల పంటలు ఎండిపోయి నేలకు రాలడం ఖాయమని రైతులు తమ ఆవేదన వెళ్ళబుచ్చుకుంటున్నారు.వర్షం కురిసి పంటలకు ప్రాణం వస్తుందా లేక పంటలు నేలరాలి రైతుల జీవితాల్లో సంక్షోభాన్ని మిగిలిస్తుందా చూడాలి.



## ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

కలెక్టర్ కుమార్ దీపక్




**ప్రజా పక్షం / నస్పూర్ :** వివిధ అనారోగ్య సమస్యలతో ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ స్పష్టం చేశారు. బెల్లంపల్లి మండల కేంద్రంలోని వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రిని బుధవారం ఆయన సందర్శించి వార్డులు, మందుల నిల్వలు, రిజిస్టర్లు, రోగులకు అందిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులతో స్నేహపూర్వకంగా మెదలాలని గర్భిణులు తప్పనిసరిగా ఆసుపత్రులలోనే ప్రసవాలు చేసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. వర్షాకాలం అయినందున అంటు వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు వివరించడంతో పాటు అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. వైద్యులు సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని పేర్కొన్నారు.బెల్లంపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం వినోద్ తో కలిసి మండల కేంద్రంలో చేపట్టిన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని సూచించారు. సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని సందర్శించి భూభారతి దరఖాస్తుల పరిష్కార పురోగతిని సబ్ కలెక్టర్ మనోజ్ తో కలిసి పరిశీలించారు. అనంతరం కాసిపేట మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి అదనపు గదులు భోజనశాల నిర్మాణ పనులను పరిశీలించారు.

## సాంఘిక బహిష్కరణ చేసిన వారిపై చర్యలు

రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు వినతి



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** సాంఘిక బహిష్కరణ చేసిన వారిపై చర్యలు తీసకోవాలని రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి కమీషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు గ్రామ మాదిగ సంఘ సభ్యులు, విద్యార్థి సంఘాల నాయకులు వినతిపత్రం అందజేశారు. బుధవారం జిల్లాకు విచ్చేసిన రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆధ్వర్యంలో గన్నారం గ్రామ పంచాయతీ ఆవరణలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఇందల్వాయి మండలం గన్నారం గ్రామంలోని భూమి విషయంలో ఇబ్బందులకు గురి చేస్తున్నారని గ్రామాభివృద్ధి కమిటీ, సర్పంచ్ ఎస్‌సి (మాదిగ) సంఘ సభ్యులపై సామాజిక బహిష్కరణ విధించటం, విడిసి ఆదేశాలను ఉల్లంఘించినందుకు బిసి కులానికి చెందిన ఇతర గ్రామస్తుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేసిన విషయమై గన్నారం గ్రామానికి చెందిన డి.మహేష్(24) విన్నవించారు. జూన్ 14న ఇందల్వాయి పిఎస్ ఎస్‌హెచ్‌ఓకు ఫిర్యాదు చేశామని మే 10 నుంచి గన్నారం గ్రామాభివృద్ధి కమిటీ (విడిసి) సభ్యులు గన్నారం గ్రామంలోని ఎస్సీ(మాదిగ) సంఘానికి చెందిన సభ్యులందరిపై సామాజిక బహిష్కరణ విధించారని తెలిపారు. గ్రామంలోని ఇతర కులాలకు చెందిన వ్యక్తులు ఎవరూ ఎస్‌సి(మాదిగ) సంఘ సభ్యులతో మాట్లాడకూడదని వారికి ఎటువంటి పని ఇవ్వకూడదని, వారి వద్ద పని చేయకూడదని వారితో ఎటువంటి సామాజిక లేదా ఆర్థిక సంబంధాలు కొనసాగించకూడదని ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. జూన్ 4న ఎస్‌సి(మాదిగ) సంఘ సభ్యులు గన్నారం గ్రామంలో పోచమ్మ పండగను నిర్వహించటానికి ప్రయత్నించినప్పుడు గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామ సర్పంచ్ గుండా సుజాత ఆమె భర్త గుండా శ్రీనివాస్ కలిసే కుమ్మరి కులానికి చెందిన వారిని పండగకు అవసరమైన కుండలు విక్రయించకుండా అడ్డుకున్నారన్నారు. ఆలయంలో పూజలు, సాంప్రదాయ కార్యక్రమాలు నిర్వహించే గుండ్ల కుల పెద్దలను కూడా ఆ పండగలో పాల్గొనకుండా అడ్డుకుని మా పట్ల సామాజిక బహిష్కరణను అమలు చేశారన్నారు. గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు ఎస్‌సి (మాదిగ) సంఘ సభ్యుల కోసం ఎవరూ పని చేయకూడదని ఇతర కులాలకు చెందిన ఎవరైనా ఎస్‌సి(మాదిగ) సంఘ సభ్యులను పనిలో పెట్టుకున్నా వారికి ఏ విధమైన పని చేసినా, ప్రతి ఉల్లంఘనకు రూ.50 వేలు జరిమానా విధిస్తామని ప్రకటించారన్నారు.ఈ అక్రమ ఆదేశాలను ఉల్లంఘించినందుకు గన్నారంకు చెందిన మున్నూరు కాపు కుల సభ్యులపై లక్ష పది వేల జరిమానా విధించగా గన్నారంకు చెందిన గుండా శ్రీనివాస్‌కు రూ.80 వేలు జరిమానా విధించారన్నారు. ఇలా ఇబ్బందులకు గురి చేస్తున్న వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుని మాకు న్యాయం చేయాలని కోరారు. ఇబ్బందులకు గురి చేస్తూ బహిష్కరణ అరెస్ట్ చేయాలని ఎసిపికి ఆదేశించారు. మళ్లీ సర్వే చేయాలని తహసీల్దార్‌కు చెప్పారు.

## ఎన్యూమరేషన్ ఫారాలు త్వరగా సమర్పించాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్)లో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాల సమర్పణ గడువు ముగియనున్న నేపథ్యంలో ఓటర్లు త్వరితగతిన తమ ఫారంను బిఎల్‌ఓలకు అందజేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. వివరాలను డిజిటలైజ్ చేయాల్సి ఉందన్నారు. అంతేకాకుండా అబ్సెంట్, షిఫ్టెడ్, డెత్/డిలీటెడ్(ఎఎస్‌డి) ఓటర్ల జాబితాను సైతం రూపొందించాల్సి ఉన్నందున చివరి నిమిషం వరకు వేచి చూడకుండా వెంటాదివెంట ఎన్యుమరేషన్ ఫారాలను బిఎల్‌ఓలకు అందించాలన్నారు. ప్రత్యేకించి నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గ పరిధిలోని ఓటర్లు ఫారం అందజేసే విషయంలో తాత్సారం చేయవద్దని సూచించారు. ఎన్యుమరేషన్ ఫారమందించటంలో నిర్లక్ష్యం వహిస్తే ఓటరు జాబితా నుండి పేరు గల్లంతవుతుందని తెలిపారు. ఒకవేళ ఎవరికైనా గత 2002 ఎస్ఐఆర్ వివరాలు తెలియకపోతే సర్కిల్ వారిగా నెలకొల్పిన హెల్ప్‌డెస్క్‌ను, లేదా బీఎల్‌ఓలను సంప్రదించాలని సూచించారు. అయినప్పటికీ వివరాలు తెలియని పక్షంలో ప్రస్తుత ఓటరు జాబితా వివరాలు పొందుపర్చి ఫారం సమర్పించవచ్చన్నారు. అలాంటి వారి పేరు కూడా ముసాయిదా ఓటరు జాబితాలో చేర్చబడుతుందని తెలిపారు. వారికి ఎన్నికల రిటర్నింగ్ అధికారి నోటీసు జారీ చేసే హియరింగ్‌కు పిలుస్తారని, ఎన్నికల సంఘం నిర్ధేశించిన 13 రకాల గుర్తింపు ధృవీకరణ పత్రాలలో ఏదైనా ఒక దానిని చూపిస్తే ఓటరు తుది జాబితాలో పేరు చేరుస్తారన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రతి ఓటరు తప్పనిసరిగా ఎన్యుమరేషన్ ఫారం అందజేయాలని సూచించారు. ఈ విషయంలో బూత్ లెవల్ ఏజెంట్లు క్షేత్రస్థాయిలో ఉంటూ క్రియాశీలక పాత్ర పోషించాలని, ప్రతిరోజు ఓటర్ల నుండి 50 చొప్పున ఫారాలు సేకరించి బీఎల్‌ఓలకు అందించేలా చొరవ చూపాలన్నారు. ఈఆర్‌ఓలు, ఎఈఆర్‌ఓలు కూడాఎన్యుమరేషన్ ఫారాల సేకరణ, వాటి డిజిటలైజేషన్ ప్రక్రియలు వేగవంతమయ్యేలా పర్యవేక్షణ జరపాలని కలెక్టర్ సూచించారు. అందుబాటులో లేని చనిపోయిన శాశ్వతంగా వలస వెళ్లిన, రెండు చోట్ల ఓటు కలిగిన ఓటర్ల పేర్లను గుర్తిస్తూ పక్కాగా జాబితాను రూపొందించి, వాటిపై బిఎల్‌ఏల సంతకాలు తీసుకోవాలన్నారు.



## సిసి రోడ్డు పనులు పరిశీలిన

మున్సిపల్ చైర్ పర్సన్ రాధికా భూపతి రాజు



**ప్రజాపక్షం/మెదక్ :** మెదక్ పట్టణంలో 12 వార్డు జర్నలిస్ట్ కాలనీలో టియుఎఫ్‌ఐడిసి నిధులు కోటి రూపాయలతో చేపడుతున్న అంతర్గత సిసి రోడ్డు పనులను మున్సిపాలిటీ డిఇఇ సత్యనారాయణతో కలిసి బుధవారం మున్సిపల్ చైర్ పర్సన్ కానుగు రాధికా భూపతి రాజు పరిశీలించారు.జర్నలిస్టు కాలనీలో ఉన్న సమస్యలను స్థానిక ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు మైనంపల్లి హనుమంతరావు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారిస్తామన్నారు. ప్రస్తుతం ఉన్న రూ. కోటి రూపాయలతో జర్నలిస్టు కాలనీ నుంచి 6 మీటర్ల వెడల్పుతో సీ సీ నిర్మాణం పనులు జరుగుతున్నాయని, మిగిలిపోయిన పనులు బస్తీ దావఖానా నుంచి మెదక్ వెల్దుర్తి ప్రధాన రోడ్డు వరకు పూర్తి చేసేందుకు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామన్నారు. డబుల్ బెడ్ రూమ్ కాలనీ ప్రజల రోడ్డు సమస్య పరిష్కారం కానుందిఅన్నారు.కాంగ్రెస్ సీనియర్ నాయకులు భూపతి రాజ్, మున్సిపల్ ఇంజనీరింగ్ వర్క్ ఇన్స్పెక్టర్లు సైట్ వర్క్ ఇన్‌స్పెక్టర్ ఉదయ్, జర్నలిస్టులు ఉన్నారు.

## 'పోక్సో' చట్టంపై అవగాహన సదస్సు



**ప్రజాపక్షం/బోథ్ :** ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో భాగంగా బుధవారం మర్లపెల్లి గ్రామంలో ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. విద్యార్థులకు పోక్సో చట్టం 2012 గురించి వివరిస్తూ ఈ చట్టంలో గల సెక్షన్లు శిక్షల గురించి విద్యార్థుల కు వివరించారు.విద్యార్థులకు సేఫ్ టచ్ ఆన్ సేఫ్ టచ్ గురించి తెలిపారు.విద్యార్థులందరూ మొబైల్ కి సోషల్ మీడియా కి దూరంగా ఉంటూ చదువుపై శ్రద్ధ పెంచుకొని మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉపాధ్యాయులు షబ్బీర్,విద్యార్థులు పాల్గొన్నారు.

## వార్షిక తనిఖీలలో భాగంగా డిఎస్‌పి కార్యాలయం తనఖీ

జిల్లా ఎస్‌పి పరితోష్ ఫంకజ్

**పజాపక్షం/సంగారెడ్డి :** వార్షిక తనిఖీలో భాగంగా బుదవారం రోజు (15–07–2026) పటాన్‌చెరు సబ్‌డివిజన్ పోలీసు అధికారి కార్యాలయాన్ని జిల్లా ఎస్‌పి పరితోష్ పంకజ్ సందర్శించి డీఎస్‌పితో కలిసి మొక్కను నాటారు. డిఎస్‌పి కార్యాలయ రికార్డులను దర్యాప్తులో ఉన్న గ్రేవ్ కేసులను పరిశీలిస్తూ వివిధ విభాగాల పనితీరును సమీక్షించారు. ఎస్సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులు పోక్సో కేసులు, అత్యాచార కేసులు డౌరీ కేసుల్లో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి బాదితులకు త్వరితగతిన పరిష్కరించాలని ప్రతి కేసులో చట్టపరమైన నిబందనలు పాటిస్తూ సమగ్ర దర్యాప్తు నిర్వహించాలని డిఎస్‌పికి సూచనలు చేశారు. పటాన్‌చెరు సబ్ డివిజన్ హైదరాబాద్ పరివాహక ప్రాంతం కావడం వలన ఉపాది కూలీలు, ఉద్యోగు ల రాకపోకల కారణంగా అధిక ట్రాపిక్ సమస్య ఉంటుందని ఈ ప్రాంతంలో అదిక సంఖ్యలో పరిశ్రమలు ఉండటంతో వలస కార్మికులు ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున ఆస్తి సంబందిత నేరాలు జరిగే అవకాశాలు కూడా అదికంగా ఉంటాయని అన్నారు. నేరాల అదుపునకు సబ్ డివిజన్ పరిదిలో కమ్యూనిటీ కాంట్రాక్ట్ కార్యక్రమాలనునిర్వహిస్తూ అనుమానిత వ్యక్తులు అనుమానాస్పద వాహనాలను గుర్తించి అవసరమైతే ఆదుపులోకి తీసుకోవాలని సూచించారు. రికార్డుల నిర్వహణ, సంతృప్తికరంగా ఉన్నాయని పేర్కొంటూ అదికారులు సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. పటాన్‌చేరు డిఎస్‌పి ప్రభాకర్ డిఎస్పీ కార్యాలయం సిబ్బంది ఉన్నారు.



## ఆరోగ్య,మౌలిక, వసతుల అభివృద్ధికి శ్రీకారం

ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



**ప్రజాపక్షం/తానూర్ :** గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా బుధువారం తానూర్ మండలంలోని జవ్లాబి గ్రామంలో ఆయుష్మాన్ భారత్ పథకం కింద నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్ర భవనాన్ని,ప్రభుత్వ పాఠశాల ప్రహరీ గోడను ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కోలూర్ గ్రామంలో నూతన ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో చిన్న చిన్న ఆరోగ్య సమస్యలకే ప్రజలు పట్టణాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం గ్రామాలకే వైద్య సేవలు చేరేలా ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాల నిర్మాణం చేపడుతున్నామని పేర్కొన్నారు. మండల అభివృద్ధికి అత్యంత కీలకమైన 27 ప్యాకేజ్ పనులు పూర్తయితే మండలం పూర్తిగా సస్యశ్యామలం అవుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సాగునీటి వసతులు మెరుగుపడి వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటాయని,రైతుల ఆర్థిక పరిస్థితి మరింత బలోపేతం అవుతుందని అన్నారు.ఈ అంశాలను తాను పలుమార్లు తెలంగాణ శాసనసభలో ప్రస్తావించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.వ్యవసాయాభివృద్ధికి గ్రామీణ రహదారులు కూడా ఎంతో కీలకమని పేర్కొన్న ఎమ్మెల్యే, రైతులు తమ పంట పొలాలకు సులభంగా వెళ్లేందుకు అవసరమైన వ్యవసాయ రహదారులను కేంద్ర ప్రభుత్వ ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మించుకోవాలని సూచించారు.రైతులందరూ ఐక్యంగా ముందుకు వచ్చి గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామాల అభివృద్ధికి విద్య, వైద్యం,సాగునీరు,రహదారులు వంటి మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని దశలవారీగా అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు,అధికారులు,వైద్య శాఖ సిబ్బంది,మండల నాయకులు, రైతులు, గ్రామ పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## గ్యాస్ సిలిండర్ పేలి ఐదుగురికి తీవ్ర గాయాలు

ఇద్దరి పరిస్థితి విషమం : ఎస్ఐ సుభాష్ గౌడ్

**ప్రజాపక్షం/మనోహరాబాద్:** మనోహరాబాద్ మండలంలోని పరికిబండ గ్రామ శివారులో మంగళవారం రాత్రి గ్యాస్ లీకేజీ కారణంగా పేలుడు సంభవించి అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో బీహార్ రాష్ట్రానికి చెందిన ఐదుగురు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. ఇందులో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. విషయం తెలుసుకున్న డిఎస్‌పి నరేందర్ గౌడ్,ఎస్ఐ సుభాష్ గౌడ్, పోలీసులు సిబ్బందితో ఘటన స్థలాని సందర్శించి పరిశీలించారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, అనంతరం మెరుగైన చికిత్స కొరకు సుచిత్ర లోని రష్ హాస్పిటల్ కి తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఖమ్మం జిల్లాకు చెందిన జగదీష్ అనే వ్యక్తి అద్దెకు తీసుకున్న గదిలో గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ ల నుంచి ఇతర సిలిండర్ లకు అక్రమంగా గ్యాస్ రీఫిలింగ్ నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. కార్మికులు అంతా కలిసి వంట చేసుకుంటుండగా గ్యాస్ లీక్ కావడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి ప్రమాదం జరిగినట్లు తెలిపారు.



## పోలీసు క్రీడా పోటీల్లో సత్తా చాటిన కరీంనగర్



ప్రజాపక్షం/కరీంనగర్: 5వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ క్రీడలు అండ్ స్పోర్ట్స్ మీట్‌లో కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌కు చెందిన పోలీస్ అధికారులు, సిబ్బంది అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మొత్తం 11 పతకాలు సాధించి జోన్–3లో అగ్రస్థానాన్ని దక్కించుకున్నారు. ఈ పోటీల్లో కరీంనగర్ కమిషనరేట్ తరపున పాల్గొన్న క్రీడాకారులు 2 స్వర్ణ, 4 రజత, 5 కాంస్య పతకాలు సాధించి కమిషనరేట్‌కు గౌరవాన్ని తీసుకువచ్చారు. పిసి పి. రాజు 90 కిలోల బాడీ బిల్డింగ్ విభాగంలో స్వర్ణ పతకం, ఏఆర్ పిసి ఎస్. నరేందర్ 85 కిలోల బాడీ బిల్డింగ్‌లో రజత పతకం, పిసిఎం.డి. వహాజుద్దీన్ 80 కిలోల బాడీ బిల్డింగ్‌లో రజత పతకం, ఎఆర్‌పిసి ఎ. శంకర్ యోగా విభాగంలో స్వర్ణ పతకం, ఎఆర్‌పిసి వి. సాయి మాధవ్ ఆర్మ్ రెజ్లింగ్‌లో రజత పతకం, 55 కిలోల బాక్సింగ్‌లో కాంస్య పతకం, పిసిజె. శ్రీనివాస్ 81 కిలోల జూడోలో కాంస్య పతకం, డబ్ల్యూపిసి ఎ. స్వప్న 65 కిలోల ఆర్మ్ రెజ్లింగ్‌లో రజత పతకం, డబ్ల్యూపిసి ఎం. అరుణ 77 కిలోల బాక్సింగ్, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ విభాగాల్లో మూడు కాంస్య పతకాలు సాధించి విశేష ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం పతక విజేతలను అభినందిస్తూ, విధి నిర్వహణతో పాటు క్రీడల్లోనూ రాణించడం ప్రతి పోలీసు సిబ్బందికి ఆదర్శమని పేర్కొన్నారు.

## నేటి నుండి భూ భారతి భూ రీసర్వే అవగాహన సదస్సులు

ప్రజాపక్షం /పెగడపల్లి : భూ భారతి భూ సర్వే కార్యక్రమంలో భాగంగా పెగడపల్లి మండలంలోని పలు గ్రామాల్లో రీసర్వేపై అవగాహన సదస్సులు (గ్రామ సభలు) నిర్వహించనున్నారు. ఈ మేరకు పెగడపల్లి తహసీల్దార్ సయ్యద్ నిజామొద్దీన్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. భూ యజమానులు, రైతులు తమ భూములకు సంబంధించిన సర్వే ప్రక్రియపై అవగాహన పెంచుకోవడానికి ఈ సభలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.మండలంలో నిర్వహించబోయే గ్రామ సభల వివరాలు: ఈనెల 16న ల్యాగలమర్రిలో, 18న నర్సింహునిపేటలో 22న కీచులాటపల్లి ,వెంగళాయిపేట గ్రామాలలో ఆయా తేదీల్లో నిర్దేశిత గ్రామాల్లో అధికారులు అందుబాటులో ఉండి రీసర్వే నియమ నిబంధనలు, రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తారన్నారు.ఈ గ్రామ సభలకు రైతులు,భూ యజమానులు పెద్ద సంఖ్యలో హాజరై సర్వే ప్రక్రియను విజయవంతం చేయాలని తహశీల్దార్ విజ్ఞప్తి చేశారు.

## ప్లాస్టిక్‌కు గుడ్‌బై... పర్యావరణ పరిరక్షణే ధ్యేయం

ప్రజాపక్షం/ వేములవాడ: ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణంలో మనమందరం ముందుందామని కౌన్సిలర్ ఏనుగు జ్యోతి, తిరుపతి రెడ్డి అన్నారు. వేములవాడ మున్సిపల్ విలీన గ్రామం రెండో వార్డ్ శాత్రాజుపల్లి లోని రెడ్డి సంఘంలో , నిర్వహించే ప్రతి శుభకార్యం, వివాహం,సభ, సమావేశం, సామాజిక కార్యక్రమంలో సింగిల్–యూజ్ ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని పూర్తిగా నివారించాలని నిర్ణయించాము. అందువల్ల అందరూ ఈ క్రింది విషయాలను తప్పనిసరిగా పాటించవలసిందిగా మనవి. ప్లాస్టిక్ గ్లాసులు, ప్లేట్లు, స్పూన్లు, కవర్లు,క్యారీ బ్యాగులు ఉపయోగించవద్దు. వాటి స్థానంలో కాగితం, ఆకు పాత్రలు, స్టీల్ లేదా ఇతర పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను ఉపయోగించండి. ప్రతి కార్యక్రమాన్ని ప్లాస్టిక్ రహిత వేడుకగా నిర్వహించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు అవ్వండి. అయితే ఈ కార్యక్రమాన్ని కౌన్సిలర్ జ్యోతి ఏనుగు తిరుపతిరెడ్డి కోరిక మేరకు ముందుకు వచ్చిన రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొమ్ముల స్వామి రెడ్డి సభ్యులను అభినందించారు.

## భూగర్భ జలాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనదే: మున్సిపల్ చైర్మన్



ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత భూగర్భ జలాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మున్సిపల్ చైర్మన్ జిందం కళ చక్రపాణి అన్నారు. తడి, పొడి చెత్త నుండి ఉత్పత్తి అవుతున్న విండో కంపోస్ట్ తయారీ విధానం,వర్మీ కంపోస్ట్ తయారీ విధానంపై మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ పాలకవర్గానికి అవగాహన కల్పించారు. ఇంకుడు గుంతల ఆవశ్యకతను వివరిస్తూ భూగర్భ జలాల పెరుగుదల కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. అనంతరం రీసెర్చ్ పార్కులో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ జిందం కళ చక్రపాణి మాట్లాడారు. ఎక్కడపడితే అక్కడ చెత్తను పడవేయడం వల్ల అలాగే ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టకుండా నీటిని వృథా చేయడం వల్ల పర్యావరణం దెబ్బతిని భూగర్భ జనాలు తగ్గిపోయి భవిష్యత్తులో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ప్రతి ఒక్కరూ స్వచ్ఛత నియమాలను పాటిస్తూ నీటి వనరులను పరిరక్షిస్తూ సిరిసిల్లను ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దడంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఖాదీర్ పాషా, కౌన్సిలర్ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు, శ్రీ గ్రీన్ వర్క్ ఫౌండేషన్ వారు మరియు కార్మికులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటేందుకు సిద్ధం

ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : వర్షాలు కురిసిన తరువాతే మొక్కలు నాటేందుకు సిద్ధంగా పెట్టాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. వన మహోత్సవంలో భాగంగా జిల్లాలో వివిధ శాఖల ఆధ్వర్యంలో మొక్కలు నాటే లక్ష్యంపై జిల్లా అటవీ శాఖ అధికారి సత్యనారాయణ, పలు శాఖలతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. జిల్లాలోని వివిధ శాఖలకు కేటాయించిన లక్ష్యం మేరకు మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. నీటి పారుదల శాఖ స్థలాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అటవీ ప్రాంతాలు, మున్సిపల్ డంపింగ్ యార్డులు, ఫారెస్ట్ అర్బన్ పార్క్, ఎక్సైజ్ శాఖ, నూతన రహదారుల వెంట మొక్కలు నాటేందుకు గుంతలు తవ్వి సిద్ధంగా ఉంచాలని సూచించారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో నర్సరీలు ఉండాలని స్పష్టం చేశారు. వన మహోత్సవంలో భాగంగా ఆయా శాఖలకు కేటాయించిన మొక్కల లక్ష్యం మొత్తం 8,65,200 గా లక్ష్యాన్ని నిర్ణయించామని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ వెల్లడించారు. డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం. జిల్లా విద్యాధికారి మొండయ్య, జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, జిల్లా పంచాయతీ అధికారి జయశీల, జిల్లా ఎక్సైజ్ అధికారి హిమశ్రీ, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శరత్ బాబు, మైనింగ్ శాఖ ఏడీ క్రాంతి, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, లోకేష్, అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# పకడ్బందీగా భూ రీసర్వే ప్రక్రియ

### కలెక్టర్ కోయ శ్రీహర్ష



ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : పెద్దపల్లి జిల్లాలో చేపట్టిన భూ రీసర్వే ప్రక్రియను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి విద్యార్థికి ప్రాథమిక విద్యా నైపుణ్యాలు అందేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు.బుధవారం పెద్దపల్లి మండలం నిమ్మనపల్లి గ్రామంలో కొనసాగుతున్న భూ రీసర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ పరిశీలించారు.అనంతరం పెద్దపల్లి మండలం నిట్టూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జెడ్‌పిహెచ్‌ఎస్), మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (ఎంపిపిఎస్)లను ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యా బోధన, ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) కార్యక్రమం అమలును పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ భూ రీసర్వే ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా అత్యంత జాగ్రత్తతో పనులు చేపట్టాలని సూచించారు. ప్రతి సర్వే నంబర్‌ను వరుస క్రమంలో ఖచ్చితంగా నమోదు చేయాలని, రికార్డులు పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయి పరిశీలన నిర్వహించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా భూ రీసర్వే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.అనంతరం నిట్టూరు గ్రామంలోని పాఠశాలలను తనిఖీ చేసిన కలెక్టర్, ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం అమలుపై ఆరా తీశారు. ప్రతి విద్యార్థికి ప్రాథమిక విద్యా నైపుణ్యాలు తప్పనిసరిగా అందేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. విద్యార్థులకు అన్ని సబ్జెక్టులపై మంచి అవగాహన కల్పించాలని, విద్యా ప్రణాళిక ప్రకారం సిలబస్‌ను పూర్తి చేయాలని ఆదేశించారు.మధ్యాహ్న భోజనం నాణ్యతతో ఉం డేలా నిరంతరం పర్యవేక్షించాలని, ప్రీప్రైమరీ తరగతుల్లో విద్యార్థుల న మోదు పెంచేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి విద్యార్థి చదవగలిగే స్థాయికి చేరుకునేలా కృషి చేయాలని,ముఖ్యంగా వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి అదనపు బోధన అందించాలని సూచించారు. పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలని,మరుగుదొడ్లలో ఎల్లప్పుడూ నీటి సౌకర్యం ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ పర్యటనలో ఎడి సర్వే సోమేశ్వర్,జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు , ఎంపిపిఎస్ ప్రధానోపాధ్యాయురాలు రాజమణి, పాల్గొన్నారు.

### గుడిసెవాసుల సర్వేను వేగవంతంగా పూర్తి

జిల్లాలో గుడిసెల్లో నివసిస్తున్న పేద కుటుంబాల సర్వేను వేగవంతంగా పూర్తి చేసి, అర్హులైన ప్రతి కుటుంబాన్ని గుర్తించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు.బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతి,గుడిసెవాసుల సర్వేపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో గుడిసెల్లో నివసిస్తున్న పేద కుటుంబాలకు సంబంధించిన సర్వే ప్రక్రియను గెజిటెడ్ అధికారుల ద్వారా వేగవంతంగా పూర్తి చేయాలని, రేపటిలోపు గుడిసెవాసుల పూర్తి వివరాలను సమర్పించాలని ఆదేశించారు.ముఖ్యంగా టార్పాలిన్ కవర్ల కింద నివసిస్తున్న అత్యంత నిరుపేద కుటుంబాలకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని,అర్హులైన ఒక్క కుటుంబం కూడా సర్వేలో మిగలకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిని సమీక్షిస్తూ తొలి విడతలో బేస్‌మెంట్ దశలో ఉన్న ఇళ్ల నిర్మాణాలను సెప్టెంబర్ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు.ఎల్1 జాబితాలో ఉన్న అర్హులైన లబ్ధిదారులకు వెంటనే పరిపాలన అనుమతి ఉత్తర్వులు జారీ చేయాలని సూచించారు.ఈ సమావేశంలో గృహ నిర్మా ణ శాఖ ప్రాజెక్టు సంచాలకులు రాజేశ్వర్, ఎంపిడిఓ లు,మున్సిపల్ కమిషనర్లు,సంబంధితశాఖల అధికారు లు పాల్గొన్నారు.

## గురుకులాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రత్యేక ప్రాధాన్యం

### జువ్వాడి నర్సింగరావు-మెట్‌పల్లి సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల సందర్శన



ప్రజాపక్షం /మెట్‌పల్లి: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గురుకుల విద్యా సంస్థల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్య, పోషకాహారం, ఆధునిక మౌలిక వసతులు, పరిశుభ్రమైన వసతి సౌకర్యాలు కల్పించేందుకు కట్టుబడి పనిచేస్తోందని తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇచార్జ్ జువ్వాడి నర్సింగరావు అన్నారు.జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రితో కలిసి విద్యార్థులతో కూర్చొని అల్పాహారం చేశారు. ఈ సందర్భంగా జువ్వాడి నర్సింగరావు మాట్లాడుతూ, విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చదువుపై పూర్తిగా దృష్టి సారించేలా ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తోందన్నారు.గురుకుల విద్యా సంస్థలను దేశంలోనే ఆదర్శ విద్యా సంస్థలుగా తీర్చిదిద్దడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు ,ఉపాధ్యాయులతో సమావేశమైన ఆయన వి ద్యార్థులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అ వసరమైన అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉ ండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గురుకులాల అభివృద్ధికి ప్రభుత్వం అవసరమైన నిధులు, సౌకర్యాలను నిరంతరం అందిస్తూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం కృషి చేస్తోందని,ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడ మే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జువ్వా డి నర్సింగరావు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమం లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది,మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్ష న్ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వేధింపులకు గురి చేస్తున్నారంటూ గ్రామ పంచాయతీ ముందు నిరసన



ప్రజాపక్షం / గన్నేరువరం : తమ భూమిని ప్రభుత్వ భూమి అంటూ సర్పంచ్‌తో పాటు ఇద్దరు వార్డు మెంబర్లు వేధింపులకు గురి చేస్తున్నారంటూ బుధవారం కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండల కేంద్రానికి చెందిన ఎస్‌టి కులానికి చెందిన కుర్ర హరీశ్ తమ కుటుంబ సభ్యులతో కలిసి గ్రామ పంచాయతీ ముందు పురుగుల మందు, పెట్రోల్ డబ్బాతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బాధితుడు హరీశ్ మాట్లాడుతూ ఊరి చివరన 12 గుంటలలోతమ తాతల కాలం నుంచి ఇల్లు కట్టుకొని జీవిస్తున్నామని తమకు పట్టా డాక్యుమెంట్స్ ఉన్నప్పటికీ గ్రామ సర్పంచ్ రంగనవేణి లచ్చినర్సు, కార్యదర్శితో పాటు మరో ఇద్దరు వార్డు మెంబర్లు కలిసి తమ భూమిలో నుంచి 3 గుంటల భూమిని విఒ బిల్డింగ్‌కు ఇవ్వాలంటూ తమ కుటుంబాన్ని తరచూ వేధింపులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు చెప్పినా ఎవ రూ పట్టించుకోవడం లేదని వాపోయారు. వేధింపులు ఆపకపోతే తమకు ఆ త్మహత్యే శరణ్యమని తమ చావుకు సర్పంచ్ లచ్చినర్సు, గ్రామ కార్యదర్శి ఇ ద్దరు వార్డు మెంబర్లు కారణమవుతారని హెచ్చరించారు.

## ప్రజాస్వామ్యంలో ఓటే బలమైన ఆయుధం

### కరీంనగర్‌లో ఎన్యూమరేషన్ దరఖాస్తు నింపిన బండి సంజయ్



ప్రజాపక్షం/కరీంనగర్: రాష్ట్ర ప్రజలంతా తప్పనిసరిగా ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ(సర్) ప్రక్రియలో పాల్గొని ఓటు హక్కును నమోదు చేసుకోవాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ విజ్ఞప్తి చేశారు. ''సర్ ను లైట్ తీసుకుంటే... మీ ఓటు గల్లంతయ్యే ప్రమాదం ఉంది''అని హెచ్చరించారు. సర్ ప్రక్రియను ఎవరూ లైట్ తీసుకోవద్దని కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటే బలమైన ఆయుధమని 'మీ ఓటును కాపాడుకోండి... మీ భవిష్యత్తును తీర్చిదిద్దుకోండి'' అని పిలుపునిచ్చారు. బుధవారం కరీంనగర్ కు వచ్చిన కేంద్ర మంత్రి బండి సంజయ్ ''సర్'' ఫాంను నింపి చైతన్యపురిలోని సాధన స్కూల్ లో ఉన్న బిఎల్ఒ అధికారుల వద్దకు వెళ్లి సమర్పించారు. అక్కడే ఆన్ లైన్‌లోనూ ఆ వివరాలను నమోదు చేయించుకున్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు.

**మూడు నెలల్లోయుసిఎఫ్ పనులు షురూ...**

రాబోయే మూడు నెలల్లో అర్బన్ ఛాలెంజ్ ఫండ్ (యూసీఎఫ్) స్కీం కింద కేంద్రం మంజూరు చేసిన రూ.840 కోట్ల నిధులతో కరీంనగర్ ను సుందరంగా తీర్చిదిద్దే పనులన ప్రారంభిస్తామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. ఆయా నిధులతో కరీంనగర్ లో మోడల్ రోడ్లను నిర్మించడంతో పాటు స్కై వాక్ లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జి లను నిర్మిస్తామని పేర్కొన్నారు.

## విద్యార్థులకు ఆఫర్లపై ఉన్నత విద్యా మండలికి ఎఐఎస్ఎఫ్ ఫిర్యాదు



ప్రజాపక్షం/కరీంనగర్: కరీంనగర్ జిల్లాలోని జ్యోతిష్మతి ఇంజనీరింగ్ కళాశాలలో 2026–27 విద్యాసంవత్సరం నూతనంగా చేరే బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు సంవత్సరానికి రూ.18000 లు.. నాలుగు సంవత్సరాలకు 72,000 స్కాలర్షిప్ ఆఫర్లు చెక్ ఇస్తూ విద్య వ్యాపారం చేస్తున్నారని వెంటనే జ్యోతిష్మతి కళాశాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం హైదరాబాద్ లోని ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకృష్ణ రెడ్డి కి ఎఐఎస్ఎఫ్ కరీంనగర్ జిల్లా సమితి ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేసినట్లు ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా మచ్చ రమేష్ మాట్లాడుతూ కరీంనగర్ జిల్లాలో జ్యోతిష్మతి ఇంజనీరింగ్ కళాశాల ఎఫ్ సెట్ 2026–27 సంవత్సరానికి బీటెక్ మొదటి సంవత్సరం ఏ గ్రూపులో చేరినా శాలిని విద్యాసంస్థల ట్రస్ట్ ద్వారా అడ్మిషన్ తీసుకున్నాక వెంటనే పది నిమిషాలలో సంవత్సరానికి రూ.18000 చొప్పున నాలుగు సంవత్సరాలు కలిపి 72,000 ఇవ్వబడును అంటూ ప్రచారం నిర్వహిస్తున్నారని అన్నారు. ఇలా బహిరంగంగా ఆఫర్ల పేరుతో ముందు చెక్కులు ఇచ్చి అడ్మిషన్లు చేపిస్తూ కళాశాలలో చేరిన తర్వాత ఫీజులో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, ఆఫర్లతో విద్యార్థులకు చెక్కులు ఇచ్చే బదులు ఉన్నత విద్యా శాఖ నిర్ణయించిన ఫీజులను తగ్గించి ఫీజు తీసుకోవాలని, కానీ ఇలా ఆఫర్లతో చెక్కులు ఇవ్వడం విద్యా వ్యాపారం చేయడమేనని, అంతేకాకుండా ఇతర లైబ్రరీ, ల్యాబ్ ఇంకా అనేక రకాల ఫీజులతో విద్యార్థులను ఫీజుల దోపిడీ చేసే అవకాశముందని, జ్యోతిష్మతి ఇంజనీరింగ్ కళాశాలలో ఫీజు వసూళ్లపై విచారణ జరిపించాలని, అడ్మిషన్ ఆఫర్లు ఇస్తున్న కళాశాలపై చర్యలు తీసుకోవాలనీ మచ్చ రమేష్ డిమాండ్ చేశారు.

## స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి

### ఎఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం



ప్రజాపక్షం/పెద్దపల్లి: తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ని వెంటనే చేయాలి ఎఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం అన్నారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఎఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం ఎఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా అ ధ్యక్షుడు ఆర్నకొండ సాయి అధ్యక్షతన ఏర్పాటు చేసుకోవడం జరిగింది . ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం హాజరై అనంతరం మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తివేసే కుట్ర చేస్తూ ఫీజు బకాయిలు విడుదల చేయడం లేదని,సిఎం రేవంత్ రెడ్డి వద్ద విద్యా శాఖ ఉన్న ఫీజు బకాయిలు విడుదల చేయకపోవడం సిఎం నిర్లక్ష్యానికి నిదర్శనమని,గత మూడు విద్యాసంవత్సరాల నుండి ఫీజు బకాయిలు1100 కోట్లు పూర్తిగా పెండింగ్ లో ఉన్నాయని,ఫీజు బకాయిలు విడుదల లేక విద్యార్థులతో పాటు బడ్జెట్ కళాశాలల యాజమాన్యాలు,సిబ్బంది కూడా ఇబ్బందులు పడుతున్నారని, సీఎం రేవంత్ రెడ్డి ఫీజు బకాయిల విడుదల పై మాట తప్పారని, వెంటనే ప్రభుత్వం పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కాలర్షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని లేనిపక్షంలో ఎఐఎస్ఎఫ్ విద్యార్థులను ఏకం చేసి ప్రభుత్వం పై మిలిటెంట్ ఉద్యమాలు నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. అనంతరం పెద్దపెల్లి పట్టణంలో శ్రేయ ఒకేషనల్ కళాశాలలో కళాశాల కమిటీని ఏర్పాటు చేసుకోవడం జరిగిందని, అధ్యక్ష & కార్యదర్శులు రామ్ చరణ్, అక్షిత్ లను, ఉపాధ్యక్షులుగా రాజలక్ష్మి , కళ్యాణి శ్రీ చందన, సహాయ కార్యదర్శులు గా ఎండి సానియా బేగం, సల్మా, కోశాధికారిగా శ్రావణి లను కళాశాల విద్యార్థులు ఎన్నుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సాయి ఆజాద్, గొడిసెల ప్రణీత్, పాల్గొన్నారు.

## రియాజ్ అహ్మద్.. నోరు అదుపులో పెట్టుకో



### ఎఐటియుసిపై విమర్శలను సహించం

### * కవ్వంపల్లి స్వామి కేంద్ర కార్యదర్శి

ప్రజాపక్షం/పెద్దపల్లి : సింగరేణిలో కా ర్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్న ఎఐటియుసి పై అనవసర విమర్శలు చేయడం రియాజ్ అహ్మద్ మానుకోవాలని, నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని ఎఐటియుసి కేంద్ర కార్యదర్శి కామ్రేడ్ కవ్వంపల్లి స్వామి హెచ్చరించారు. బుధవారం గోదావరిఖని భాస్కర్ రావు భవన్ లో జరిగిన ఎఐటియుసి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సింగరేణిలో ఇప్పటి వరకు జరిగిన 7 సార్ల గుర్తింపు సంఘం ఎన్నికల్లో 4 సార్లు ఎఐటియుసి గెలిచిందని,కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఎన్నో అగ్రిమెంట్ లు చేసిన చరిత్ర ఎఐటియుసికి ఉందని అన్నారు. సింగరేణిలో 7వ సారి జరిగిన గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఒక్క ఏరియాలో కూడా గెలవని హెచ్ ఎం ఎస్ యూనియన్ కార్మికుల హక్కుల సాధన కోసం, సంస్థ పరిరక్షణ కోసం కృషి చేస్తున్న ఏఐటియుసి నాయకుల పై రియాజ్ అహ్మద్ వ్యక్తిగత దూషణలకు దిగడం సరైనది కాదని ఆయన అన్నారు.బిఆర్ఎస్ లో ఎం.పి గా, ఎమ్మెల్సీ గా ఉండగా, , టిబిజికెఎస్ లో గౌరవ అధ్యక్షురాలిగా 10 సంవత్సరాలు అధికారంలో ఉన్న కవిత సింగరేణి కార్మికులకు, సింగరేణికి ఏమీ చేయలేదని ఆయన విమర్శించారు.బిఆర్ఎస్ పార్టీ నుంచి బయటకు వచ్చి తెలంగాణ రక్షణ సేన పార్టీ పేరుతో, హెచ్ ఎంఎస్ కు గౌరవ అధ్యక్షురాలిగా ఉంటున్న కవిత వల్ల సింగరేణికి, కార్మికులకు ఒరిగేది ఏమీ లేదన్నారు.సింగరేణిలో ఎఐటియుసి అధికారంలో ఉన్నా, లే కున్నా నిరంతరం బాయి బాట పడుతుందని, కార్మికుల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం ఎఐటియుసి పోరాటాలు, ఉద్యమాలు నిర్వహించి, యాజమాన్యం, ప్రభుత్వం మెడలు వంచి ఎన్నో హక్కులు సాధించిన సంఘం అని ఆయన తెలిపారు. ఇకనైనా హెచ్ ఎం ఎస్ రియాజ్ అహ్మద్ ఎఐటియుసిపై విమర్శలు మానుకోవాలని ఆయన హితవు పలికారు.ఈ సమావేశంలో ఎఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి ఆఫీస్ బేరర్ సిర్ర మల్లికార్జున్, నాయకులు ఎర్రగొల్ల చేరాలు, పడాల కనకరాజు,తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ ఆరోపణలు రాజకీయ ప్రేరేపితమే

### ఎఎంసి చైర్మన్ కూన గోవర్ధన్



ప్రజాపక్షం /మెట్‌పల్లి : మెట్‌పల్లి పటణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఎ ఎంసి) చైర్మన్ కూన గోవర్ధన్, రాష్ట్ర కిసాన్ సెల్ జాయింట్ కోఆర్డినేటర్ వాకిటి సత్యం రెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బిఆర్ఎస్ నాయకులు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా రాజకీయ ప్రేరేపితమైనవని, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమేనని విమర్శించారు.ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలను వక్రీకరించి చౌకబారు రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆ రోపించారు. బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో సాగునీటి ప్రాజెక్టులు, కాలువల అభివృద్ధిపై ఆశించిన స్థాయిలో చర్యలు తీసుకోలేదని,ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం సరికాదన్నారు. రైతులకు ఎరువులు సకాలంలో అందేలా అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్‌ను అరికట్టేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోందని తెలిపారు. తెలంగాణ అభివృద్ధి, రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రజల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవ ంత్ రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. అసెంబ్లీలో ప్రజా సమస్యలపై సూచనలు చేయాల్సిన ప్ర తిపక్షం, నిరాధార ఆరోపణలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం తగదని విమర్శించారు. ఈ సమావేశంలో మెట్‌పల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు ఖుతుబుద్దీన్ పాషా, ఇబ్రహీంపట్నం మండ ల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నల్లూరి సాగర్, పాత ధ ర్మరాజ్‌పల్లి గ్రామ ఉపసర్పంచ్ ఇప్పపల్లి గణేష్, వంగ అశోక్ యాదవ్, మొగిలి రాజేందర్,సమీర్ సర్కార్ ,అన్వర్,తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## కేబుల్ ఆపరేటర్ ఆత్మహత్య



ప్రజాపక్షం / జమ్మికుంట : కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో విషాదం చోటు చేసుకుంది. స్థానిక కేబుల్ ఆపరేటర్ దాసరి రామ్మూర్తి గౌడ్ ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడిన ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. రామ్మూర్తి మృతితో ఆయనభార్య సుజాత ఇద్దరు కుమార్తెలు తీవ్ర శోక సంద్రంలో మునిగిపోయారు. తండ్రి మరణాన్ని తట్టుకోలేక చిన్న కుమార్తె సాయి ప్రీతి తన తండ్రి చితికి నిప్పంటించి అంత్యక్రియలు నిర్వహించడం అక్కడున్న ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టించింది. ఈ హృదయవిచారక దృశ్యం చూసిన బంధువులు, గ్రామస్థులు భావోద్వేగానికి గురయ్యారు. రామ్మూర్తి భౌతికకాయాన్ని ఆయన స్వగ్రామమైన పెద్దపల్లి జిల్లా కొలనూరు గ్రామానికి తరలించగా కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, గ్రామస్థుల సమక్షంలో అంత్యక్రియలు నిర్వహించారు.

## సింగరేణి భవిష్యత్తుకు తాడిచర్ల-2 కీలకం

ఎఐటియుసి నాయకుడు సముద్రాల సుధాకర్




**ప్రజాపక్షం/సత్తుపల్లి:** జెవిఆర్ ఓపెన్‌కాస్ట్ (ఒసి) ప్రాజెక్టు ఆవరణలో బుధవారం తాడిచర్ల బ్లాక్2 సాధన విజయోత్సవ సభను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఏరియా ఎఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి సముద్రాల సుధాకర్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాడిచర్ల2 బొగ్గు బ్లాక్‌ను సింగరేణికి కేటాయించడం సంస్థ భవిష్యత్తుకు ఎంతో కీలకమైన పరిణామమని పేర్కొన్నారు. తాడిచర్ల2 బొగ్గు బ్లాక్‌ను సింగరేణికి అప్పగించాలని డిమాండ్ చేస్తూ ఎఐటియూసి 2013 సంవత్సరం నుంచే నిరంతర పోరాటాలు నిర్వహించిందని గుర్తు చేశారు.ఈ విజయోత్సవ సభకు సత్తుపల్లి ఏరియా జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్, జెవిఆర్ ఒసి ప్రాజెక్టు అధికారి ప్రహ్లాద్, ప్రాజెక్టు ఇంజనీర్ శ్రీనివాస్‌రావు, జెవిఆర్ ఒసి ఎస్‌ఓఎం రాజేశ్వరరావుతో పాటు వివిధ కార్మిక సంఘాల నాయకులు, అధికారులు, ఉద్యోగులు హాజరయ్యారు.

## ఖమ్మంలో టాస్క్‌ఫోర్స్ దాడులు

గంజాయి సేవిస్తున్న ఇద్దరు అరెస్ట్

**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** జిల్లా కేంద్రంలో పలు ప్రాంతాల్లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఖమ్మం వన్‌టౌన్, ఖానాపురం హవేలీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గంజాయి సేవిస్తున్న పలువురిని అదుపులోకి తీసుకునేందుకు యత్నించగా ఇద్దరు పట్టుబడ్డారు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ ఎసిపి సత్యనారాయణ మాట్లాడుతూ పోలీసు కమిషన్ సునిల్‌దత్ ఆదేశాల మేరకు గంజాయి రవాణా, క్రయ విక్రయాలపై నిఘా ఉంచి మూలలను సైతం కట్టడిచేసేందుకు దాడులు చేస్తున్నామన్నారు. గంజాయి రవాణా, వినియోగం కట్టడి చేసేందుకు స్థానిక పోలీసులు, ఈగల్ టీమ్ సమన్వయంతో దాడులు చేస్తున్నామన్నారు. గంజాయి బారిన పడిన వారిని గుర్తించి వారి ద్వారా మూలలను తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. నగరంలో రాత్రిళ్లు గస్తీ తిరుగుతూ గంజాయి సేవిస్తున్న వారిని గుర్తించి అరెస్ట్‌లు చేస్తున్నామన్నారు. జిల్లా కేంద్రంలో మంగళవారం అర్ధరాత్రి తనిఖీలు చేస్తుండగా వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పిరధిలోని శుక్రవారం పేటలో ఇద్దరు యువకులు గంజాయి సేవిస్తూపట్టుబడ్డారని వారిలో ఒకరు పరారు కాగా మరో వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామన్నారు. శుక్రవారిపేటలో పట్టుబడిన వ్యక్తివద్ద 40 గ్రాముల ఎండు గంజాయి ఉన్న ప్లాస్టిక్ సీసాలు, రోల్‌పేపర్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకోగా ఖానాపురం పరిధిలో పట్టుబడిన వ్యక్తి నుంచి 5 గ్రాముల గంజాయితో పాటు ద్విచక్రవాహనాన్ని, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని సంబంధిత పోలీస్‌స్టేషన్లలో వారిని అప్పగించినట్లు ఎసిపి సత్యనారాయణ తెలిపారు. ఎవరైనా ఎక్కడైనా గంజాయి, మాదక ద్రవ్యాల రవాణా, వినియోగం చేస్తున్నట్లు తెలిస్తే స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చి సహకరించాలని ప్రజలను ఆయన కోరారు.

## ఎల్‌నినో ప్రభావంపై.. రైతులకు అవగాహన కార్యక్రమం




**ప్రజాపక్షం/మధిర మున్సిపాలిటీ:** ఖమ్మం జిల్లా వ్యవసాయ అధికారి దనసరి పుల్లయ్య మధిర మండలంలోని వివిధ గ్రామాల్లో సందర్శించి రైతులకు పంటలపై ఎల్‌నినో ప్రభావంపై అవగాహన కల్పించారు. రైతులు ఎల్‌నినో పరిస్థితుల దృష్ట్యా వానాకాలం సీజన్‌లో స్వల్పకాలిక తక్కువ నీటితో అధిక దిగుబడులు ఇచ్చే పంట రకాలను ఎంచుకోవాలని సూచించారు. అలాగే ప్రత్యామ్నాయ పంటలైన పెసలు, మినుములు, కందులు, జొన్నలు, ఇతర చిరు ధాన్యాలు పంటలు పండించాలని సూచించారు. ఈ సంవత్సరం భూగర్భ జలాలు అడుగంటిపోవడం జరుగుతుంది కాబట్టి ముందస్తు ప్రణాళికలో భాగంగా వరి, మిర్చికి బదులుగా తక్కువ నీటితో సాగయ్యే పంటలను వేయాలని సూచించారు. మండలంలో జులైలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతున్న నేపథ్యంలో భూగర్భ జలమట్టం తగ్గుతుందని భూగర్భ జలాలు పెంచేలా రైతులు పంట కుంటలు ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వం విబిజి రామ్ జి పథకం ద్వారా 100శాతం రాయితీపై అందిస్తుందని ఈ పథకాన్ని రైతులందరూ అధిక మొత్తంలో వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సాయి దీక్షిత్, వివిధ గ్రామాలు రైతులు పాల్గొన్నారు.

## పోలీస్ డ్యూటీ మీట్‌లో ఖమ్మం పోలీసుల ప్రతిభ



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** వరంగల్ జిల్లా మామునూరు పోలీస్ శిక్షణ కళాశాల మైదానంలో ఈనెల మొదటి వారంలో జరిగిన భద్రాద్రి జోనల్ పోలీస్ డ్యూటీ మీట్‌లో వృతి నైపుణ్యాల్లో నిర్వహించిన పోటీల్లో ఖమ్మం జిల్లా పోలీసులు ప్రతిభచాటారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక సిపి కార్యాలయంలో పతకాలు సాధించిన విజేతలను పోలీసు కమిషనర్ సునిల్‌దత్ అభినందించారు. సిపి మాట్లాడుతూ జోనల్ స్థాయిలో కనబరిచిన ప్రతిభతోనే రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. ఈ డ్యూటీ మీట్‌లో వరంగల్, ఖమ్మం పోలీసు కమిషనరేట్లతో పాటు మహబూబాబాద్, భద్రాద్రికొత్తగూడెం జిల్లాలకు చెందిన పోలీసు అధికారులు పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపి భోజా రామానుజం, ఎసిపి సాంబరాజు పాల్గొన్నారు.

## ‘నిక్షయ్ పోషణ్ యోజన’ను సద్వినియోగం చేసుకోవాలి

డిఎంహెచ్ఓ డాక్టర్ రామారావు

**ప్రజాపక్షం/ఖమ్మం వైద్యవిభాగం:** ఖమ్మం జిల్లాలో క్షయ(టిబీ) వ్యాధితో బాధపడుతున్న అర్హులైన ప్రతి రోగి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నిక్షయ్ పోషణ్ యోజన(ఎన్‌పివై) పథకాన్ని తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి. రామారావు కోరారు. ఈ పథకం ద్వారా చికిత్స పొందుతున్న టిబీ రోగులకు మెరుగైన పోషకాహారం అందించేందుకు ప్రభుత్వం మొత్తం రూ.6 వేలు ఆర్థిక సహాయాన్ని నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తుందని తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ లేదా ప్రైవేట్ ఆసుపత్రుల్లో టిబీ చికిత్స పొందుతున్న రోగులందరూ తమ వివరాలను నిక్షయ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని, అలాగే ఆధార్‌కార్డు, బ్యాంకు పాస్‌బుక్ వివరాలను స్థానిక ఆరోగ్య కార్యకర్తలకు లేదా సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి అందించాలని డిఎంహెచ్ఓ సూచించారు.

# చేప పిల్లల పంపిణీపై నీలి నీడలు

ఈ ఏడాదికి ఇంకా మొదలుకాని తతంగం

మత్స్యకారుల ఆశలపై ఎల్‌నినో ఎఫెక్ట్

ఆందోళనలో మత్స్యకార సంఘాలు



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** మత్స్యకారుల ఆర్థిక బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ ఏటా ఉచితంగా చేప పిల్లలను పంపిణీని చేస్తోంది. గత ఏడాది లక్ష్యంలో కాస్తంత వెనుకబడ్డా ఈసారి ఇప్పటి వరకు ఎలాంటి కార్యాచరణ రూపొందిచక పోవడంతో నీలినీడలు అలుముకున్నాయి. దీంతో మత్స్యకార సంఘాలు ఆందోళన చెందుతున్నాయి. జిల్లావ్యాప్తంగా 81 మత్స్యకార సంఘాలున్నాయి. వీటిలో 13 ప్రాథమిక మత్స్యకార సంఘాలు ఉండగా, 63 గిరిజన మత్స్యకార సంఘాలు, 1 మార్కెటింగ్ సొసైటీకి చెందిన సంఘం ఉంది. వీటిలో 3815 మంది సభ్యులు ఉండగా, మహిళా సంఘాలు నాలుగింటిలో 136 మంది సభ్యులున్నారు. గత ఏడాది మొత్తంగా 532 చెరువుల్లో కోటి 40 లక్షల చేప పిల్లలను విడిచారు. ఈ మొత్తం జలాశయాలు 10825 హెక్టార్ల విస్తీర్ణాన్ని ఆవరించి ఉన్నాయి. మూడేళ్ల క్రితం వరకు చేప పిల్లలను ఉచిత పంపిణీ చేయడానికి ఏప్రిల్ నెలాఖరు నాటికి టెండర్లు పిలిచి మే రెండో వారం టెండర్లు ఖరారు చేసేవారు. రెండేళ్లుగా ఈ తతంగం ఆలస్యమవుతోంది. అంతే కాకుండా లక్ష్యాన్ని కూడా చేరుకోవడం లేదు. కేవలం 50 శాతం వరకు మాత్రమే పంపిణీ చేసి చేతులు దులుపుకుంటున్నారు. ఈసారి నూరు శాతం పంపిణీ చేస్తారని భావించినప్పటికీ ఇప్పటి వరకు ప్రభుత్వం నుండి ఆ దిశగా అడుగులు లేవు, స్పష్టత లేదు. రెండేళ్లుగా చేప పిల్లలు పంపిణీ చేసి గుత్తేదారులకు బిల్లులు అరకొరగా చెల్లిస్తుండటంతో కాంట్రాక్టర్లు ముందుకు వచ్చే పరిస్థితి లేనట్లు తెలుస్తోంది. చెరువులో చేపలను జూలై, ఆగస్టు నెలల్లో జలాశయాల్లో వదలాల్సి ఉంటుంది. అప్పుడే డిసెంబర్ లేదా జనవరి మాసంలో చేపలను మత్స్యకారులు పట్టుకుని విక్రయించుకునేందుకు అవకాశం ఉంటుంది. చేప పిల్లలను వదలడం ఆలస్యమైతే వాటి ఎదుగుదల పై తీవ్ర ప్రభావం ఉంటుంది. సెప్టెంబర్ మాసంలో వదిలితో అవి కిలో సైజుకు రావడానికి ఫిబ్రవరి నెల వరకు పట్టే ప్రమాదం ఉంది. ఇంకా పెరగాలంటే మంచి ఎండాకాలం ఏప్రిల్, మే నెలలు వచ్చేస్తాయి. వేసవిలో నీటి నిల్వలు తగ్గిపోయి చేపలు మృత్యువాత పడే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని మత్స్యకారులు అంటున్నారు.

**ఎల్‌నినో ఎఫెక్ట్ :** మత్స్యకారుల జీవితాల్లో ఆర్థిక భరోసా నింపేందుకు చేపట్టిన ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమానికి ఎల్‌నినో ఎఫెక్ట్ పడుతోంది. ఈ వానా కాలంలో ఆశించిన స్థాయిలో వర్షాపాతం నమోదు కాకపోవడంతో చెరువులు, కుంటలు, ఇతర నీటి జలాశయాల్లో నీరు చేరలేదు. నీటి నిల్వలు తక్కువగా ఉన్నాయన్న కారణంగా ప్రభుత్వం చేప పిల్లల పంపిణీ కార్యక్రమంపై ముందడుగు వేయడం లేదని వాదన వినవస్తోంది. దీంతో ఈ ఏడాది ఈ పథకంపై నీలినీడలు అలుముకున్నాయి. ఈ ఏడాది చేపపిల్లల పంపిణీ ఉంటుందా లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతుండగా మత్స్యకారులు ఆందోళనలో పడ్డారు.

**పెట్టుబడి సహాయం అందించాలి :** రైతులకు పెట్టుబడి సహాయం అందించిన మాదిరిగానే మత్స్యకార సంఘాలకు కూడా నగదు బదిలీ చేస్తూ పెట్టుబడి సహాయాన్ని అందించాలనే డిమాండ్ మొదలైంది. నేరుగా మత్స్యకారులే చేప పిల్లలు కొనుగోలు చేసుకునేందుకు వీలుంటుందని అంటున్నారు. ప్రతీ ఏటా టెండర్లు నిర్వహించి చేప పిల్లలు పంపిణీ చేసే విషయంలో భారీ అవినీతి చోటు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ అక్రమాలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం నేరుగా మత్స్యకారులకు నగదు బదిలీ చేయడమే ఉత్తమమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. వర్షాభావ పరిస్థితులు కారణంగా నష్టపోయే మత్స్యకార కార్మికుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. 2020–21 సంవత్సరం మొదలుకుని 2025–26 సంవత్సరం వరకు ఆరేళ్ల పాటు ప్రభుత్వం సబ్సిడీపై అందించిన చేప పిల్లలను ఆయా చెరువుల్లో వదిలారు. మత్స్యశాఖ అధికారులు అందించిన వివరాల ప్రకారం 2020–21 వ సంవత్సరంలో 691 చెరువులకు గానూ 17,78,280 చేప పిల్లలను వదిలారు. 2021–22లో 698 చెరువుల్లో 12,17,840, 2022–23లో 743 చెరువులకు గానూ 17,74240, 2023–24లో 743 చెరువుల్లో 17,74,590, 2024–25లో 707 చెరువుల్లో 8,02,020, 2025–26లో 532 చెరుల్లో 14,06,070 చేప పిల్లలను వదిలారు. గత ఏడాది, అంతకు ముందటేడు టార్గెట్‌లో 50 శాతం చేప పిల్లలను మాత్రమే పంపిణీ చేయడం గమనార్హం.

## ఓటు హక్కు ప్రతీ ఒక్కరి బాధ్యత

‘సర్’ ప్రక్రియను వేగవంతం చేయాలి

ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్



**ప్రజాపక్షం/ఏన్కూరు:** అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం అందరి బాధ్యత అని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. ఏన్కూరు కల్యాణ మండపంలో బిఎల్ఓలు, బిఎల్ఎలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. మండలంలో 28,104 ఓట్లలో ఇంకా 7,315ఓట్ల పరిశీలన పెండింగ్‌లో ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేసిన ఎమ్మెల్యే, మిగిలిన ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. అర్హుల ఓట్లు తొలగిపోకుండా పారదర్శకంగా ఓటరు జాబితా రూపొందించాలని, బిఎల్ఓలు, బిఎల్ఎలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈసమావేశంలో తహసీల్దార్ సి.హెచ్. శేషగిరిరావు, ఎంపిడిఒ పల్లి భాగ్యశ్రీ, ఎంపిఒ జి.వి.ఎస్ నారాయణ, సొసైటీ అధ్యక్షుడు శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ లచ్చిరాం నాయక్, మండల అధ్యక్షుడు స్వర్ణ నరేందర్, జిల్లా కార్యదర్శి సామేలు, మేడా ధర్మారావు, ముక్తి వెంకటేశ్వర్లు, మాలోత్ నరసింహారావు, భూక్యా లాలు, వక్కంతుల సాగర్, పంతగాని నరేష్, సాయి రోహిత్, దళపతి భువనేశ్వర్‌రాజు, జాస్తి జనార్ధన్ పాల్గొన్నారు.

## పల్లెల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

ఎంపి రఘురాంరెడ్డి



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ఖమ్మం ఎంపి రామసహాయం రఘురాంరెడ్డి అన్నారు. బుధవారం మధిర, ఎర్రుపాలెం మండలాల్లో విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు చేశారు. గ్రామీణ ప్రాంతాల ప్రజల రాకపోకల ఇబ్బందులను శాశ్వతంగా తొలగించే లక్ష్యంతో మధిర, ఎర్రుపాలెం మండలాల్లో ఎంపి లాడ్స్ నిధులు రూ.60లక్షలతో నూతనంగా నిర్మించిన మొత్తం 14 సిసి రోడ్లను ఆయన ప్రారంభించారు. వివిధ గ్రామాల్లో సిసి రోడ్ల ప్రారంభోత్సవాలకు ఎంపి శ్రీకారం చుట్టారు. తక్కెళ్లపాడు గ్రామంలో ఉమ్మడి రాష్ట్ర దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఎంపి రఘురాంరెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ప్రతి గ్రామంలో మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. నేడు ప్రారంభించిన ఈ రోడ్లు గ్రామాల్లోని ప్రజల రాకపోకలకు ఇబ్బందులను తొలగిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు ఐలూరి వెంకటేశ్వరరెడ్డి, కోట రాంబాబు, మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహారావు, మాజీ మండల అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, మండల అధ్యక్షులు బొగ్గుల శ్రీనివాస్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ మదన్మోహన్‌రెడ్డి, అంకిరెడ్డి, సర్పంచ్‌లు ముక్కెర రామకృష్ణారెడ్డి, కూరపాటి రమేష్, అప్పారావు, నంద్రు అశ్విని, జయరాజవు, ప్రశాంత్, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## యూరియా పంపిణీ కేంద్రాన్ని ప్రారంభించిన కూనంనేని





**ప్రజాపక్షం/చుంచుపలి/ పాల్వంచ:** పిఎసిఎస్ కొత్తగూడెం సంఘ పరిధిలోని చుంచుపల్లి మండల సంఘ కార్యాలయంలో యూరియా పంపిణీ కార్యక్రమాన్ని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అవసరమైన ఎరువులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. రైతుల సౌకర్యార్థం అందుబాటులోకి తీసుకొచ్చిన యూరియా బుకింగ్ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకుని యూరియాను పొందాలని సూచించారు. చుంచుపల్లి హౌసింగ్ బోర్డులో ఏర్పాటు చేసిన కొత్త ఎరువుల పంపిణీ కేంద్రాన్ని చుంచుపల్లి, కొత్తగూడెం మండలాల రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షుడు కూచిపూడి జగన్నాథరావు, సంఘ డైరెక్టర్ కంటెం సత్యనారాయణ, చుంచుపల్లి వ్యవసాయ అధికారి రాజేశ్వరి, కొత్తగూడెం వ్యవసాయ అధికారి కరుణామయి, ఏఈఓలు మమత, ప్రసాద్, చుంచుపల్లి సర్పంచ్ బి.వీరన్న, విద్యానగర్ కాలనీ సర్పంచ్ భూక్యా శాంతి శ్రీ, విద్యానగర్ కాలనీ ఉపసర్పంచ్ వాసిరెడ్డి మురళి, కొత్తగూడెం ఎఎంసి మాజీ అధ్యక్షుడు రాంబాబు, రైతులు, సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

**పాల్వంచను అభివృద్ధి చేస్తాం..**

అన్ని రంగాలలో సమగ్రాభివృద్ధి చేసి ఆదర్శ పాల్వంచగా తీర్చి దిద్దుతానని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పాల్వంచ పట్టణం 31వ డివిజన్ బృందావన కాలనీ,33వ డివిజన్ శేఖరం బంజెర, సోనియా నగర్, పిచ్చయ్య బంజెర, 45వ, డివిజన్ గోవర్ధనగిరి కాలని, ఒడ్డుగూడెం, 38వ, డివిజన్ గట్టాయిగూడెం, 34వ, డివిజన్ కరకవాగు తదితర డివిజన్‌లలో రూ. 1.73 కోట్లతో చేపట్టే రోడ్లు, డ్రైనేజీలు తదితర అభివృద్ధి పనులకు బుదవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో కూనంనేని మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని స్పష్టం చేశారు. ప్రజలకు అత్యంత అవసరమైన మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని అందులో భాగంగానే నిధులు మంజూరు చేశామని పేర్కొన్నారు.

**నిరంతర శ్రామికుడు కూనంనేని :** పేద ప్రజల ఆశాజ్యోతి, అభివృద్ధి ప్రదాత, నిత్య శ్రామికుడు, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేసేది ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అని 33వ డివిజన్ కార్పొరేటర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు బాలు కొనియాడారు. అదే విధంగా మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, ఉన్నతాధికారులు ప్రజా సమస్యల పట్ల తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. కనీసం ప్రజా ప్రతినిధుల ఫోన్‌లు సైతం ఎత్తకుండా పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్‌పాషా, మేయర్ మూడ్ గణేష్, డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## వైరా మున్సిపల్ చైర్‌పర్సన్ భర్తపై.. కమిషనర్‌కు వైస్ చైర్మన్ ఫిర్యాదు



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపల్ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది, అభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణపై డాక్టర్ కాపా మురళీకృష్ణకి సంబంధం ఏమిటంటూ వైరా మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్ బుధవారం మున్సిపల్ కమిషనర్‌కి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కట్ల సంతోష్ ఫిర్యాదులో డాక్టర్ కాపా మురళీకృష్ణ మున్సిపాలిటీకి సంబంధించి ప్రజాప్రతినిధి కానప్పటికీ ప్రతిరోజు చైర్ పర్సన్ రూమ్‌లో కుర్చీ వేసుకొని గంటల కొద్ది కూర్చోవడానికి ఏ విధమైన హక్కు ఉందంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు, మున్సిపాలిటీ సంబంధించి అన్ని కార్యక్రమాలపై వారి పర్యవేక్షణ, మున్సిపాలిటీ సిబ్బందికి ఆదేశాలు జారీ చేయడానికి వారికి ఏమి హక్కు ఉన్నదని, అధికారులతో కలిసి వైరా మున్సిపాలిటీ అభివృద్ధి కార్యక్రమాల్లో జోక్యం చేసు కుంటున్నారని ఆరోపించారు. మున్సిపాలిటీ కార్యక్రమాలపై డాక్టర్ కాపా మురళీకృష్ణ పెత్తనం తగ్గించాలని, ఒకవేళ మళ్లీ ఇదే పరిస్థితి కొనసాగితే మేము పై అధికారులకు ఫిర్యాదు చేస్తామని, దీనిపై లిఖితపూర్వకంగా వివరణ కావాలని మున్సిపల్ కమిషనర్‌ను వైస్ చైర్మన్ కట్ల సంతోష్ కోరారు.

## గడువు లోగా ‘సర్’ పూర్తిచేయాలి

కలెక్టర్ దివాకర టిఎస్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఓటరు ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా, నిష్పాక్షపాతంగా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ దివాకర టిఎస్ అదనపు కలెక్టర్ పి.శ్రీజతో కలిసి ఎస్ఐఆర్ కార్యక్రమ పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ఐఆర్‌లో భాగంగా బిఎల్‌వోలు జులై 24 వరకు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జులై 24 నాటికి పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ పూర్తి చేసి జులై 31న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురిస్తామని తెలిపారు. జులై 31 నుంచి ఆగస్టు 30 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలు స్వీకరించి, సెప్టెంబర్ 28 నాటికి వాటిని పరిష్కరించి అక్టోబర్ ఒకటిన తుది ఓటరు జాబితాను ప్రచురిస్తామని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఓటరుకు ఎస్ఐఆర్ తుది జాబితాలో స్థానం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. వంద శాతం డిజిటలైజేషన్ పూర్తి కావాలంటే ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఎస్‌డిసి సదానందం, ఖమ్మం ఆర్‌డిఒ శ్రీనివాస్, ఎన్నికల విభాగ డిటి అన్సారీ, అధికారులు , వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## అధికార కక్ష సాధింపు రాజకీయాలు సరికాదు

సిపిఐతో మిత్రధర్మాన్ని పాటించకుండా

నిందలు వేయడం తగదు : బాగం



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** సిపిఐతో ఉన్న మిత్ర ధర్మాన్ని పాటించకుండా రాజకీయ కక్ష సాధింపులో భాగంగా నిరాధార ఆరోణలని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు పేర్కొన్నారు. బుధవారం ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలోని 30వ వార్డులో ఎన్‌ఎస్‌పీ కాల్వను సిపిఐ మాజీ ప్రజాప్రతినిధి ఆక్రమించారనే ఆరోపణల నేపథ్యంలో మున్సిపాలిటీ సిపిఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నిజ నిర్ధారణ కమిటీ ఘటానా స్థలాన్ని పరిశీలించింది. ఈ సందర్భంగా భాగం హేమంత్‌రావు మాట్లాడుతూ...ఎన్ఎస్‌పి కాల్వ ఆక్రమణ జరిగిందనే ఆరోపణలు పూర్తిగా అసత్యమని అన్నారు. ఆటోనగర్ ఏర్పాటు సమయంలో అసలు పంట కాల్వ మర్గాన్ని మార్చివేశారని, ప్రస్తుతం వివాదాస్పదంగా మారిన ప్రాంత ఆ మార్పుల ఫలితమేనని తెలిపారు. స్థానిక రైతులు కూడా పాత పంట కాల్వను తిరిగి పునరుద్ధరించాలని చాలా కాలంగా కోరుతున్నారని చెప్పారు. రైతులకు సాగునీరు సక్రమంగా అందేలా అధికారులు పాత కాల్వ మార్గాన్ని పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రాజకీయ లబ్ధి కోసం తప్పుడు ప్రచారాలు చేసి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు మానుకోవాలని, వాస్తవాలను పరిగణలోకి తీసుకుని అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని ఆయన కోరారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు సిపిఐపై చేస్తున్న అసత ఆరోపణలు, కక్షసాధింపు రాజకీయాలను మంత్రి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

**ఘటనా స్థలాన్ని పరిశీలించిన సిపిఐ..**

సిపిఐ పార్టీకి చెందిన ఓ మాజీ ప్రజాప్రతినిధి కబ్జాకు పాల్పడ్డారని వచ్చిన ఆరోపణల నేపథ్యంలో సిపిఐ నిజ నిర్ధారణ కమిటీ ఘటనా స్థలాన్ని పరిశీలించింది. తొలుత వరంగల్‌క్రాస్‌రోడ్డులోని సిపిఐ కార్యాలయం వద్దకు చేరుకొని, అక్కడి నుంచి కాలినడకన ర్యాలీగా ఘటనా స్థలానికి చేరుకున్నారు. అసలు కాల్వ ఎక్కడి నుంచి ఉందనే విషయాన్ని మొత్తం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర సమితి సభ్యుడు సిద్దినేని కర్ణకుమార్, జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకట్‌రెడ్డి, జిల్లా సమితి సభ్యులు రంగారావు, భాస్కర్, బానోత్ రాంకోటి, వెంపటి సురేందర్, మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, మండల సమితి సభ్యుడు మిడకంటి పెద్ద వెంకట్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, బట్ట బాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 18, 19న గిరిజన సమాఖ్య రాష్ట్ర మహాసభలు

రాష్ట్ర అధ్యక్షుడు అజ్మీర రామ్మూర్తి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఈనెల 18, 19 తేదీల్లో పాల్వంచలో జరిగే తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు అజ్మీర రామ్మూర్తి పిలుపునిచ్చారు. బుధవారం బైపాస్ రోడ్డులోని గిరిప్రసాద్ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర గిరిజన సమాఖ్య ఖమ్మంజిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, రాష్ట్ర అధ్యక్షుడు అజ్మీర రామ్మూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మహాసభలకు అఖిల భారత ఆదివాసీ మహాసభ ఇంచార్జి, సిపిఐ జాతీయ కార్యదర్శి డి. అనీరాజా, జాతీయ ప్రధాన కార్యదర్శి, అఖిల భారత ఆదివాసీ మహాసభ పసుపతి కోల్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హాజరవుతారని తెలిపారు. ఈ మహాసభలలో గిరిజనుల సమస్యలపై చర్చించి పలు తీర్మానాలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గిరిజన స మాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్, అధ్యక్షుడు రాంబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు నర్సింహా, శ్రీను, గుగులోత్ శ్రీను, రామ్మూర్తి, శ్రీకాంత్, పాల్గొన్నారు.

### భారత్‌-అమెరికా వాణిజ్య ఒప్పందం వ్యతిరేకిస్తూ

# రైతుల మోటార్‌సైకిల్ ర్యాలీ

**ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించేది లేదని కేంద్రానికి స్పష్టీకరణ**



**హోషియాపూర్ :** భారత్‌-అమెరికా మధ్య ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందంపై విపక్షాలు, రైతుల నుంచి తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఒప్పందం రైతులకు మరణ శాసనం లాంటిదని, ఏ పరిస్థితుల్లోనూ దీనిని అంగీకరించేది లేదని నిరసనకారులు స్పష్టం చేస్తున్నారు. కేంద్రం తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరుతూ, ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందాన్ని విరమించుకుని రైతులు, సామాన్య ప్రజల ప్రయోజనాలను కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కాగా, ఒప్పందం దేశ వ్యవసాయ రంగాన్ని దెబ్బతీస్తుందని ఆరోపిస్తూ, బుధవారం పంజాబ్‌లోని హోషియాపూర్‌లో రైతులు మోటార్‌సైకిల్ ర్యాలీ నిర్వహించారు. రాష్ట్రంలోని 'దేశ్ బచావో మోర్చా' ఆధ్వర్యంలో వివిధ రైతు సంఘాల పిలుపు మేరకు ఈ ర్యాలీ జరిగింది. ర్యాలీని 'కిసాన్ మజ్దూర్ సంఘర్ష్ కమిటీ' (పిద్ది గ్రూప్) నిర్వహించింది.
సంఘం జిల్లా అధ్యక్షుడు పరమ్‌జిత్ సింగ్ భుల్లా, జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్దీప్ సింగ్ బెగోవాల్ నాయకత్వంలో తండా సమీపంలోని గురుద్వారా పుల్ పుఖ్తా సాహిబ్ వద్ద 'అర్దాస్' (ప్రార్థన) అనంతరం ర్యాలీ ప్రారంభమై తండా, దసుయా, మియాని ప్రాంతాల మీదుగా సాగింది. అనంతరం నిరసనకారులు దసుయా సబ్‌డివిజనల్ మేజిస్ట్రేట్ (ఎస్‌డిఎం) కన్వల్‌జిత్ సింగ్ కార్యాలయానికి చేరుకుని, ప్రతిపాదిత భారత్‌-అమెరికా వాణిజ్య ఒప్పందాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని కోరుతూ ప్రధానమంత్రికి ఉద్దేశించిన వినతిపత్రాన్ని సమర్పించారు. తక్కువ ధరకు లభించే వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతికి ఈ ఒప్పందం మార్గం సుగమం చేస్తుందని, తద్వారా దేశీయ రైతుల ఆదాయం, వ్యవసాయ ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటాయని వారు ఈ వినతిపత్రంలో పేర్కొన్నారు. సమావేశాన్ని ఉద్దేశించి భుల్లా మాట్లాడుతూ తక్కువ ధరకు దిగుమతి అయ్యే వ్యవసాయ ఉత్పత్తుల నుంచి వచ్చే పోటీ కారణంగా ఈ ఒప్పందం రైతులకు, ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులకు హానికరంగా మారుతుందని ఆరోపించారు. 'భారత్‌-అమెరికా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేయాలి, దేశ రైతులు, సామాన్య పౌరుల ప్రయోజనాలను పరిరక్షించాలి' అని వారు అన్నారు. తమ డిమాండ్‌ను ప్రభుత్వం పరిష్కరించడంలో విఫలమైతే, ప్రజాస్వామ్య, రాజ్యాంగబద్ధమైన మార్గాల ద్వారా దేశవ్యాప్త భారీ ఉద్యమాన్ని చేపడతామని వారు హెచ్చరించారు. పంజాబ్ ప్రభుత్వ 'ల్యాండ్ పూలింగ్' విధానాన్ని కూడా భుల్లా విమర్శించారు. సారవంతమైన వ్యవసాయ భూములను నివాస, వాణిజ్య ప్రాజెక్టులకు మళ్లించడం ద్వారా సాగు భూమి తగ్గిపోతుందని, రైతు కుటుంబాల జీవనోపాధి దెబ్బతింటుందని ఆయన ఆరోపించారు. ఈ విధానం ప్రధానంగా పెద్ద బిల్డర్లు, రియల్ ఎస్టేట్ కంపెనీలకే ప్రయోజనం చేకూరుస్తుందని ఆయన పేర్కొన్నారు. నిరసనకారులు కేంద్ర, పంజాబ్ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అలాగే వ్యవసాయ రంగానికి సంబంధించిన అంశాలపై ఏకం కావాలని రైతులు, వ్యవసాయ కూలీలు, యువతకు పిలుపునిచ్చారు.

# వాంగ్‌చుక్ నిరాహారదీక్షను విస్మరించడం క్రూరం

**'కాక్రోచ్ జనతా పార్టీ' వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే**



**న్యూఢిల్లీ :** నిరసనకారులతో చర్చలు జరపడానికి కేంద్ర ప్రభుత్వం నిరాకరిస్తూ 'క్రూరంగా' వ్యవహరిస్తోందని 'కాక్రోచ్ జనతా పార్టీ' (సిజెపి) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే మండిపడ్డారు. నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలకు వ్యతిరేకంగా జంతర్ మంతర్ వద్ద సిజెపి చేపట్టిన నిరసన బుధవారంతో 26వ రోజుకు చేరుకుంది. అదే విధంగా నిరసనకు సంఘీభావంగా పర్యావరణ కార్యకర్త చేపట్టిన నిరాహారదీక్ష 18వ రోజు కూడా కొనసాగింది. సోనమ్ వాంగ్‌చుక్ నిరంతర వైద్య పర్యవేక్షణలో ఉన్నారు. సిజెపి విడుదల చేసిన వైద్య బులెటిన్ ప్రకారం, వాంగ్‌చుక్ ఇంకా చాలా బలహీనంగా ఉన్నారు. 24 గంటల వైద్య పర్యవేక్షణలో ఉన్నారు. ఆయన బరువు 57.15 కిలోలకు పడిపోయింది. గత 24 గంటల్లో 400 గ్రాముల బరువు తగ్గడంతో, దీక్ష ప్రారంభమైనప్పటి నుండి ఆయన మొత్తం 8.9 కిలోల బరువు తగ్గారు. రక్తపోటు 105/76గా, రక్తంలో చక్కెర స్థాయి 80 ఎంజి/డిఎల్‌గా, ఆక్సిజన్ స్థాయి 97 శాతంగా నమోదయ్యాయి, అలాగే శరీరంలో నీటి శాతం (హైడ్రేషన్) సంతృప్తికరంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఆయన స్పృహతో, మానసికంగా చురుకుగా ఉన్నప్పటికీ, నిరంతర పర్యవేక్షణ అవసరమని వైద్యులు తెలిపారు. కాగా, ఆత్మహత్య చేసుకున్న విద్యార్థులకు న్యాయం కోసం తన ప్రాణాలను పణంగా పెట్టిన వ్యక్తికి ప్రభుత్వం నుండి లభించింది కేవలం మౌనం మాత్రమేనని, ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడమే కాకుండా, క్రూరంగా కూడా ఉందని దీప్కే ఎక్స్‌లో పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చర్చలకు ఎందుకు నిరాకరిస్తున్నారని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను ఇప్పటివరకు ఎందుకు బాధ్యులను చేయలేదు అనేవి సమాధానం కోరుతున్న ప్రశ్నలని దీప్కే అన్నారు. 'ప్రధానమంత్రి చర్చలకు ఎందుకు నిరాకరిస్తున్నారు? విద్యాశాఖ మంత్రిని ఎందుకు ఇంకా బాధ్యులను చేయడం లేదు? ఇవే సమాధానం కోరుతున్న ప్రశ్నలు; అధికారంలో ఉన్నవారిని బాధ్యత నుండి తప్పించడానికి ఉపయోగపడే పక్కదారి పట్టించే అంశాలు కావు' అని ఆయన అన్నారు.

**సోనమ్ ఆరోగ్యంపై మీ వైఖరేమిటి?**

సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్యం మరింత క్షీణించిందని, రెండు రోజుల్లో చనిపోయే ప్రమాదం ఉందని, వెంటనే జోక్యం చేసుకుని ఆయనను రక్షించాలంటూ ఢిల్లీ హైకోర్టులో పిల్ దాఖలైంది. దీనిపై బుధవారం విచారణ చేపట్టిన హైకోర్టు, సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్యం క్షీణిస్తున్న నేపథ్యంలో కేంద్రం, ఢిల్లీ ప్రభుత్వం తమ వైఖరిని తెలియజేయాలని నోటీసులు జారీ చేసింది. కేసును గురువారం మరోసారి విచారించనున్నట్లు వెల్లడించింది. సోనం వాంగ్‌చుక్ జూన్ 28 నుంచి ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరవధిక నిరాహార దీక్ష కొనసాగిస్తున్నారు. దీక్ష కొనసాగుతున్న కొద్దీ ఆయన ఆరోగ్యం ఆందోళనకరంగా మారిందని రాకేశ్ కుమార్ సైనీ పిల్‌ను దాఖలు చేశారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణకు హాజరైన ఆయన, వాంగ్‌చుక్ ఆరోగ్యం రోజురోజుకూ క్షీణిస్తోందని, ప్రాణాపాయం తలెత్తే పరిస్థితి ఉందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే వైద్య సహాయం అందేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

## మమత వర్గంలో మరో ఎమ్మెల్యే జంప్



**కోల్‌కతా :** పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వర్గానికి మరో రాజకీయ దెబ్బ తగిలింది. సీనియర్ టిఎంసి ఎమ్మెల్యే మదన్ మిత్రా బుధవారం ప్రతిపక్ష నేత రీటాబ్రత బెనర్జీ నేతృత్వంలోని తిరుగుబాటు శిబిరంలో చేరారు. అయినప్పటికీ, తాను పార్టీలోనే కొనసాగుతున్నానని ఆ ఎమ్మెల్యే స్పష్టం చేశారు. మమతా బెనర్జీకి అనుబంధంగా ఉన్న 'కాళీఘాట్ టిఎంసి' కింద పనిచేస్తున్న అన్ని జాతీయ, రాష్ట్ర సంస్థాగత కమిటీలకు రాజీనామా చేస్తున్నట్లు, అలాగే పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలో పార్టీ చీఫ్ విప్ పదవికి కూడా తక్షణమే రాజీనామా చేస్తున్నట్లు కామర్‌హట్టి సీనియర్ ఎమ్మెల్యే ప్రకటించారు. సంస్థాగత చీలిక బహిరంగంగా వెలుగులోకి వచ్చినప్పటి నుంచి తిరుగుబాటు శిబిరంలోకి జరిగిన అత్యంత ముఖ్యమైన ఫిరాయింపు ఇదే. ఇది మమతా బెనర్జీ నేతృత్వంలోని వర్గం ఎదుర్కొంటున్న సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేస్తుందని భావిస్తున్నారు. 'నేను నా గదిని మాత్రమే మార్చుకున్నాను, ఇంటిని కాదు. నేను పూర్తిగా టిఎంసిలోనే ఉన్నాను' అని అసెంబ్లీలోని తన ఛాంబర్‌లో రీటాబ్రత బెనర్జీని కలిసిన అనంతరం మిత్రా విలేకరులతో అన్నారు. తెల్ల కుర్తా ధరించి, తన ట్రేడ్‌మార్క్ అయిన నల్ల కళ్లజోడు పెట్టుకుని, మిత్రా తిరుగుబాటు నాయకురాలి పక్కన కూర్చున్నారు. తాను తృణమూల్ కాంగ్రెస్ ఎమ్మెల్యేగా కొనసాగుతూనే, మమతా బెనర్జీ నేతృత్వంలోని వర్గం కింద ఇకపై ఎలాంటి సంస్థాగత బాధ్యతలు చేపట్టబోనని ఆయన ప్రకటించారు.

# బిజెపితో రహస్య చర్చలేమీ లేవు

**డీలిమిటేషన్‌పై బిల్లు పెట్టిన తరువాతే ఇండియా కూటమి చర్చిస్తుంది : సుప్రియా సూలే**



**ముంబయి :** ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం పలు రాష్ట్రాల్లో రాజకీయాలు వేగంగా మారుతున్నాయి. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్, మహారాష్ట్రలో పార్టీలో చీలికలు వచ్చాయి. అయితే ఎన్‌సిపి (ఎస్‌పి), మహారాష్ట్ర సిఎం దేవేంద్ర ఫడ్నవీస్ మధ్య జరిగిన సమావేశాలపై వస్తున్న ఊహాగానాలను ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సుప్రియా సూలే తోసిపుచ్చారు. ఈ సమావేశాల వెనుక ఎలాంటి రాజకీయ వ్యూహం లేదన్నారు. బుధవారం జరిగిన మీడియా సమావేశంలో సూలే మాట్లాడుతూ, ఎన్‌సిపి (ఎస్‌పి) మున్సిపల్ కౌన్సిల్ అధ్యక్షుడిపై తీసుకున్న చర్యల విషయాన్ని ప్రస్తావించడానికి సీనియర్ పార్టీ నాయకుడు జయంత్ పాటిల్ అధికారికంగా ఫడ్నవీస్‌తో అపాయింట్‌మెంట్ కోరారని చెప్పారు. 'జయంత్ పాటిల్ అధికారికంగా ముఖ్యమంత్రితో సమయం కోరి, ఆయన కారులో వెళ్లి, కారులోనే తిరిగి వచ్చారు. ఆ సమావేశంలో రహస్యమేమీ లేదు. ముఖ్యమంత్రి నివాసంలో ఆయన్ను ఇంకా ఎవరు కలిశారో మీరు తెలుసుకోవాలనుకుంటే, ముఖ్యమంత్రినే అడగాలి, నన్ను కాదు,' అని ఆమె అన్నారు. మంగళవారం రాత్రి పొద్దుపోయాక ముఖ్యమంత్రి అధికారిక నివాసమైన 'వర్ష'లో అధికార ఎన్‌సిపి, ఎన్‌సిపి (ఎస్‌పి) నాయకుల సమావేశాలు మహారాష్ట్రలో రాజకీయ సమీకరణాలు మారబోతున్నాయనే ఊహాగానాలకు ఆజ్యం పోశాయి. ఈనెల 20న ప్రారంభమయ్యే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో లోక్‌సభ సీట్లను 850కి పెంచి, నియోజకవర్గాల పునర్విభజనను ప్రారంభించే 131వ రాజ్యాంగ సవరణ బిల్లుకు మద్దతు కూడగట్టేందుకు, శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్‌సిపి (ఎస్‌పి), డిఎంకెలను బిజెపి ప్రలోభపెడుతోందని కాంగ్రెస్ నాయకుడు పి. చిదంబరం చేసిన ఆరోపణల నేపథ్యంలో ఈ సమావేశాలు జరిగాయి. ఎన్‌సిపి (ఎస్‌పి) అధికార కూటమిలో చేరనుందన్న ఊహాగానాలను తోసిపుచ్చుతూ, గత 12 ఏళ్లుగా మీడియా తన ప్రమాణ స్వీకారం, మంత్రి పదవి గురించి అంచనాలు వేస్తోందని సూలే అన్నారు. 'ఎవరికి ఏ మంత్రి పదవి ఇవ్వాలో ముఖ్యమంత్రి మాత్రమే నిర్ణయిస్తారు. ఆర్థిక శాఖ గురించి గానీ, వర్షలో జరిగిన సమావేశాల గురించి గానీ వస్తున్న ఈ వార్తలన్నీ ఊహాగానాలే. ఇలాంటి ప్రశ్నలకు ముఖ్యమంత్రి మాత్రమే సమాధానం చెప్పగలరు' అని ఆమె అన్నారు. ప్రతిపాదిత నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియపై సూలే మాట్లాడుతూ కేంద్రం పార్లమెంటులో అధికారిక బిల్లును ప్రవేశపెట్టిన తర్వాతే 'ఇండియా' కూటమి తన వైఖరిని స్పష్టం చేస్తుందని అన్నారు. 'నియోజకవర్గాల పునర్విభజనపై మాకు ఎలాంటి ప్రతిపాదన అందలేదు. బిల్లు వచ్చిన తర్వాత, 'ఇండియా' కూటమిలో దానిపై వివరంగా చర్చిస్తాం. మేము గతంలోనే ఫార్ములాను లిఖితపూర్వకంగా ఇవ్వాలని డిమాండ్ చేశాం. చట్టాన్ని చూడకుండా మేము వ్యాఖ్యానించలేం' అని ఆమె అన్నారు. తాను 19న న్యూఢిల్లీలో జరిగే ఇండియా బ్లాక్ సమావేశానికి, 20న పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ఆధ్వర్యంలో జరిగే అఖిలపక్ష సమావేశానికి హాజరవుతానని బారామతి ఎంపి తెలిపారు. ఇండియా కూటమి ప్రతిపక్ష పార్టీల కూటమి అయినప్పటికీ, అది ఎల్లప్పుడూ భారతదేశానికే అండగా నిలిచిందని ఆమె అన్నారు. 'దేశంపై దాడి జరిగినప్పుడు, కాంగ్రెస్ దేశానికి, ప్రభుత్వానికి అండగా నిలిచింది. ఆ దాడి దేశంపైనే జరిగిందని, ఏ వ్యక్తిపైనో లేదా పార్టీపైనో కాదని రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే స్పష్టం చేశారు. ఆపరేషన్ సింధూర్ సమయంలో, భారతదేశ వైఖరిని తెలియజేయడానికి 100 మంది ఎంపిలు విదేశాలకు వెళ్లారు. ఆ సమయంలో ఎన్‌డిఎ లేదా ఇండియా కూటమి అనే ప్రశ్నే లేదు. మాకు దేశమే ప్రథమం, ఆ తర్వాతే రాష్ట్రం, పార్టీ, ఆపై కుటుంబం' అని ఆమె గుర్తు చేశారు. ప్రతిపాదిత డీలిమిటేషన్ బిల్లుపై ప్రతిపక్షాల వైఖరిపై వస్తున్న ఊహాగానాలను ప్రస్తావిస్తూ, ఇండియా బ్లాక్‌కు వ్యతిరేకంగా వెళ్లే ప్రసక్తే లేదని ఆమె అన్నారు.

## ఆర్థిక సంక్షోభం వైపు దేశం..

**మోదీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలే కారణం : కాంగ్రెస్**



**న్యూఢిల్లీ :** మోదీ ప్రభుత్వ 'ప్రజా వ్యతిరేక విధానాల' కారణంగా దేశం ఆర్థిక సంక్షోభం వైపు వేగంగా అడుగులు వేస్తోందని కాంగ్రెస్ ఆరోపించింది. జూన్ నెలలో టోకు ధరల ద్రవ్యోల్బణం 9.87 శాతానికి పెరగడంతో ఈ వ్యాఖ్యలు చేసింది. పెరుగుతున్న ద్రవ్యోల్బణంపై ప్రధాని నరేంద్ర మోదీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తూ ఈ ఆర్థిక వైఫల్యానికి ఆయనే బాధ్యత వహించాలని పేర్కొంది. 'మోదీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాల వల్ల దేశం ఆర్థిక సంక్షోభం వైపు వెళ్తోంది. గత కొన్ని నెలలుగా కాంగ్రెస్ పార్టీ దీని గురించి ప్రభుత్వాన్ని పదేపదే హెచ్చరిస్తూనే ఉంది' అని కాంగ్రెస్ ప్రధాన కార్యదరి జైరామ్ రమేశ్ ఎక్స్‌లో పోస్టు చేశారు. గత 44 నెలల్లోనే అత్యధిక స్థాయికి (9.87%) చేరిన టోకు ద్రవ్యోల్బణం, ఇంధనం, విద్యుత్ ధరలలో భారీగా (27.4%) నమోదైన పెరుగుదల మధ్య, వ్యవసాయ సాగు విస్తీర్ణం మూడేళ్ల కనిష్ట స్థాయికి పడిపోయిందని ఆయన తెలిపారు. పెరుగుతున్న ద్రవ్యోల్బణం, నిరుద్యోగ భారం కింద సామాన్య ప్రజలు సతమతమవుతుండగా, రైతులు ప్రభుత్వ లోపభూయిష్ట విధానాలు, ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా రెట్టింపు కష్టాలను ఎదుర్కొంటున్నారని రమేశ్ ఆందోళన వ్యక్తం చేశారు. ద్రవ్యోల్బణం పెరగడం వల్ల పరిశ్రమల నిర్వహణ వ్యయం కూడా పెరిగిందని ఆయన ఎత్తిచూపారు. ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన కీలక సూచీలన్నీ రెడ్ అలర్ట్ (ప్రమాద హెచ్చరిక) సంకేతాలను ఇస్తున్న తరుణంలో, పరిస్థితిని చక్కదిద్దడానికి బదులుగా మోదీ ప్రభుత్వం ప్రజల దృష్టిని మళ్లించేలా వార్తల్లో నిలవడానికే ప్రాధాన్యతనిస్తోందని రమేశ్ విమర్శించారు. ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడానికి బదులుగా, ఆందోళనకరమైన ద్రవ్యోల్బణ గణాంకాలను దాచిపెట్టడానికే ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు. తాజా టోకు ద్రవ్యోల్బణ గణాంకాలు మోదీ ప్రభుత్వ ఆర్థిక నిర్వహణ లోపానికి, వైఫల్యానికి స్పష్టమైన నిదర్శనంగా నిలిచాయన్నారు. 'ప్రధానమంత్రి గారూ, ద్రవ్యోల్బణం విషయంలో దేశం మీ సమాధానాన్ని కోరుతోంది; 12 ఏళ్లుగా పాలన సాగిస్తున్న మీరు, ఈ ఆర్థిక వైఫల్యానికి తప్పక సమాధానం చెప్పాలి' అని ఆయన అన్నారు. ఆహారేతర, ఆహార ఉత్పత్తుల ధరలు భారీగా పెరగడంతో, టోకు ధరల ద్రవ్యోల్బణం మే నెలలోని 9.68 శాతం నుండి జూన్ నెలలో 9.87 శాతానికి పెరిగింది.

### అమరవీరుల దినోత్సవ ర్యాలీ...

# 'టిఎంసి'కి హైకోర్టు అనుమతి



**కోల్‌కతా :** మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ వర్గానికి హైకోర్టులో ఊరట లభించింది. బిర్లా ప్లానెటేరియం సమీపంలో ఈనెల 21 అమరవీరుల దినోత్సవ ర్యాలీని నిర్వహించుకోవడానికి కోలకత్తా హైకోర్టు అనుమతించింది. ఈ మేరకు పోలీసులను ఆదేశించింది. గత కొన్నేళ్లుగా సెంట్రల్ కోల్‌కతాలోని ఎస్ప్లనేడ్‌లో ఉన్న విక్టోరియా హౌస్ ముందు టిఎంసి జులై 21న అమరవీరుల దినోత్సవ ర్యాలీని నిర్వహిస్తోంది. అయితే ట్రాఫిక్ సజావుగా సాగేందుకు, శాంతిభద్రతలను కాపాడేందుకు ర్యాలీ వేదికను విక్టోరియా హౌస్ ముందు నుంచి బిర్లా ప్లానెటేరియం సమీపానికి మార్చాలని హైకోర్టు ఆదేశించింది. సమావేశం నిర్వహించేందుకు అనుమతి కోరుతూ దాఖలైన పిటిషన్‌పై విచారణ అనంతరం, బిర్లా ప్లానెటేరియం ముందున్న రోడ్డుపై మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ వర్గం అమరవీరుల దినోత్సవ ర్యాలీని నిర్వహించుకోవడానికి అనుమతించాలని జస్టిస్ సౌగత భట్టాచార్య కోల్‌కతా పోలీసు అధికారులను ఆదేశించారు. కోల్‌కతా నగర నడిబొడ్డున ఉన్న ఎస్ప్లనేడ్ ప్రాంతానికి సమీపంలో కాంగ్రెస్ పార్టీ, టిఎంసి ప్రత్యర్థి వర్గం నిర్వహించే మరో రెండు అమరవీరుల దినోత్సవ సమావేశాలు కూడా జరగనున్నాయని గమనించిన కోర్టు, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూసేందుకు తగినంత మంది సిబ్బందిని నియమించాలని పోలీసు అధికారులను ఆదేశించింది. బిర్లా ప్లానెటేరియం ముందున్న రోడ్డుకు ఒక వైపున పిటిషనర్ సంస్థ సమావేశం నిర్వహించుకోవడానికి అనుమతించాలని, మరో వైపును వాహనాల రాకపోకలకు ఖాళీగా ఉంచాలని జస్టిస్ సౌగత భట్టాచార్య కోల్‌కతా పోలీసు అధికారులను ఆదేశించారు. పాల్గొనేవారి సంఖ్యను 2,500 లోపు ఉంచడానికి పిటిషనర్ పార్టీ ప్రయత్నించాలని కోర్టు పేర్కొంది. ఒకే రోజు మూడు వేర్వేరు ప్రదేశాలలో మూడు సమావేశాలు జరగనున్నందున, శాంతిభద్రతలను కాపాడటానికి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు తగినంత మంది సిబ్బందిని నియమించాలని కోర్టు కోర్టు తెలిపింది. 21న మధ్యాహ్నం 12 గంటల నుండి 3.30 గంటల మధ్య సమావేశం నిర్వహించాలని కోర్టు ఆదేశించింది. కోర్టు ఆదేశం అమలు జరిగేలా చూసే 20 మంది వలంటీర్ల పేర్లు, మొబైల్ నంబర్లను పిటిషనర్లు కోల్‌కతా పోలీస్ జాయింట్ కమిషనర్ (హెడ్‌క్వార్టర్స్)కు అందించాలని జస్టిస్ భట్టాచార్య ఆదేశించారు.

## రాజ్యసభ సభ్యులుగా ఇద్దరు ప్రమాణం





**న్యూఢిల్లీ :** ఇటీవల నూతనంగా ఎన్నికైన ఇద్దరు రాజ్యసభ సభ్యులు బుధవారం పదవీ ప్రమాణం చేశారు. మన్సూర్ అలీ ఖాన్, రాజనీశ్ కుమార్ అగర్వాలతో రాజ్యసభ చైర్మన్ సిపి రాధాకృష్ణ ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో డిప్యూటీ చైర్మన్ హరివంశ్, సెక్రటరీ జనరల్ పిసి మోదీ కూడా పాల్గొన్నారు. కాంగ్రెస్ నేత ఖాన్ కర్నాటక నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యారు. బిజెపికి చెందిన అగర్వాల్ మధ్యప్రదేశ్ నుంచి ఎన్నికయ్యారు. ఖాన్ ఇంగ్లీష్‌లో ప్రమాణం చేయగా, అగర్వాల్ హిందీలో ప్రమాణం చేశారు.

## టోల్ వసూలు, రోడ్ల నిర్మాణ నాణ్యత, భద్రతపై పిఎసి చర్చ



**న్యూఢిల్లీ :** జాతీయ రహదారులపై టోల్ వసూలు, రోడ్ల నిర్మాణ నాణ్యత, రహదారి భద్రత వంటి అంశాలపై పార్లమెంటు పబ్లిక్ అకౌంట్స్ కమిటీ (పిఎసి) బుధవారం సమగ్రంగా చర్చించింది. కాంగ్రెస్ నాయకుడు కె.సి. వేణుగోపాల్ నేతృత్వంలోని పిఎసి, పార్లమెంట్ భవన సముదాయంలో 'ప్రజా మౌలిక సదుపాయాలు, ఇతర ప్రజా వినియోగ సేవలపై రుసుములు, టారిఫ్‌లు, వినియోగదారుల ఛార్జీల విధింపు, నియంత్రణ' అనే అంశంపై ఈ చర్చను నిర్వహించింది. ఈ సమావేశంలో రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ, నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఎఐ), ఇతర సంబంధిత సంస్థల ప్రతినిధులు వివరాలను అందించారు. చర్చ కోసం ఎన్‌హెచ్‌ఎఐ, మంత్రిత్వ శాఖ అధికారులు పిఎసి ముందు హాజరయ్యారని వేణుగోపాల్ తెలిపారు. 'మేము టోల్ వసూలు, నిర్మాణ నాణ్యత... ఇలా అన్ని అంశాలపై చర్చించాము. ఇది ఫలప్రదమైన చర్చ. గతంలో మేము పార్లమెంటుకు సమర్పించిన నివేదికలో డిజైన్లు, నిర్మాణం వంటి వాటికి సంబంధించిన అనేక లోపాలను ఎత్తిచూపాము. ఆ ప్రధాన ఆందోళనలలో కొన్నింటినిఎన్‌హెచ్‌ఎఐ పరిష్కరించినందుకు నాకు సంతోషంగా ఉంది' అని ఆయన విలేకరులతో అన్నారు. సమావేశంలో రహదారి భద్రతకు సంబంధించిన అంశాలపై కూడా చర్చ జరిగిందని ఆయన పేర్కొన్నారు. అదే విధంగా వాణిజ్య వ్యవహారాల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ బుధవారం నాడు భారత్‌-అమెరికా వాణిజ్య ఒప్పందం, దాని మూల్యాంకనం, దానివల్ల కలిగే ప్రభావాలపై చర్చించిందని తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) ఎంపి డోలా సేన్ తెలిపారు. 'మేము భారత్‌-అమెరికా వాణిజ్య ఒప్పందం, దాని మూల్యాంకనం, దానివల్ల కలిగే ప్రభావాలపై చర్చించాము. గత ఆరు నెలలుగా పరిశ్రమలు, వ్యవసాయంపై ఈ వాణిజ్య ఒప్పందం చూపే ప్రభావాల గురించి చర్చిస్తున్నాము. ఆందోళన కలిగించే అన్ని అంశాలను చర్చిస్తున్నాము' అని ఆమె అన్నారు. కమిటీ నివేదికను త్వరలో పార్లమెంటులో సమర్పిస్తామని ఆమె తెలిపారు.

# భారీ అగ్నిప్రమాదాలు

**నోయిడాలోని బహుళ అంతస్తుల భవనంలో ఎగిసి పడిన అగ్నికీలలు: ఇద్దరు మృతి**
**గురుగ్రామ్‌లో ఓ గిడ్డంగిని, మూసివేసిన కింగ్‌డమ్ ఆఫ్ డ్రీమ్స్ కాంప్లెక్స్‌ను చుట్టుముట్టిన మంటలు**



**నోయిడా/ గురుగ్రామ్ :** ఉత్తరప్రదేశ్‌లోని నోయిడా, దేశ రాజధాని ప్రాంతం గురుగ్రామ్‌లో భారీ ప్రమాద ఘటనలు సంభవించాయి. నోయిడా గ్రామంలోని ఒక బహుళ అంతస్తుల భవనంలో బుధవారం అగ్నిప్రమాదం సంభవించి ఇద్దరు మరణించినట్లు పోలీసులు తెలిపారు. మంటలను అదుపులోకి తీసుకువచ్చామని, సెక్టార్ 66లోని మామురా గ్రామంలో ఉన్న ఆ భవనంలో నివసిస్తున్న సుమారు 50 మంది నివాసితులను సురక్షితంగా ఖాళీ చేయించామని అధికారులు తెలిపారు. ఆసుపత్రికి తరలించినవారిలో ఒక పురుషుడు, ఒక మహిళ మరణించినట్లు వైద్యులు ప్రకటించారని పోలీసులు తెలిపారు. జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ రాజీవ్ మిశ్రా ప్రకారం జి ప్లస్‌ఫోర్ అంతస్తులు ఉన్న ఆ భవనంలో ప్రతి అంతస్తులో సుమారు 10 నుండి 12 గదులు ఉన్నాయి, వాటిని నివాస ఫ్లాట్లుగా ఉపయోగిస్తున్నారు. భవన యజమానిని అరెస్టు చేశారు. భవనం లోపల ఛార్జింగ్ పెడుతున్న ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనం కారణంగా మంటలు చెలరేగినట్లు తెలుస్తోందని, ఆ మంటలు ఆవరణలో పార్క్ చేసిన సమీపంలోని పెట్రోల్ ద్విచక్ర వాహనాలకు వ్యాపించాయని మిశ్రా తెలిపారు. మంటలు చెలరేగిన వెంటనే ఏడు అగ్నిమాపక వాహనాలు, ఒక హైడ్రాలిక్ ప్లాట్‌ఫామ్‌ను ఘటనా స్థలానికి పంపించి, చాలా మంది నివాసితులను సురక్షితంగా ఖాళీ చేయించామన్నారు. ఇప్పటికే ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ఇద్దరు వ్యక్తులు పొగ పీల్చడం వల్ల అస్వస్థతకు గురయ్యారని, వారిని అంబులెన్స్‌లో జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు మిశ్రా విలేకరులతో అన్నారు. చట్టంలోని సంబంధిత నిబంధనల కింద భవన యజమాని (లీజుదారు)పై ఫేజ్ 3 పోలీస్ స్టేషన్‌లో ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. మరో ఘటనలో గురుగ్రామ్‌లో వేర్వేరు ప్రాంతాల్లో రెండు భారీ అగ్నిప్రమాదాలు సంభవించాయి. వాటిలో ఒకటి కంపెనీ గిడ్డంగిని, మరొకటి మూసివేసిన కింగ్‌డమ్ ఆఫ్ డ్రీమ్స్ కాంప్లెక్స్‌ను మంటలు చుట్టుముట్టాయి. ఈ రెండు ఘటనల్లోనూ ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని అధికారులు బుధవారం తెలిపారు. మంగళవారం రాత్రి గురుగ్రామ్‌లోని పటౌడీ రోడ్డులో గల ఝుండ్ సరాయ్‌లోని లైఫ్‌లాంగ్ కంపెనీ గిడ్డంగిలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. అగ్నిప్రమాదం జరిగిన వెంటనే గిడ్డంగిలో ఉన్న ఉద్యోగులు ప్రాంగణాన్ని ఖాళీ చేశారు. ఈ ఘటన గురించి సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక శాఖ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పే చర్యలు చేపట్టారు. మంటల తీవ్రత దృష్ట్యా, గురుగ్రామ్‌లోని అన్ని అగ్నిమాపక కేంద్రాల నుండి, అలాగే ప్రైవేట్ కంపెనీల నుండి రెండు డజన్లకు పైగా ఫైర్ టెండర్లను రంగంలోకి దించారు. మంటలను అదుపులోకి తీసుకురావడానికి అగ్నిమాపక సిబ్బంది రాత్రంతా శ్రమించారు. మంటలు వేగంగా వ్యాపించి, అదే భవనంలో పనిచేస్తున్న మరో రెండు కంపెనీలను చుట్టుముట్టాయని ఒక సీనియర్ అగ్నిమాపక అధికారి తెలిపారు. గురుగ్రామ్‌లోని సెక్టార్ 29లో మూసివేసిన 'కింగ్‌డమ్ ఆఫ్ డ్రీమ్స్' సాంస్కృతిక సముదాయంలో బుధవారం మధ్యాహ్నం మరో భారీ అగ్నిప్రమాదం జరిగింది. మధ్యాహ్నం 1.45 గంటల ప్రాంతంలో ఈ ఘటన గురించి అగ్నిమాపక విభాగానికి సమాచారం అందడంతో, 12 ఫైర్ టెండర్లు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చే పనిలో నిమగ్నమయ్యారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని, భవనంలో ఎవరూ చిక్కుకుపోలేదని అధికారులు తెలిపారు.

# సికింద్రాబాద్ రైళ్ల రద్దీకి చెక్

**సీతాఫల్‌మండి- లాలాగూడ కార్డ్ లైన్‌ను తనిఖీ చేసిన రైల్వే జిఎం**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సికింద్రాబాద్ జంక్షన్‌పై రైళ్ల రద్దీని తగ్గించి, కాజీపేట-కాచిగూడ మార్గంలో ప్రయాణ సమయం, దూరాన్ని గణనీయంగా తగ్గించే లక్ష్యంతో ఇటీవల ప్రారంభించిన సీతాఫల్‌మండి-లాలాగూడ కార్డ్ లైన్‌ను దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ బుధవారం క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. హైదరాబాద్ డివిజన్ డిఆర్‌ఎం సంతోష్ కుమార్ వర్మతో పాటు పలువురు సీనియర్ అధికారులు ఈ తనిఖీలో పాల్గొన్నారు. సీతాఫల్‌మండి రైల్వే స్టేషన్‌లో తనిఖీ ప్రారంభించిన జిఎం.. స్టేషన్ పరిశుభ్రత, ప్రయాణికుల వేచి ఉండే హాల్, టికెట్ కౌంటర్లు, ప్లాట్‌ఫారాలు, స్టేషన్ మాస్టర్ కార్యాలయం, సిగ్నలింగ్ వ్యవస్థ, భద్రతా పరికరాలను పరిశీలించారు. అనంతరం కొత్తగా నిర్మించిన సీతాఫల్‌మండి-లాలాగూడ కార్డ్ లైన్‌పై ట్రాలీ తనిఖీ నిర్వహించి, పాయింట్లు, క్రాసింగ్‌లను పరిశీలించారు. సుమారు 3 కిలోమీటర్ల పొడవున్న ఈ కార్డ్ లైన్‌లో ఐదు చిన్న వంతెనలు నిర్మించగా, అలుగడ్డ బావి రోడ్ అండర్ బ్రిడ్జ్ ప్రధాన వంతెనగా ఉంది. ఈ మార్గంలో పూర్తి ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఈ కొత్త లైన్ అందుబాటులోకి రావడంతో కాజీపేట నుంచి కాచిగూడకు వెళ్లే రైళ్లు ఇకపై మౌలాలీ, మల్కాజిగిరి మీదుగా సుమారు 15 కిలోమీటర్ల అదనపు ప్రయాణం చేయాల్సిన అవసరం ఉండదు. లాలాగూడ మీదుగా నేరుగా కాచిగూడకు చేరుకునే అవకాశం కలగడంతో సుమారు 12 కిలోమీటర్ల దూరం, దాదాపు 20 నిమిషాల ప్రయాణ సమయం ఆదా కానుంది. తనిఖీ అనంతరం జీఎం లాలాగూడ స్టేషన్‌ను కూడా సందర్శించి, సిగ్నలింగ్, భద్రతా ఏర్పాట్లను పరిశీలించి, స్టేషన్ మాస్టర్‌తో చర్చించారు.

# ఒక్క చుక్క చమురు కూడా ఎగుమతి చేయం: ఇరాన్

- చర్చలకు రాకపోతే విద్యుత్‌ప్లాంట్లు, వంతెనలు ధ్వంసం: ట్రంప్
- ఏడు గంటలసేపు ఏకధాటి దాడులు
- దక్షిణ ఇరాన్‌లో 30 మంది మృతి: ఏడుగురు ఐఆర్‌జిసి సైనికులు మృతి



**దుబాయ్/వాషింగ్టన్:** అమెరికా–ఇరాన్ మధ్య వరుసగా నాలుగోరోజు బుధవారం కూడా తీవ్రస్థాయిలో గగనతల దాడులు కొనసాగాయి. ఒక్క చుక్క చమురు–గ్యాస్ కూడా పశ్చిమాసియా నుండి ఎగుమతి చేయబోమని ఇరాన్ హెచ్చరించింది. అమెరికా బలగాలకు ప్రధానంగా ఆశ్రయం కల్పిస్తున్న బహ్రైన్,జోర్డాన్,కువైట్‌లలో స్థావరాలపై ఇరాన్ దాడులు కొనసాగించింది. అమెరికా దాడుల్లో ఏడుగురు ఇస్లామిక్ రిపబ్లిక్ సైనికులు హతులయ్యారు. ఒమన్ జలాల్లో రెండు వాణిజ్య నౌకలపై ఇరాన్ చేసిన దాడుల్లో మరణించిన నావికుల సంఖ్య రెండు పెరిగిందని అంతర్జాతీయ సముద్రయాన సంస్థ (ఐఎంఓ) ప్రకటించింది. ఇటీవల అమెరికా చేసిన దాడులవల్ల దక్షిణ ఇరాన్‌లో 30 మంది పౌరులు మరణించారని వారి పాలకులు చెప్పారు. అదే సమయంలో రెండు దేశాల నాయకులమధ్యా హెచ్చరికల వాగ్యుద్ధం తీవ్రరూపం దాల్చింది.ఇస్లామాబాద్ ఒప్పందాన్ని గౌరవించకుండా ఇదేవిధంగా అమెరికా ప్రవర్తిస్తే పశ్చిమాసియా నుండి ఇంధన ఎగుమతులన్నింటినీ నిలిపివేస్తామని, హోర్ముజ్‌లో మరిన్ని వాణిజ్య మార్గాలను అడ్డుకుంటామని, అమెరికా దురాక్రమణ ఆగే వరకూ జలసంధిని మూసే ఉంచుతామని ఇరాన్ పాలకులు హెచ్చరికలు చేయగా, చర్చల బల్ల వద్దకు తిరిగి రాకపోతే యుద్ధాన్ని విస్తరించి ఇరాన్ వ్యాప్తంగా విద్యుత్ ప్లాంటులను సమూలంగా తుడిచిపెడతామని, వంతెనలు ధ్వంసం చేస్తామని డోనాల్డ్ ట్రంప్ ప్రతి హెచ్చరిక చేశారు. ఇరాన్ సెంట్రల్ బ్యాంక్‌కు అనుసంధానమై ఉన్న డిజిటల్ వాలెట్లలో ఉన్న 130 మిలియన్ డాలర్లను స్తంభింపజేసినట్లు అమెరికా ఆర్థికశాఖామంత్రి స్కాట్ బెస్సెంట్ చెప్పారు. ఇరాన్ చమురు,క్రిప్టో కరెన్సీలపై ఆంక్షలను పునరుద్ధరించారు

"వచ్చేవారం ఆరంభంలో వారి పరిస్థితి చాలా ఘోరంగా ఉంటుంది'' అని ఫాక్స్‌న్యూస్‌కు ట్రంప్ బుధవారం చెప్పారు. దాడులు ఇంకా ఎంతకాలం కొనసాగుతాయని అమెరికా బ్రాడ్‌కాస్టర్ ప్రశ్నించగా, "నేను మళ్ళీ చెప్పే వరకూ దాడులు కొనసాగుతాయి'' అని సమాధానమిచ్చారు. ప్రస్తుత దాడులకంటే మరింత విస్తృతంగా భారీ స్థాయిలో దాడులకు ప్రణాళిక రచించేందుకు తన ఉన్నత స్థాయీ సహాయకులతో ట్రంప్ సిత్యుయేషన్ రూములో సమావేశం జరిపారని ఈ విషయం తెలిసిన వర్గాలను ఉటంకిస్తూ ఆక్సియోస్ పేర్కొంది. జలసంధిని తెరిపించడం, అణు కార్యక్రమంపై అమెరికా డిమాండ్లకు తలొగ్గేలా ఇరాన్‌ను ఒప్పించడానికే ఈ వ్యూహ రచన చేస్తున్నారు. జలసంధిలో నౌకలను కదలనీయకుండా ఇరాన్ ఆంక్షలు విధిస్తున్నందువల్ల చర్చలు ముందుకు కదలడంలేదని ట్రంప్ పాలనాయంత్రాంగం బుధవారం ప్రకటించింది.

గడచిన ఏప్రిల్‌లో కాల్పుల విరమణ ప్రకటన,గతనెలలో ఎంఓయు ఒప్పందంపై సంతకాల తర్వాత హోర్ముజ్ జలసంధిలో ప్రత్యామ్నాయ జలమార్గాలు,సుంకాల వసూళ్ళపై వివాదం తలెత్తడంతో జులై ఏడో తేదీ నుండి మళ్ళీ ఇరాన్‌లో లక్ష్యాలపై అమెరికా దాడులు చేయడం ప్రారంభించి కొనసాగిస్తోంది.సెంట్‌కామ్ అధిపతి అడ్మిరల్ బ్రాడ్ కూపర్ మాట్లాడుతూ, ఇరాన్ ఏడు నౌకలపై ఇటీవల చేసిన దాడుల్లో 12 మంది మరణించడం లేదా గాయపడటం, గల్లంతుకావడం జరిగిందన్నారు. దాడులు జరుగుతున్నప్పటికీ వారం రోజుల్లో 300 నౌకల ప్రయాణాలు సజావుగా సాగేందుకు సమన్వయ చర్యలు తీసుకున్నామన్నారు. ఇదిలా ఉండగా, ఇరాన్ క్షిపణి,డ్రోన్ నిల్వకేంద్రాలు,తీర ప్రాంత నిఘా కేంద్రాలపైన, జలసంధి సమీపంలో అమెరికా సెంట్‌కామ్ దాడులు కొనసాగించింది. ఇరాన్‌లో ఏకైక అణువిద్యుత్ కేంద్రం ఉన్న ఓడరేవు నగరం అల్ బుషెర్‌లో పలు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని దాడులు జరిగాయి. ఇరాన్ తీరప్రాంత రక్షణదళాలపైన, గ్రేటర్ టున్బ్ ద్వీపంలోని క్రూయిజ్ క్షిపణి ప్రయోగస్థావరాలే లక్ష్యంగా 90 నిమిషాలు దాడులు చేసినట్లు సెంట్‌కామ్ అధికారులు చెప్పారు. పలుపోర్టు నగరాల్లో పేలుళ్ళు సంభవించాయి. బందర్ అబ్బాస్, ఖిష్మ్,బందర్ ఇమామ్ ఖొమైనీలో కూడా పేలుళ్ళు సంభవించాయి. మరి ముఖ్యంగా ఇరాన్ పెట్రోలియం షిప్పింగ్ దిగ్గజం "మహ్మద్ హుస్సేన్ షంఖానీ నెట్‌వర్క్''ను లక్ష్యంగా చేసుకుని ఎక్కువ దాడులు చేసింది. అమెరికా దాడుల్లో అమరుడైన అలీ ఖమేనా సలహాదారుడు అలీ షంఖానీ కుమారుడు మహ్మద్ హుస్సేన్ షంఖానీ. ఆయన అండతో పనిచేస్తున్న 200 సంస్థలు,వ్యక్తులు,నౌకలపై ఆంక్షలు విధించినట్లు అమెరికా ఆర్థికమంత్రి స్కాట్ బెస్సెంట్ చెప్పారు. ఇరాన్ చమురు ఎగుమతుల వెనుక షంఖానీ నెట్‌వర్క్ ఒక కీలక శక్తి అనీ, ఇదిప్పుడు ప్రపంచ వస్తు వాణిజ్యంలోకి కూడా విస్తరించిందని ఆర్థికశాఖ పేర్కొంది. బహ్రైన్‌లో అమెరికా గగనతల స్థావరమే లక్ష్యంగా ఇరాన్ దాడులు చేయగా, ఇరాన్ ప్రయోగించిన మూడు క్షిపణులను కూల్చివేసినట్లు జోర్డాన్ సాయుధ దళం ప్రకటించింది. గడచిన నాలుగు రోజులుగా జోర్డాన్‌పై ఇరాన్ తన దాడులను తీవ్రతరం చేసింది.

ఇరాన్ ఓడరేవులపై తొలగించిన దిగ్బంధనాన్ని కూడా మంగళవారం అర్ధరాత్రి దాటాక సెంట్‌కామ్ సైన్యాలు అమలు చేస్తూ నిఘా,గస్తీ ప్రారంభించాయి. ఈ దశలో పశ్చిమాసియా నుండి అన్ని రకాల ఇంధన ఎగుమతులనూ నిలిపివేస్తామని ఇరాన్ హెచ్చరిక చేసింది.ఎట్టిపరిస్థితుల్లోనూ హోర్ముజ్ జలసంధిలో విదేశీ జోక్యాన్ని సహించబోమని పునరుద్ఘాటించింది. దీనికి ముందుగా, హోర్ముజ్‌లో నౌకల నుండి 20 శాతం సుంకాలు వసూలు చేస్తామన్న ప్రకటనను ట్రంప్ వెనక్కు తీసుకున్నారు. సుంకాల వసూళ్ళ బదులు గల్ఫ్ మిత్రదేశాలతో పెట్టుబడి ఒప్పందాలు చేసుకుంటామన్నారు.

## ఇరాన్ దాడిలో గల్లంతైన భారత నావికుడు

### హేరంబ్ కర్మార్కర్ మృతి

**దుబాయ్:** సైప్రస్ జెండాతో వెళుతున్న చమురు ట్యాంకర్‌పై గడచిన ఆదివారం ఇరాన్ చేసిన దాడిలో జాడ తెలియకుండాపోయిన భారత నావికుడు,మెరైన్ ఇంజనీర్ హేరంబ్ కర్మార్కర్ మరణించారు. ఆయన వయసు 30 సంవత్సరాలు. కర్మార్కర్ మామగారు వివేక్ టాండాన్ రాయిటర్స్ వార్తాసంస్థతో మాట్లాడుతూ,తమ అల్లుడి మరణం గురించి ట్యాంకర్ నడుపుతున్న నౌకాసంస్థ తమకు ఈ సమాచారాన్ని తెలియజేసిందని చెప్పారు. సౌదీ అరేబియా ప్రభుత్వ పత్రిక బుధవారం ఈ విషయం వెల్లడించింది. ఈ విషయాన్ని ధృవీకరించేందుకు రాయిటర్స్ సంస్థ సంప్రదించినప్పటికీ భారత విదేశీమంత్రిత్వశాఖ వెంటనే స్పందించలేదు.

కర్మార్కర్ మృతదేహం కోసం సైప్రస్ ప్రభుత్వం తీవ్ర గాలింపు చేసింది. 24 మంది సిబ్బందితో వెళుతున్న ఈ ట్యాంకర్‌లో 11 మంది భారతీయ నావికులు,సిబ్బంది ఉన్నారు. సైప్రస్ నౌక తాము చెప్పిన అధికారిక మార్గంలో కాకుండా అక్రమ మార్గంలో జలసంధి దాటి వెళ్ళేందుకు ప్రయత్నం చేసిందని, ఎన్ని హెచ్చరికలు చేసినా పెడచెవిన పెట్టడంతో తాము క్షిపణి దాడి చేశామని ఇరాన్ ఐఆర్‌జిసి ఇంతకుముందే ప్రకటించింది. ఈ దాడిలో కేవలం హేరంబ్ కర్మార్కర్ ఒక్కరే మరణించగా మిగిలిన పదిమంది భారత నావికులు సురక్షితంగా లైఫ్‌బోటు ఎక్కి తీరానికి చేరుకున్నారు. ఆ తర్వాత మళ్ళీ మంగళవారం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు చెందిన ఎంటి అల్ బహియా,ఎంటి మొంబాసా ట్యాంకర్లపై కూడా ఇరాన్ క్షిపణి దాడి చేయడంతో మరో భారతీయ నావికుడు గల్లంతయ్యాడు. ఈ దాడిలో మొత్తం 12 మంది నావికులు గాయపడగా వారిలో తొమ్మిదిమంది భారతీయులు ఉన్నారు. వీరిలో ఇద్దరి పరిస్థితి ప్రమాదకరంగా ఉంది. గతవారంలో అమెరికా–ఇరాన్ మధ్య ఘర్షణలు తిరిగి రాజుకున్నాయి. హోర్ముజ్‌ను మూసివేసినట్లు ఇరాన్ చెబుతుండగా, జలసంధి తెరిచే ఉందని, జలసంధిలో నౌకల రాకపోకలకు తమ సెంట్‌కామ్ సైన్యాలు రక్షకుడి పాత్రలో కాపలాకాస్తాయని ట్రంప్ చెబుతున్నారు.

## సింగపూర్‌లో పెరుగుతున్న మతిమరపు జనం

- 2030 నాటికి 1.52 లక్షలకు చేరే అవకాశం
- పలు ఆసియా దేశాల్లో ఇవే పరిస్థితులు

**సింగపూర్:** ఆగ్నేయ ఆసియాలో సార్వభౌమాధికారంగల ప్రసిద్ధ ద్వీపదేశం సింగపూర్‌లో రోజు రోజుకూ మతిమరపు ప్రజలసంఖ్య పెరిగిపోతుండటం! ఈ సంఖ్య రాబోయే నాలుగేళ్ళలో లక్షల్లో చేరుతుందని ఒక అధ్యయనం వెల్లడించింది. సింగపూర్‌లో మతిమరపు కారణంగా ప్రతినెలా కనీసం ఇద్దరు పౌరులు జాడ తెలియకుండా పోతున్నారని తాజా అధ్యయనం వెల్లడించింది. ప్రస్తుతం సింగపూర్‌లో 72 వేలమంది మతిమరుపు (డెమెన్షియా) గల ప్రజలు ఉన్నారు. 2030 నాటికి ఈ మ తిమరపు జనం సంఖ్య 1.52 లక్షలకు చేరుకుంటుందని సంబంధిత వైద్య నిపుణులు అంచనా వేశారు. కేవలం సింగపూర్‌లోనే కాకుండా ఆసియావ్యాప్తంగా కూడా వివిధ వాతావరణ పరిస్థితులు,ఆధునిక జీవన శైలి కారణంగా ప్రజల్లో మతిమరపు ధోరణి పెరుగుతోందని 2024లోనే ఒక అధ్యయనం వెల్లడించింది. సింగపూర్,ఆసియా దేశాల్లో వృద్ధులసంఖ్యతోపాటు మతిమరపు ప్రజల సంఖ్య కూడా పెరుగుతోంది. సింగపూర్‌లో 60 ఏళ్ళు వయసు దాటిన ప్రజల్లో ప్రతి పది మందిలో ఒకరికి మతిమరపు ఉంది. పాపులేషన్ ఇన్ బ్రీఫ్ నివేదిక ప్రకారం, ఆ దేశంలో 65 ఏళ్ళు వయసుదాటిన ప్రజలు 19.1 శాతం పైగా ఉన్నారు. 2030 నాటికి ఈ సంఖ్య ప్రతి నలుగురిలో ఒకరికి మతిమరపు వచ్చేస్థాయికి చేరుతుంది. ఈ విధంగా వృద్ధుల్లో మతిమరపు నిష్పత్తి పెరుగుతూనే ఉంటుందని అధ్యయన నివేదిక తెలియజేసింది. ఒకదేశంలో ఏడూశాతం అంతకంటే ఎక్కువమంది 65 ఏళ్ళు వయసుదాటినవారు గనుక ఉంటే ఆ దేశాన్ని ఐక్యరాజ్యసమితి "వృద్ధాప్య సమాజం"గా నిర్వచిస్తుంది. సూపర్ ఏజ్డ్ సొసైటీలో ఈ విధంగా వృద్ధులవాటి 20 శాతంకంటే ఎక్కువగా ఉంటుంది.సింగపూర్ ఇప్పుడు ఈ సూపర్ ఏజ్డ్ సొసైటీ హోదా సంపాదించేందుకు సమీపంలో ఉంది. అదేవిధంగా సింగపూర్‌లో సగటు ఆయుర్దాయం కూడా పెరుగుతూనే ఉంది. 2040 నాటికి ఆ దేశంలో మతిమరపుతోపాటు సగటు ఆయుర్దాయం కూడా 85.4 శాతానికి చేరుకుంటుంది. ఐక్యరాజ్యసమితి అంచనాల ప్రకారం ఎక్కువ కాలం జీవించడం ముఖ్యంకాదు, ఎక్కువ కాలం ఆరోగ్యంగా,సంపూర్ణ భౌతిక ప్రపంచ చైతన్యస్థితిలో జీవించడం ముఖ్యం. కానీ జపాన్, దక్షిణకొరియా, హాంకాంగ్, తైవాన్‌లలో కూడా నిర్దిష్ట వయసువారిలో డెమెన్షియా ప్రభావం పెరుగుతున్నట్లు అధ్యయనం పేర్కొంది.ఈ నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలలో ప్రభుత్వాలు ఈ డెమెన్షియా మరింత ఆలస్యంగా వచ్చేందుకు వీలుగా అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నాయి. లాన్సెట్ కమిషన్ కూడా ప్రపంచవ్యాప్తంగా 40 శాతం డెమెన్షియా కేసులకు సంబంధించిన పలు ప్రమాదకర కారణాలు తెలియజేసింది. జీ జిన్‌పింగ్ కూడా 'హెల్తీ చైనా' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు.ప్రజలు కూడా డెమెన్షియా నియంత్రణ విద్యపై దృష్టిసారించాలని ఐక్యరాజ్యసమితి పేర్కొంది.

## జీరో టాలరెన్స్ (మొదటి పేజీ తరువాయి)

పాఠశాలలు, కళాశాలలు, ఇతర విద్యాసంస్థల్లో యాంటీ డ్రగ్ అండ సేఫ్టీ కమిటీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రతి విద్యాసంస్థలో ఒక క్యాంపస్ సేఫ్టీ కోఆర్డినేటర్‌ను నియమించి విద్యార్థుల భద్రత, డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమాలు, కౌన్సెలింగ్, తల్లిదండ్రులు, పోలీసులతో సమన్వయం వంటి బాధ్యతలు అప్పగించాలని సూచించారు. సమావేశంలో ఈగల్ అధికారులు ప్రతిపాదిత యాంటీ డ్రగ్ అండ సేఫ్టీ కమిటీల నిర్మాణం, బాధ్యతలు, అమలు విధానం, పర్యవేక్షణ వ్యవస్థ, కార్యాచరణ మార్గదర్శకాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. దీనిని పరిశీలించిన డిజిపి పలు మార్పులు, చేర్పులు సూచించి మరింత సమగ్ర మార్గదర్శకాలను రూపొందించాలని ఆదేశించారు. అలాగే విద్యాశాఖ అధికారులు, నిపుణులు, ఇతర సంబంధిత శాఖల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకుని స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ , నియంత్రణ మార్గదర్శకాలను ఖరారు చేయాలని సూచించారు. తుది ప్రతిపాదనను ప్రభుత్వానికి పంపే ముందు మరోసారి సమీక్ష సమావేశం నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. విద్యార్థుల అడ్మిషన్ల సమయంలో తప్పనిసరిగా డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, సైకాలజిస్టులు, కౌన్సెలర్ల సేవలు అందుబాటులో ఉంచడం, విద్యార్థులకు కౌన్సెలింగ్, తల్లిదండ్రుల భాగస్వామ్యం పెంచడం, స్వచ్ఛంద సంస్థల సహకారంతో నిరంతర అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం వంటి అంశాలపై సమావేశంలో చర్చించారు. డ్రగ్స్ నియంత్రణలో పోలీసు శాఖ, విద్యాశాఖ, వైద్య ఆరోగ్య శాఖలతో పాటు ఇతర సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని డిజిపి ఆదేశించారు. తెలంగాణలో ప్రతి విద్యార్థికి సురక్షితమైన, ఆరోగ్యకరమైన, డ్రగ్స్ రహిత విద్యా వాతావరణాన్ని కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఈగల్ డైరెక్టర్ సందీప్ షాండిల్యా, ఐజి పద్మజా రెడ్డి, ఎస్పీ గిరిధర్‌తో పాటు ఈగల్ ఫోర్స్‌కు చెందిన పలువురు సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

## పేర్ల తొలగింపునకే

(మొదటి పేజీ తరువాయి)

ఓటర్ జాబితా సమగ్ర సవరణ అవసరం లేదని నిర్ణయించారు. ఇప్పుడు ఓటర్ జాబితాలో 99 శాతం మంది పేర్లు ఇప్పటికే నమోదై ఉన్నప్పుడు మళ్ళీ ఇంటింటికి వెళ్లి అక్కడ ఎవరు నివసిస్తున్నారో మొదటి నుంచి ఆరా తీయడమనేది తెలివి తక్కువ పనవుతుంది. అక్రమ వలసదారులను గుర్తించే పేరుతో బిహార్‌లో గతేడాది ఎస్ఐఆర్ చేపట్టారు. దీనివల్ల దాదాపు ఎనిమిది కోట్ల మంది ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కానీ చివరికి ఎంత మంది విదేశీయులు దొరికారు? ఈ రోజు వరకు బిహార్‌లో ఓట్లు కలిగి ఉన్న అక్రమ వలసదారులు ఎంత మందో ఇసి వెల్లడించలేదు. ఇదేమైనా పిల్లలాటనా? లేక వారి ఇష్టాయిష్టాలా? 500 మంది విదేశీయులను బిహార్‌లో ఎస్ఐఆర్ చేపట్టి గుర్తించారని మీడియా ద్వారా మాకు తెలిసింది. వారిలో 150 మంది బంగ్లాదేశీయులు కాగా, 350 మంది బిహార్ వ్యక్తులను పెళ్లాడిన నేపాలీ హిందూ మహిళలు. కేవలం 150 మంది బంగ్లాదేశీయులను గుర్తించడానికి మీరు ఎనిమిది కోట్ల మంది ప్రజలను ఇబ్బంది పెట్టారు. ఆ పేరిట లక్షలాది మంది పేర్లను ఓటర్ జాబితా నుంచి తొలగించారు. దీనివల్ల ఈసీ సాధించిన ప్రయోజనం ఏంటి? ఇది సమంజసమేనా? అసలు కాదు' అని ఖురేషీ అన్నారు. ఎస్ఐఆర్‌పై ఐక్యరాజ్యసమితి ప్రత్యేక ప్రతినిధుల చేసిన విమర్శలపై స్పందించారు ఎస్‌వై ఖురేషీ. దేశంలో ఎన్నికలు ఎలా నిర్వహించాలో విదేశీయులు మనకు చెప్పాల్సిన అవసరం లేదన్నారు. 'ఒక విదేశీ బృందం దేశంలో ఎన్నికల నిర్వహణపై లేఖ రాసే పరిస్థితికి మనం చేరుకోవడం చాలా బాధాకరం. ఇలా జరిగి ఉండకూడదు. కానీ అదే సమయంలో దీనిని కేవలం మన దేశ అంతర్గత వ్యవహారమని కొట్టిపారేయకూడదు. ఇది చాలా తీవ్రమైన విషయం. ఇది అంతర్జాతీయ వార్తగా మారినందున భారత్ మౌనంగా ఉంటే అనుమానాలు బలపడే అవకాశం ఉంది' అని ఖురేషీ స్పష్టం చేశారు.

**యుపిఎ సర్కార్ నన్ను ఒత్తిడి పెట్టలేదు :**
తన సిఇసి పదవి కాలంలో యుపిఎ–2 ప్రభుత్వం నుంచి ఎటువంటి ఒత్తిడిని ఎదుర్కోలేదని ఖురేషీ తెలిపారు. అప్పట్లో ఇసికి ఉన్న ప్రతిష్ట దృష్ట్యా అటువంటి పని చేయడానికి (ఒత్తిడి తెచ్చేందుకు) ఎవరూ సాహసించేవారు కాదని స్పష్టం చేశారు. ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయనే విషయం ప్రభుత్వానికి ఎప్పుడూ అందరికంటే ఆఖరిగా తెలిసేదని పేర్కొన్నారు. ఎన్నికల నోటిఫికేషన్‌ను విలేకరుల సమావేశంలో ప్రకటించేవాళ్లమని, అప్పుడే ప్రభుత్వానికి కూడా ఆ విషయం తెలిసేదన్నారు.

## ఇక కఠినం

(మొదటి పేజీ తరువాయి)

అఫిలియేషన్ కోసం కళాశాలల దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి వాటిని పరిష్కరిస్తున్నారు. నియమ నిబంధనల ప్రకారం ఏమైనా పత్రాలు తక్కువగా ఉంటే ఆయా పత్రాలను జత చేసేందుకు కళాశాలలకు కొంత గడువు ఇవ్వనున్నారు. ప్రస్తుతం బోర్డ్ వద్ద పెండింగ్‌లో ఉన్న అనుబంధ గుర్తింపు దరఖాస్తులను పరిశీలించి, ప్రతి రోజూ 50 నుంచి 60 దరఖాస్తులను పరిష్కరిస్తున్నట్టు ఇంటర్‌బోర్డ్ వర్గాలు చెబుతున్నాయి. అనుబంధ గుర్తింపు ప్రక్రి యను ప్రతి ఏటా తీవ్ర ఆలస్యమవుతున్న నేపథ్యంలో ఈ సారి జూలై చివరి నాటికి పూర్తి చేసి,ఆ తర్వాత బోర్డ్ నియమ నిబంధనల ప్రకారం కళాశాలల ల్యాబ్స్ ఇతర అంశాలపై దృష్టి పెట్టాలని బోర్డ్ కార్యదర్శి అభిలాష అభినవ్ భావిస్తున్నారు.

**ఇక జిల్లా అధికారులే బాధ్యులు...**
రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు పొందని (ఇంటర్ బోర్డ్ వద్ద రిజిస్ట్రేషన్ చేసుకోని) ప్రైవేటు జూనియర్ కళాశాలలు ఉండకూదని ఇంటర్ బోర్డ్ భావించింది. ఇంటర్ ఫీజు చెల్లించే సమయం వరకు ఆగడంతో విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకని నిర్ణయం తీసుకునే పరిస్థితి నెలకొంటుందని అధికారులు భావించారు. ప్రతి ఏటా నిత్యం జరిగే ఈ పక్రియకు ఇక నుంచి చెక్ పెట్టాలని, ఇందుకు జిల్లా అధికారులను బాధ్యులను చేస్తే కొంత వరకు సఫలీకృతం అయ్యే అవకాశాలు ఉంటాయని ఇంటర్ బోర్డ్ భావిస్తోంది. రిజిస్ట్రేషన్ కోసం ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోని కళాశాలలు ఈనెలాఖరు(జూలై) వరకు దరఖాస్తులు చేసుకునేలా చూడాలని, అలాగే ఇంటర్‌బోర్డ్ నుంచి అనుబంధ గుర్తింపు కోసం కూడా అందరూ దరఖాస్తులు చేసుకునేలా జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఇంటర్ బో ర్డ్ ఆదేశించినట్టు సమాచారం. ఇక నుంచి ఆయా జిల్లా పరిధిలో ఏ ఒక్క కళాశాల కూడా అనుమతి పొందని, అనుబంధ గుర్తింపు లేని కళాశాలలు ఉండకూడదని,ఈ బాధ్యత మొత్తం ఆయా జిల్లా ఇంటర్ బోర్డ్ అధికారులదేనని ఇంటర్ బోర్డ్ స్పష్టం చేసింది. భవిష్యత్తులో ఆయా కళాశాల గుర్తింపు విషయంలో ఏమైనా వివాదాలు వచ్చినా, లేదా ఏదైనా సంఘటనలు జరిగినా అందుకు జిల్లా అధికారులను బాధ్యులను చేయాలని ఇంటర్‌బోర్డ్ ఒక నిర్ణయానికి వచ్చింది.

**ప్రత్యేక కోర్సులు నిర్వహించే కళాశాలకు నోటీసులు..జరిమానా..**
ఇంటర్ బోర్డు నియమనిబంధనలను విరుద్ధంగా ప్రత్యేక కోర్సుల పేరుతో ప్రచారం చేసుకుంటున్న, ప్రత్యేక కోర్సులలో శిక్షణ ఇస్తున్న పలు జూనియర్ కళాశాలపైన ఇంటర్ బోర్డ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు ఇటీవల దాడులు నిర్వహించారు. ఐఐటి,జీ,నిట్ కోర్సులతో ప్రచారం చేసుకునే జూనియర్ కళాశాలలకు ఇంటర్ బోర్డ్ టాస్క్‌ఫోర్స్ బృందం గుర్తించింది. ఇందులో భాగంగా సుమారు 70 నుంచి వంద జూనియర్ కళాశాలలను గుర్తించి నోటీసులను జారీ చేసింది.మరి కొన్ని కళాశాలలకు రూ.70 లక్షల వరకు జరిమానాలు విధించినట్టు తెలిసింది.

ఇంటర్ బోర్డ్ నిబంధనల ప్రకారం ప్రత్యేక కోర్సులకు అనుమతి లేదని ఇంటర్‌బోర్డ్ స్పష్టం చేసింది. ఇక నుంచి కళాశాళల వెబ్‌సైట్స్, వారు చేసుకునే ప్రచార పత్రాలను పరిశీలిస్తామని, ఎక్కడైనా ఇంటర్ కోర్సులకు ప్రత్యేక కోర్సులు కలిసి ఉన్నట్టు గుర్తిస్తే ఇంటర్ బోర్డ్ నిబంధనల ప్రకారం జరిమానా విధిస్తామని ఇంటర్ బోర్ట్ స్పష్టం చేసింది.

## యూరియా ప్లాంట్లు

(మొదటి పేజీ తరువాయి)

సాధనకు జాతీయ పెట్టుబడి విధానం ద్వారా పెట్టుబడులు ప్రోత్సహించి కొత్తగా ఎనిమిది లేదా తొమ్మిది గ్యాస్ ఆధారిత యూరియా ఉత్పత్తి కర్మాగారాలు ఏర్పాటు చేయడం తద్వారా మరో కోటి టన్నుల యూరియా ఉత్పత్తి సామర్థ్యం సాధించడం ఈ కొత్త జాతీయ పెట్టుబడి విధాన లక్ష్యం. దీనివల్ల దిగుమతులపై దేశం ఎక్కువగా ఆధారపడకుండా మన అవసరాలకు సరిపడినస్థాయిలో స్వయంసమృద్ధి సాధించగలుగుతామని మంత్రివర్గ సమావేశానంతరం సమాచార–ప్రసారాలశాఖామంత్రి అశ్వనీ వైష్ణవ్ పాత్రికేయులకు చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. దేశంలో కొత్త యూరియా ప్లాంటు ఏర్పాటు చేసేందుకు కొత్త ప్రతిపాదనలు ఎరువుల మంత్రిత్వశాఖకు కొత్త ప్రతిపాదనలు రావడంతో అందుకు అనుగుణంగా దేశీయ అవసరాలమేరకు మంత్రివర్గం ఈ కొత్త జాతీయ విధానానికి ఆమోదం తెలియజేసిందని అశ్వనీవైష్ణవ్ చెప్పారు.గడచిన దశాబ్ద కాలంలో దేశంలో ఆరు యూరియా ప్లాంట్లు ఏర్పాటు చేశామని, తద్వారా యూరియా దిగుమతులు తగ్గాయని చెప్పారు. 2012లో ప్రభుత్వం రూపొందించిన జాతీయ పెట్టుబడుల విధానం 2019తో ముగిసింది. ఈ కాలంలో లక్ష్యాలమేరకు ప్రభుత్వరంగంలో నాలుగు యూరియా కర్మాగారాలు,ప్రైవేటు రంగంలో రెండు యూరియా కర్మాగారాలు ఏర్పాటు చేశారు. ఇప్పుడు మళ్ళీ కొత్త ప్రతిపాదనల మేరకు స్వయంసమృద్ధి సాధన నిర్ణయం తీసుకున్నారు. దేశంలో ప్రస్తుతం 33 యూరియా తయారీ కర్మాగారాలు పని చేస్తున్నాయి. కొత్త విధానం కింద యూరియా కర్మాగారాలను గ్యాస్ ఆధారిత ప్లాంట్లుగా నిర్మిస్తారు. ప్రస్తుతం దేశంలో మూడుకోట్ల టన్నులు (30 మిలియన్లు) యూరియా ఏటా ఉత్పత్తి చేస్తుండగా, రైతుల అవసరాల నిమిత్తం నాలుగుకోట్ల టన్నులు అవసరం అవుతోంది. కొత్తగా మరో కోటి (10 మిలియన్) టన్నులు యూరియా ఉత్పత్తి సామర్థ్యం సాధించడానికి ఈ తొమ్మిది యూరియా కర్మాగారాలను రాబోయే కాలంలో ఏర్పాటు చేస్తారు.అదేవిధంగా రెండో విడత సెమీకండక్టర్ల వ్యవస్థ విస్తరణకు,దేశీయంగా సొంత మొబైల్ బ్రాండ్లను ఉత్పత్తి చేసేందుకు కూడా మరో రెండు కార్యక్రమాలకు కేంద్రమంత్రివర్గం ఆమోదం తెలియజేసింది. దీని ప్రకారం, రూ.1.27 లక్షల కోట్లతో సెమీకాన్ 2.0 కార్యక్రమాన్ని విస్తరిస్తారు. దీనివల్ల సెమీకండక్టర్ల డిజైన్, ఉత్పత్తి సామర్థ్యాలు బ్రహ్మాండంగా పుంజుకుంటాయి. రెండో విడత సెమీకండక్టర్ మిషన్ కార్యక్రమాన్ని అమలు చేయడంలో భాగంగా ఈ వ్యవస్థకు అవసరమైన అన్ని విభాగాలను విస్తరించేందుకు దృష్టి కేంద్రీకరించి వాటిని అభివృద్ధి చేస్తారు. అంటే చిప్ డిజైన్, సెమీకండక్టర్ పరికరాలు,సెమీకండక్టర్లకు అవసరమైన సూక్ష్మ ముడిపదార్థాలను వివిధ ఆకారాలలో విడిభాగాలుగా పోతపోసి తయారు చేయడం, అధునాతన ప్యాకేజింగ్ విధానం, నిర్ధారణ పరీక్షలు, పరిశోధన, కొత్త నైపుణ్యాన్ని, ప్రతిభను పెంపొందించే చర్యలు తీసుకోవడం వంటి విషయాలపై ఈ 2.0 కార్యక్రమం దృష్టి సారిస్తుంది. ఈ రెండో దశ సెమీకండక్టర్ల వ్యవస్థ అమలును పూర్తిచేస్తే భారత దేశం ఈ రంగంలో స్వదేశీ చిప్‌ల ఉత్పత్తిలో స్వయంసమృద్ధిని సాధించినట్లే అవుతుంది. ఈ పథకం ద్వారా నాలుగు లక్షల కోట్ల పెట్టుబడులను దేశం ఆకర్షిస్తుంది. అదేవిధంగా ఈ స్వయం సమృద్ధి ప్రక్రియ పూర్తయ్యేలోపు రెండు లక్షలకోట్ల రూపాయలు విలువైన సెమీకండక్టర్లు ఉత్పత్తి చేయగలుగుతామని కేంద్ర ప్రభుత్వం అంచనావేస్తున్నట్లు మంత్రి అశ్వనీ వైష్ణవ్ చెప్పారు. మరోవైపు రూ.62,500 కోట్లతో భారత్ మొబైల్ ఫోన్ బ్రాండ్లను ఉత్పత్తి చేసే పథకం ఎంపిఎంఎస్ (మొబైల్ ఫోన్ మాన్యుఫాక్చరింగ్ స్కీమ్)కు కేంద్ర మంత్రివర్గం పచ్చజెండా ఊపింది. తద్వారా దేశంలో మొబైల్ తయారీ పరిశ్రమ మరింత బలోపేతం అవుతుందని, సాంకేతిక సార్వభౌమత్వాన్ని సాధిస్తామని చెప్పారు.భారతదేశ మొబైల్ ఫోన్ల ఉత్పత్తికి కొన్ని ప్రత్యేక నిబంధనలు అమలు చేస్తామని, ఒక ప్రత్యేక ప్రాజెక్టును అమలు చేస్తామని చెప్పారు. తొలుత ప్రభుత్వం దేశంలో ఈ పథకం కింద ఇంతకుముందు భారీస్థాయిలో మొబైల్ ఉత్పత్తులకుగాను ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం (పిఎల్ఐ–ఎల్ఎస్ఇఎం)ను ప్రారంభించింది. ఇప్పుడు ఈ రెండో దశ పథకం 2026–27 ఆర్థిక సంవత్సరంలో ప్రారంభమై 2030–31 ఆర్థిక సంవత్సరంలో ముగుస్తుంది. దీని కోసం రూ.62,500 కోట్లు కేటాయిస్తూ మంత్రివర్గం తీర్మానం చేసింది. ఈ పథకం కింద మొబైల్ రంగంలో కొత్త డిజైన్లను, పరిశోధన,అభివృద్ధితో పాటు పేటెంట్ వ్యవస్థను కూడా అమలు చేస్తుంది. ఈ పథకం అమలు కాలంలో దేశంలో ఎగుమతులు గణనీయంగా పెరగడంతోపాటు మొబైల్ ఫోన్ల ఉత్పత్తి కూడా భారీస్థాయిలో 39 లక్షల కోట్లకు చేరుకుంటుందని అంచనావేస్తున్నట్లు మంత్రి చెప్పారు.అదేవిధంగా ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో రద్దీని తగ్గించేందుకు రూ.25,500 కోట్ల పెట్టుబడులతో రెండు హైవే ప్రాజెక్టుల నిర్మాణానికి కేంద్ర ఆర్థిక వ్యవహారాలపై ఏర్పాటు చేసిన మంత్రివర్గ కమిటీ (సిసిఇఎ) బుధవారం సమావేశంలో ఆమోదముద్ర వేసింది. వరుణానది వెంట ఉన్న ఎన్‌హెచ్–31ను కాశీ రైల్వే స్టేషన్‌ను కలుపుతూ ప్రయాణ సమయం తగ్గించేందుకు హైవే నిర్మిస్తారు. అదేవిధంగా వారణాసిలో రద్దీ తగ్గించేందుకు జాతీయరహదారి ఎన్‌హెచ్–19 కు వారణాసి రింగ్‌రోడ్‌కు మధ్య గంగాతీరం వెంట ఒక నదీతీర కారిడార్ అభివృద్ధికి సిసిఇఎ ఆమోదం తెలియజేసింది. దీనిని ఆరులైన్ల రహదారిగా అభివృద్ధి చేస్తారు. అదేవిధంగా రూ.3,907 కోట్ల అంచనావ్యయంతో రెండు రైల్వే ప్రాజెక్టులకు కేంద్ర సిసిఇఎ ఆమోదం తెలియజేసింది. పారదీప్–హరిదాస్‌పూర్ సెక్షన్‌లో రైల్వే లైను డబ్లింగ్, రాజ్‌ఖర్సావాన్–దాంగోయాపోసి సెక్షన్‌లో నాలుగవ రైల్వే లైను నిర్మాణానికి ఆమోదం తెలియజేశారు. ప్రధానమంత్రి గతిశక్తి పథకం కింద ఈ ప్రాజెక్టులు నిర్మిస్తారు.

## గడువు పొడిగింపు

(మొదటి పేజీ తరువాయి)

షెడ్యూల్ వివరాలను తక్షణమే క్షేత్ర స్థాయి అధికారులతో పాటు రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలకు తెలియజేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధా న అధికారికి కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

**ప్రభుత్వ విజ్ఞప్తితోనే సవరణ..**
వర్షాలు, ఇతర పరిపాలనాపరమైన కారణాల దృష్ట్యా ఓటర్ల సవరణ గ డువును పొడిగించాలని తెలంగాణ ప్రభుత్వం కేంద్ర ఎన్నికల సంఘా న్ని కోరింది. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలనే ఉద్దేశంతోనే ఈ విజ్ఞప్తి చేసినట్లు అధికారు లు తెలిపారు. ఈ ప్రతిపాదనను పరిశీలించిన ఈసి, షెడ్యూల్‌లో మార్పు లు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీనివల్ల కొత్తగా ఓటు హక్కు నమో దు చేసుకునే వారికి, తప్పుల సవరణలకు మరి కొంత సమయం లభించినట్లయింది.

**సవరించిన 'సర్' నూతన షెడ్యూల్..**
–బిఎల్‌ఓల ఇంటింటి సర్వే ముగింపు ఆగస్టు 3.
–డ్రాఫ్ట్ (ప్రాథమిక) ఓటరు జాబితా విడుదల ఆగస్టు 10.
–క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ సెప్టెంబర్ 9.
–అభ్యంతరాల పరిష్కారం (గడువు) అక్టోబర్ 8.
–తుది ఓటరు జాబితా ప్రచురణ (ఫైనల్ లిస్ట్)అక్టోబర్ 12.

## తొలిమెట్టు (మొదటి పేజీ తరువాయి)

పెట్టుబడులు పెట్టాలని ముఖ్యమంత్రి కోరారు. అమెజాన్ వెబ్ సర్వీసెస్ ఆధ్వర్యంలో భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్మించనున్న డేటా సెంటర్‌కు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో పాటు ఇతర ప్రతినిధులతో కలిసి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. పెట్టుబడిదారుల్లో విశ్వాసం కల్పించడానికి సింగిల్ విండో పద్ధతిలో అన్ని అనుమతులు మంజూరు చేస్తున్నామని, 2025 డిసెంబర్‌లో రూపొందించిన పాలసీ మేరకు ఇప్పుడు అమెజాన్‌కు భూమి కేటాయించి ప్రభుత్వం చెప్పింది చేస్తుందన్నారు. వచ్చే 14 ఏళ్లలో 7 బిలియన్ డాలర్లను అమెజాన్ పెట్టుబడులు పెడుతోందని, ప్రభుత్వ సంకల్పం నెరవేరే దిశగా 1 లక్ష కోట్ల పెట్టుబడులు పెట్టాలని, అందుకు ప్రభుత్వ యంత్రాంగం అన్ని విధాలుగా అమెజాన్‌కు సహకరిస్తుందని, ఏది కావాలన్నా సమకూర్చుతామని, పెట్టుబడులపై ప్రతి నెలా సమీక్షిస్తానని సిఎం హామీ ఇచ్చారు. డేటా సెంటర్‌కు శంకుస్థాపన చేసిన అనంతరం జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ఏ దిశగా అయితే భారత్ ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేయాలని సంకల్పించామో, అమెజాన్ నిర్మిస్తున్న దేశంలోనే అతిపెద్ద డేటా సెంటర్ ఈ ప్రాంతంలో రానున్న పరిశ్రమలకు ప్రోత్సాహకరంగా నిలుస్తుందని అన్నారు. భారత్ ఫ్యూచర్ సిటీలో ప్రపంచంలోనే ఫార్చ్యూన్ 500 కంపెనీల పెట్టుబడులను ఆహ్వానించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని చెప్పారు. ఆ ప్రయత్నంలో భాగంగానే 108 దేశాలకు చెందిన ప్రతినిధులు, 3 వేలకు పైగా కార్పొరేట్ దిగ్గజాలను ఆహ్వానించి తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌ను ఇక్కడ నిర్వహించాం. '2034 నాటికి 1 ట్రిలియన్, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తెలంగాణ ఎదగాలనే కల. కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం.

**అత్యాధునిక నగరంగా ఫ్యూచర్ సిటీ**
ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ ద్వారా ప్రపంచ స్థాయి,కాలుష్యరహిత,అత్యాధునిక నగరాన్ని నిర్మిస్తున్నామని తెలిపారు. సింగిల్ విండో విధానం,పారదర్శక అనుమతుల వ్యవస్థ, వేగవంతమైన భూ కేటాయింపులతో పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణాన్ని ప్రభుత్వం కల్పిస్తోందన్నారు.పెట్టుబడిదారుల సమస్యలను ప్రతి నెల స్వయంగా సమీక్షించి తక్షణ పరిష్కారం అందిస్తామని హామీ ఇచ్చారు. పారిశ్రామిక, పర్యాటక,ఇంధన,క్రీడలు,ఆరోగ్యం,సంక్షేమ రంగాలకు సమగ్ర విధానాలను రూపొందించామని, నాణ్యమైన విశ్వవిద్యాలయాలు,పరిశోధనా సంస్థలు, నైపుణ్యాభివృద్ధి కేంద్రాల ద్వారా యువతకు ప్రపంచ స్థాయి అవకాశాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

**డేటా సెంటర్ ఎకోసిస్టమ్ మరింత బలోపేతం**
అమెజాన్ డేటా సెంటర్ ఏర్పాటుతో తెలంగాణలో డేటా సెంటర్ ఎకోసిస్టమ్ మరింత బలోపేతం అవుతుందని, దీనివల్ల ఐటీ, సాఫ్ట్‌వేర్, అనుబంధ పరిశ్రమలు పెద్ద ఎత్తున రాష్ట్రానికి వచ్చే అవకాశముందని తెలిపారు.హైదరాబాద్‌ను కాలుష్యరహిత, సుస్థిర మహానగరంగా తీర్చిదిద్దేందుకు ఎలక్ట్రిక్ బస్సులు, ఈవీ వాహనాలకు ప్రోత్సాహకాలు, పన్ను మినహాయింపులు వంటి చర్యలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ఢిల్లీ కాలుష్యం, ముంబై వరదలు, బెంగళూరు ట్రాఫిక్ సమస్యలు వంటి పరిస్థితులు హైదరాబాద్‌లో తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో నగరాభివృద్ధి చేపడుతున్నామని తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్ వెలుపల, రీజినల్ రింగ్ రోడ్ లోపల ఉన్న విస్తార ప్రాంతాన్ని తయారీ పరిశ్రమల కేంద్రంగా అభివృద్ధి చేసి, విద్యుత్, నీరు, భూమి, అనుమతులు, నైపుణ్యంతో కూడిన మానవ వనరులను అందుబాటులో ఉంచడం ద్వారా భారీ పెట్టుబడులను ఆకర్షించి లక్షలాది ఉద్యోగాలను సృష్టిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు.

**రైతుల త్యాగం ప్రభుత్వం ఎప్పటికీ గుర్తు పెట్టుకుంటుంది**
ప్రభుత్వం విజన్ సాధనలో రైతుల త్యాగం ఎప్పటికీ గుర్తు పెట్టుకుంటుందని, అభివృద్ధి కోసం భూములు ఇస్తున్న రైతులకు మరింత నష్ట పరిహారాన్ని పెంచి గౌరవించాలని, వారికి మరింత భరోసా, వారిలో విశ్వాసం కల్పించాల్సి ఉందని ముఖ్యమంత్రి చెప్పారు. కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సలహాదారు కె.రామ కృష్ణా రావు, అమెజాన్ ప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**డేటా సెంటర్ తెలంగాణకు గర్వకారణ: మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు**
ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలో అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఎడబ్ల్యూఎస్) డేటా సెంటర్‌కు భూమిపూజ కార్యక్రమం నిర్వహించడం తెలంగాణకు గర్వకారణమని రాష్ట్ర ఐటి శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ఈ ప్రాజెక్టు రాష్ట్రంలో డిజిటల్ మౌలిక సదుపాయాల విస్తరణకు, పెట్టుబడుల ఆకర్షణకు, ఉపాధి అవకాశాల కల్పనకు కీలక మైలురాయిగా నిలుస్తుందన్నారు. ప్రభుత్వం పరిశ్రమలకు నియంత్రణ సంస్థగా కాకుండా సహాయకుడిగా(ఫసిలిటేటర్) వ్యవహరిస్తోందని,పెట్టుబడిదారులకు అవసరమైన భూమి, అనుమతులు, మౌలిక సదుపాయాలు వేగంగా అందించడం ప్రభుత్వ ప్రధాన బాధ్యతగా భావిస్తోందన్నారు.

## ఫిఫా ప్రపంచకప్‌లో స్పెయిన్ సంచలనం..

# ఫ్రాన్స్‌ను ఓడించి ఫైనల్‌లోకి

‘ఫిఫా ప్రపంచ కప్ 2026’ లో స్పెయిన్ సంచలనం సృష్టించింది. టోర్నీలో హాట్ ఫేవరెట్‌గా బరిలోకి దిగిన ఫ్రాన్స్‌కు షాకిచ్చి ఫైనల్లోకి దూసుకెళ్లింది. టెక్సాస్‌లోని ఏటీ, టీ స్టేడియంలో బుధవారం జరిగిన సెమీఫైనల్ మ్యాచ్‌లో స్పెయిన్ 2–0 గోల్స్ తేడాతో ఫ్రాన్స్‌పై ఘన విజయం సాధించింది. 2010లో ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన తర్వాత స్పెయిన్ మళ్లీ వరల్ కప్ ఫైనల్‌కు అర్హత సాధించడం ఇదే తొలిసారి. మ్యాచ్ ఆరంభం నుంచే స్పెయిన్ పట్టు బిగించింది. ఆట 22వ నిమిషంలో స్పెయిన్ యువ సంచలనం లామిన్ యమాల్ను ఫ్రాన్స్ డిఫెండర్ లూకాస్ డిగ్నే ఫౌల్ చేయడంతో రిఫరీ పెనాల్టీని కేటాయించారు. ఈ అవకాశాన్ని మికెల్ ఒయర్జాబల్ గోల్గా మలచి స్పెయిన్కు 1–0 ఆధిక్యాన్ని అందించాడు. ఆ తర్వాత కూడా స్పెయిన్ తమ ఆధిపత్యాన్ని కొనసాగిస్తూ 58వ నిమిషంలో మరో గోల్ సాధించింది. డానీ ఓల్మోతో కలిసి అద్భుతమైన పాస్‌లు మార్చుకున్న పెడ్రో పోరో, గోల్ కీపర్ మైక్ను దాటుకుంటూ బంతిని నెట్లోకి పంపి స్పెయిన్ విజయాన్ని ఖాయం చేశాడు. ఈ మ్యాచ్‌లో ఫ్రాన్స్ స్టార్ ఆటగాడు కైలియన్ ఎంబాపే సహా ఇతర అటాకింగ్ ప్లేయర్లు పూర్తిగా తేలిపోయారు. స్పెయిన్ పటిష్ఠమైన డిఫెన్స్ వారిని పూర్తిగా కట్టడి చేసింది. దాంతో ఫ్రాన్స్ గోల్ చేసే అవకాశాలను కూడా సృష్టించుకోలేకపోయింది. వరుసగా మూడోసారి వరల్ కప్ ఫైనల్ చేరాలన్న ఫ్రాన్స్ ఆశలకు ఈ ఓటమితో తెరపడింది. 14 ఏళ్లుగా కోచ్గా ఉన్న డిడియర్ డెషాంప్స్కు ఇది చేదు వీడ్కోలుగా మిగిలింది. తాజా విజయంతో 2010 నాటి స్వర్ణయుగాన్ని స్పెయిన్ గుర్తుకు తెచ్చింది. తమ జట్టు సమష్టిగా రాణించిందని, ముఖ్యంగా ఫ్రాన్స్ బలాలను అడ్డుకోవడంలో సఫలమయ్యామని స్పెయిన్ మేనేజర్ లూయిస్ డిలా ఫ్యూయెంటె ప్రశంసించాడు. ఆదివారం న్యూజెర్సీలోని మెట్లైఫ్ స్టేడియంలో జరిగే ఫైనల్లో అర్జెంటీనా ఇంగ్లండ్ మధ్య జరిగే రెండో సెమీ ఫైనల్ మ్యాచ్ విజేతతో స్పెయిన్ తలపడనుంది.



## తొలిరౌండ్ దాటని ఆయుష్, లక్ష్యసేన్..ఆశలన్నీ సింధుపైనే






టోక్యోలో జరుగుతున్న జపాన్ ఓపెన్‌లో భారత యువ షట్లర్లు తీవ్రంగా నిరాశపరిచారు. ఇప్పటికే సాత్విక్ సాయిరాజ్ చిరాగ్ శెట్టి జోడీ గాయంతో ఈ సూపర్ టోర్నమెంట్ నుంచి నిష్క్రమించగా.. కుర్రాళ్లు లక్ష్యసేన్, ఆయుశ్ షెట్టిలు సైతం ఇంటిదారి పట్టారు. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లోనే సేన్, ఆయుశ్ ఓటమి పాలయ్యారు. స్థానిక షట్లర్ కొకి వటనాబే చేతిలో సేన్ కంగుతినగా.. థాయ్లాండ్కు చెందిన రెండో సీడ్ కున్లవుత్ విటిడ్సర్న్తో పోరాడి ఓడాడు ఆయుష్. ప్రతిష్ఠాత్మక జపాన్ ఓపెన్లో భారత షట్లర్లు తేలిపోయారు. ఫేవరెట్ లక్ష్యసేన్, ఆయుష్ శెట్టిలు తొలి రౌండ్లోనే వెనుదిరిగారు. బుధవారం జరిగిన మ్యాచ్లో జపాన్ కుర్రాడు కొకి వటనాబే ధాటికి సేన్ చేతులెత్తేశాడు. తొలి సెట్ను 16–21తో అలవోకగా కోల్పోయిన భారత స్టార్ రెండో సెట్లోనూ పుంజుకోలేదు. 17వ ర్యాంకర్ వటనాబె శక్తివంతమైన స్మాష్లతో విరుచుకుపడి 21–14తో గెలుపొందాడు. దాంతో సేన్ నిరాశగా కోర్టును వీడాడు.

**ఆయుష్‌పోటాపోటీగా...**మరో మ్యాచ్‌లో ఆయుష్ శెట్టి మాత్రం రెండో సీడ్ ఆటగాడు కున్లవుత్ విటిడ్సర్న్(థాయ్లాండ్)తో హోరాహోరీగా తలపడ్డాడు. ఇద్దరూ పోటాపోటీగా ఆడి చెరొక సెట్ గెలిచారు. దాంతో, నిర్ణయాత్మక మూడో సెట్ అనివార్యమైంది. చివరి సెట్లోల అత్యుత్తమ ఆట కనబరిచిన కున్లవుత్ 21–15తో గెలుపొంది రెండో రౌండ్‌కు దూసుకెళ్లాడు. సేన్, ఆయుశ్ల ఓటమితో పురుషుల బృందం వెనుదిరగగా.. జపాన్ ఓపెన్‌లో పతకం ఆశలన్నీ సింధుపైనే ఉన్నాయి. తొలిరౌండ్ దాటిన తెలుగు తేజం గురువారం హన్‌యూ(చైనా)ను రెండో రౌండ్‌లో ఢీకొట్టనుంది.

# శాసనాలు..చరిత్రకు ఆధారాలు




ఎన్నో శాసనాలు గత చరిత్రకు ఆధారాలుగా నిలుస్తాయి. ప్రపంచ వ్యాప్తంగా వీటికి ఎంతో ప్రాధాన్యం ఉంది. మన దేశంలో వెలుగు చూసిన శాసనాల్లో కీలకమైనవిగా నాసిక్ శాసనం (గౌతమీపుత్ర శాతకర్ణి తల్లి గౌతమీ బాలశ్రీ), నానాఘాట్ శాసనం–(నాగనిక /శాతకర్ణి భార్య), నందవాడి శాసనం (రాజరాజ నరేంద్రుడు), మోటుపల్లి అభయ శాసనం (గణపతి దేవుడు), బయ్యారం చెరువు శాసనం (మైలాంబ/ గణపతి దేవుడి సోదరి), ఎలూరు శాసనం (రవికీర్తి), అలహాబాద్ ప్రసస్తి (హరిసేనుడు), గిర్నార్ / జునాగఢ శాసనం (రుద్రదాముడు), ఇహోళే శాసనం ( రెండవ పులకేశి/ శాసనాన్ని రచించింది రవికీర్తి), మేడోలు శాసనం (దీనేశ్వరుడు), రాజుల మండగిరి శాసనం (అశోకుడు), విజయవాడ శాసనం (యుద్ధమల్లుడు), గారియార్ ప్రసస్తి (నాగభట్టుడు), హాథిగుంఫా శాసనం (ఖారవేలుడు), అద్దంకి శాసనం (పాండురంగుడు), ఎర్రగుడి శాసనం (అశోకుడు).

ఈ శాసనాలన్నీ చారిత్రక ప్రాధాన్యతను కలిగి ఉన్నాయి. నాసిక్ శాసనంలో సాతవాహనుల గొప్ప రాజు గౌతమీపుత్ర శాతకర్ణి విజయాలు, సామ్రాజ్య విస్తృతి, శత్రువులపై విజయాలు కనిపిస్తాయి. దీనిని అతని తల్లి గౌతమీ బాలశ్రీ చెక్కించింది. శాతకర్ణి భార్య నాగనిక చెక్కించిన నానా ఘాట్ శాసనంలో సాతవాహనుల వంశావళి, యజ్ఞాలు, దానాలు గురించి సమాచారం కనిపిస్తుంది. కాగా, నందవాడి శాసనం తూర్పు చాళుక్యుల కాలానికి చెందినది. పరిపాలన, భూదానాలు, సామాజిక నిర్మాణం గురించి తెలియజేస్తుంది. కాకతీయుల కాలం. విదేశీ వ్యాపారులకు రక్షణ (అభయం) ఇచ్చినట్లు పేర్కొంటుంది. ఇది వాణిజ్య అభివృద్ధిని మోటుపల్లి అభియ శాసనం సూచిస్తుంది. గణపతి దేవుడి సోదరి మైలాంబ చెరువు నిర్మాణం చేసినట్లు ‘బయ్యారం చెరువు శాసనం’ చెబుతుంది. నాటి నీటి పారుదల వ్యవస్థపై సమాచారం ఇస్తుంది. ఎలూరు శాసనాన్ని రవికీర్తికి చెందిందిగా చెప్తారు. అయితే, రవికీర్తి అనే పేరు ఐహోలే శాసనంలో కనిపిస్తుంది. నాటి నాగరికత వంటి అంశాలు అందులో ఉన్నప్పటికీ, ఎవరికి సంబంధించిందనే విషయంపై స్పష్టత లేదు. సముద్రగుప్తుని విజయాలను వర్ణించే ప్రసిద్ధ శాసనం ‘అలహాబాద్ ప్రసస్తి’. అతని దిగ్విజయ జైత్రయాత్రలను ఈ శాసనం వివరంగా చెబుతుంది. శక రాజు రుద్రదాముడు చెక్కించిన గిర్నార్/జునాగఢ శాసనంలో సుధర్షణ సరస్సు మరమ్మతుల గురించిన వివరణ ఉంది. చాళుక్య రాజు పులకేశి II విజయాలను ఐహోలే శాసనం కవి రవికీర్తి వర్ణించాడు. ఇది చాళుక్య చరిత్రకు కీలకం. మౌర్య చక్రవర్తి అశోకుడు ధర్మప్రచారం కోసం చెక్కించిన శాసనాలలో ‘రాజుల మండగిరి శాసనం’ ఒకటి. ఇందులో బౌద్ధ ధర్మానికి సంబంధించిన అంశాలను పేర్కొన్నారు. ఎర్రగుడి శాసనంలో అశోకుడి ధర్మశాసనాలలో ఒకటి. ప్రజలకు నైతిక జీవన విధానాన్ని సూచిస్తుంది. కలింగ రాజు ఖారవేలు జీవిత విశేషాలు, యుద్ధాలు, ప్రజల కోసం ఆయన చేపట్టిన పనుల వివరాలను ‘హాథిగుంఫా’ శాసనం వివరిస్తుంది. తూర్పు చాళుక్య కాలానికి చెందిన అద్దంకి శాసనం అప్పటి భూదానాలు, సామాజిక వ్యవస్థపై సమాచారం ఇస్తుంది.

## తవ్వకాల్లో బయటపడిన బారెల్స్



నార్వేలోని స్కియెన్ పట్టణంలో జరిగిన పురావస్తు తవ్వకాలలో 17వ శతాబ్దానికి చెందిన మూడు మూసివేసిన ఓక్ చెక్క బారెల్స్ వెలుగులోకి రావడం చరిత్ర పరిశోధనలో విశేష ప్రాధాన్యం సంతరించుకుంది. నీటి, మురుగునీటి వ్యవస్థల ఆధునీకరణ పనుల సందర్భంగా బయటపడిన ఈ బారెల్స్ శతాబ్దాల పాటు భూమిలో ఉన్నప్పటికీ దాదాపు చెక్కుచెదరకుండా ఉండటం పరిశోధకులను ఆశ్చర్యపరిచింది. వీటితో పాటు చెక్కతో తయారైన ఒక భారీ ముద్ద పరికరం, అలాగే నిర్మాణ పనులకు ఉపయోగించే లైమ్ పదార్థం కూడా లభించాయి. పరిశోధకుల అభిప్రాయం ప్రకారం, ఈ బారెల్స్‌లో నిల్వ చేసిన స్లేక్డ్ లైమ్‌ను నిర్మాణాల్లో ఉపయోగించే మోర్టార్ తయారీ కోసం భూమిలో ఉద్దేశపూర్వకంగా పాతిపెట్టారు. తీవ్రమైన చలిలో అది గడ్డకట్టకుండా, రసాయనిక లక్షణాలు దెబ్బతినకుండా కాపాడేందుకు ఈ పద్ధతిని అనుసరించినట్లు తెలుస్తోంది. ఇది అప్పటి నిర్మాణ కార్మికులకు ప్రకృతి పరిస్థితులపై ఉన్న అవగాహనను, వారి సాంకేతిక నైపుణ్యాన్ని స్పష్టంగా తెలియజేస్తోంది. తవ్వకాలలో లభించిన నేల పొరల విశ్లేషణలో 17వ శతాబ్దపు అవశేషాల కింద 9వ శతాబ్దానికి చెందిన సాంస్కృతిక ఆనవాళ్లు కూడా గుర్తించారు. దీనివల్ల స్కియెన్ ఒకప్పుడు ప్రముఖ వాణిజ్య కేంద్రంగా అభివృద్ధి చెందినట్లు భావిస్తున్నారు. లైమ్ కారణంగా ఏర్పడిన ఆక్సిజన్ లేని వాతావరణమే ఈ చెక్క బారెల్స్‌ను శతాబ్దాల పాటు కాపాడిందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ప్రస్తుతం వీటిని సంరక్షించి మ్యూజియంలో ప్రదర్శించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మొత్తం మీద ఈ బారెల్స్ గత సమాజాల నిర్మాణ విజ్ఞానం, సాంకేతిక పరిజ్ఞానం, ప్రకృతితో వారి అనుబంధాన్ని అర్థం చేసుకోవడానికి విలువైన ఆధారంగా నిలుస్తున్నాయి.

## ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చేందుకు కేంద్రం కుట్ర

### ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి




**ప్రజాపక్షం/నకిరేకల్ :** ఉపాధి హామీ పథకం నీరుగార్చేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కుట్ర చేస్తుందని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం నకిరేకల్ మార్కెట్ యార్డ్‌లో జరిగిన ఎఐటియుసి నియోజకవర్గ 5వ మహాసభలో ముఖ్య అతిథిగా దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. రాష్ట్రం ఏర్పడి 12 సంవత్సరాల అవుతున్న నేటికీ రాష్ట్రంలో అవుట్ సోర్సింగ్ కాంటాక్ట్ కార్మికుల జీవితాలు మారలేదన్నారు. కనీస వేతనం లేక పిఎఫ్, ఇఎస్ఐ అమలు నోచుకోక కార్మికులు శ్రమదోపిడీకి గురవుతున్నారు. ఈనెల 19న గుర్రంపోడులో జరిగే ఎఐటియుసి నల్లగొండ జిల్లా 11 మహాసభలను విజయవంతం చేయాలని దేవేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు లొడంగి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. మహాసభలో ఎఐటియుసి నాయకులు గౌనీ లక్ష్మీనరసయ్య, వంగూరి రవి, పందిరి యాదగిరి, పాల్వాయి సాగర్, ఎషబోయిన అనిల్, ఇంద్రకంటి శ్రీను, వింజమూరి పరమేష్, బొజ్జ ముత్తయ్య, రమేష్ లింగయ్య, లింగయ్య, యాదగిరి, బాలస్వామి, వెంకటేష్, జంగయ్య, సైదులు, బాలరాజు, సాగర్ రాజు, విక్రమ్ పాల్గొన్నారు.

## సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలి

### ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్



**ప్రజాపక్షం/వాంకిడి :** సంఘటిత, అసంఘటిత కార్మికులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. వాంకిడి సామాజిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఎఐటియుసి జిల్లా మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి, గతంలో అమల్లో ఉన్న 44 కార్మిక చట్టాలను యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్రతి కార్మికుడికి నెలకు కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించాలని లేదా సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని కోరారు. ఆర్‌టిసిని పూర్తిస్థాయిలో ప్రభుత్వంలో విలీనం చేసి, డ్రైవర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. వైద్యశాఖలో పనిచేస్తున్న సిబ్బందికి కనీస వేతనం కల్పించి రెగ్యులర్ చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు మహేష్, పుప్పిరి వెంకటేష్, దినకర్, భాగ్యలక్ష్మి , రాధిక, సాయికిరణ్, సిద్ధు, సరోజ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక న్యాయం, హక్కుల రక్షణకు ఉద్యమించాలి

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి పిలుపు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సామాజిక న్యాయం, భారత రాజ్యాంగం కల్పించిన హక్కుల పరిరక్షణ కోసం ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో బుధవారం దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) రాష్ట్ర స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. తరగతుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి కె.ఏసురత్నం అధ్యక్షత వహించారు. ‘‘సమకాలీన రాజకీయ పరిస్థితులు – రాజకీయ కర్తవ్యాలు’’ అనే అంశంపై చాడ వెంకట్‌రెడ్డి ఉపన్యసించారు. సమాజంలోని దళితులు, ఆదివాసీలు, వెనుకబడిన వర్గాలు, మైనారిటీలు రాజ్యాంగం కల్పించిన హక్కులను పూర్తిస్థాయిలో అనుభవించే పరిస్థితులను కల్పించడం ప్రతి ప్రజాస్వామ్య ప్రభుత్వ బాధ్యత అని ఆయన అన్నారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వం సాధించాలనే రాజ్యాంగ లక్ష్యాలను అమలు చేసినప్పుడే ప్రజాస్వామ్యం మరింత బలపడుతుందని ఆయన పేర్కొన్నారు. దేశంలో దళితులు, ఆదివాసీలు, వెనుకబడిన వర్గాలు, మైనారిటీలపై వివక్ష, హింసాత్మక దాడులు, అన్యాయాలు పెరుగుతున్నాయని చాడ వెంకట్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రజాసంఘాలు, ప్రజాస్వామ్య శక్తులు, యువత, మహిళలు, కార్మికులు, రైతులు, విద్యార్థులు ఐక్యంగా ఉద్యమాలను నిర్మించాలని పిలుపునిచ్చారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రూపొందించిన భారత రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుతూ సామాజిక సమానత్వం, సౌభ్రాతృత్వం, లౌకిక విలువలను పరిరక్షించడం ప్రతి పౌరుడి బాధ్యత అని ఆయన అన్నారు. రాజ్యాంగ హక్కులపై ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు నిరంతర ప్రజా ఉద్యమాలు కొనసాగించాలని సూచించారు. సామాజిక న్యాయం పూర్తిస్థాయిలో అమలయ్యే వరకు ప్రజాస్వామ్య, ప్రగతిశీల శక్తులు తమ పోరాటాలను మరింత ఉధృతం చేయాలని చాడ వెంకట్‌రెడ్డి కోరారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పానగంటి పర్వతాలు, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అనిల్ కుమార్, కార్యనిర్వహక అధ్యక్షులు తాళ్లపల్లి లక్ష్మణ్‌తో పాటు వివిధ జిల్లాల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఎఐటియుసిలో భారీగా చేరికలు

### కండువా కప్పి ఆహ్వానించిన సంఘం జిల్లా అధ్యక్షుడు అజయ్ సారథిరెడ్డి



**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో బుధవారం సిఐటియు కార్మిక సంఘం నుంచి ఎఐటియుసిలో మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని సుమారు 40 మంది ఆర్‌టిసి అద్దె బస్ డ్రైవర్లు, క్లీనర్లు, కార్మికులు చేరారు. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు బి అజయ్ సారథిరెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా చేరిన వారిని ఉద్దేశించి అజయ్ సారథిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రేషపల్లి నవీన్ మాట్లాడుతూ ఆర్‌టిసిని పూర్తిస్థాయిలో ప్రభుత్వంలో విలీనం చేసి, సంస్థలో పనిచేస్తున్న డ్రైవర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో కార్మికుల కోసం అద్దె బస్ డ్రైవర్లు క్లీనర్ల కోసం ఎఐటియుసి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎఐటియుసి చేస్తున్న పోరాటాలకు ఆకర్శితులు అయి జిల్లా కేంద్రంలో వందలాదిమంది కార్మికులు ఎఐటియుసిలో చేరుతున్నారన్నారన్నారు. అన్ని రంగాల కార్మికులు, ఆశా వర్కర్లు, అంగన్వాడీలు, భవన నిర్మాణ కార్మికులు, తాపీ కార్మికులు, ఆశాలు సెకండ్ ఎఎన్ఎంలు, తోపుడు బండ్లు, చెరుకురసం బండ్లు, గప్చుప్ బండ్లు, వీధి వ్యాపారస్తులు అనేకమంది వందలాదిమంది కార్మికులు ఎఐటియుసిలో చేరుతున్నారని, వారి కోసం వారికి అండగా ఎఐటియుసి ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని ఒకవైపు కార్మికులకు అండగా ఉంటూ యాజమాన్యాలతో మాట్లాడుతూ ప్రతి సంవత్సరం రేట్లు పెంచుతూ ముందుకు పోతున్నామన్నారు. భవిష్యత్తులో ఏ కష్టం వచ్చినా కార్మికులకు ఎఐటియుసి ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సిఐటియు నుండి ఎఐటియుసిలో చేరిన అద్దె బస్ డ్రైవర్లు, క్లీనర్లు మరియు కార్మికులకు అండగా ఉండి వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని వారు తెలిపారు. ఎఐటియుసిలో చేరిన వారిలో దొంతు రవీందర్ గౌడ్, గడ్డం శ్రవణ్ కుమార్, రవీందర్, సంతోష్, సతీష్, రవికుమార్, వీరన్న, వెంకన్న, ఎలేందర్, బిక్షపతి, హైమద్, యాకయ్య, పవన్, నరేష్, రాజేష్, సురేష్, దసరు నాగేష్, ఉన్నారు ఈ కార్యక్రమంలో వెలుగు శ్రావణ్, ఆబోతు అశోక్ తదితరులు పాల్గొన్నారు ఏఐటియుసిలో చేరిన సందర్భంగా మిఠాయి తినిపించుకొని సంబరాలు చేసుకున్నారు. ఇటీవల ఎన్నికల్లో 33 వ వార్డు లో హ్యాట్రిక్ విజయం సాధించి బి.అజయ్ సారథి రెడ్డిని, 18వ వార్డులో విజయం సాధించిన రేశపల్లి నవీన్‌ని కార్మికులు శాలువాతో సన్మానించారు.

## గిరిజన సంక్షేమం, హక్కుల పరిరక్షణకు ఐక్య పోరాటాలు

### సిపిఐ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు

**ప్రజాపక్షం/సూర్యాపేట :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న గిరిజన వ్యతిరేక విధానాలపై గిరిజన హక్కుల పరిరక్షణ కోసం రాబోయే రోజుల్లో రాజీలేని పోరాటాలు నిర్వహించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ధర్మభిక్షం భవన్‌లో సూర్యాపేట జిల్లా 3వ మహాసభ గిరిజన సమాఖ్య జిల్లా నాయకులు సుల్తాని వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై గిరిజన సమాజం అంతా ఐక్యంగా పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. గిరిజన హక్కుల హక్కులు, సమస్యల సాధనకు ఉద్యమించాలని కోరారు. గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోత్ రాజారామ్ నాయక్ మాట్లాడుతూ గిరిజన సమస్యలపై పోరాటాలు నిర్వహించేందుకు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహించాలన్నారు. ఈనెల 18,19తేదీల్లో పాల్వంచ కేంద్రంగా జరిగే తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర 3వ మహాసభలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. గిరిజనుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం వారి హక్కుల సాధనకై నిరంతరం పోరాడుతామని స్పష్టం చేశారు. అనంతరం గిరిజన సమైక్య నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా రాయపూడి కాటంరాజు, ఉపాధ్యక్షులుగా భూక్య లలిత, బానోత్ ప్రతాప్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా గుగులోతు రాజారాం, సహాయ కార్యదర్శిగా సుల్తాన్ వెంకటేశ్వర్లు, ఇస్లావత్ మనోజ్, కోశాధికారిగా జి.నరేష్‌తోపాటు 19 మందితో కమిటిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, సంఘ నాయకులు రాయపూడి కాటంరాజు, భూక్య లలిత, బానోత్ ప్రతాప్, గుగులోతు నరేష్, బానోతు రవి, నాయకులు శ్రీకాంత్, సైదులు తదితరులు పాల్గొన్నారు.



# మేనేజర్ లేక అవస్థలు

## కెనరా బ్యాంక్‌లో రెండు నెలలుగా నిలిచిపోయిన రైతుల పెట్టుబడి రుణాలు

### ఖాతాదారులకు తప్పని తిప్పలు

### గ్రామీణ ప్రాంతమైన కొంపెల్లికి తెలుగులో మాట్లాడగలిగే బ్యాంక్ మేనేజరే కావాలి




**ప్రజాపక్షం/మునుగోడు:** మండలంలోని కొంపెల్లి గ్రామంలోని కెనరా బ్యాంకులో గత రెండు నెలలుగా శాశ్వత మేనేజర్ లేకపోవడంతో వేలాది మంది ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామీణ ప్రాంతానికి కేంద్రంగా ఉన్న ఈ శాఖ ద్వారా కొంపెల్లి,కలకుంట్ల, కోతులారం, చలిమెడ, వెల్మకన్నె,గుజ్జ తదితర గ్రామాలకు చెందిన పది వేలకుపైగా ఖాతాదారులు సేవలు పొందుతున్నారు.ఇటీవల బ్యాంకు మేనేజర్ బదిలీ కావడంతో కొత్త మేనేజర్ ఇప్పటి వరకు బాధ్యతలు చేపట్టలేదు. దీంతో బ్యాంకులో నగదు చెల్లింపులు, విత్‌డ్రాలు,గోల్డ్ లోన్లు వంటి పరిమిత సేవలు మాత్రమే అందుబాటులో ఉండగా,కాపు రుణాలు, మార్ట్‌గేజ్ (భూమి తనఖా) రుణాలు, ఇతర రుణాల మంజూరు పూర్తిగా నిలిచిపోయింది. ప్రస్తుతం వ్యవసాయ పనులు జోరుగా సాగుతున్న నేపథ్యంలో రైతులు పెట్టుబడి కోసం బ్యాంకు చుట్టూ తిరుగుతున్నా రుణాలు మంజూరు కాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.చేసేదేమీ లేక అధిక వడ్డీకి ప్రైవేట్ వ్యక్తుల వద్ద అప్పులు తెచ్చుకుని సాగు పనులు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అంతేకాకుండా బ్యాంకులో పనిచేస్తున్న కొంతమంది ఉత్తర భారత సిబ్బందికి తెలుగు తెలియకపోవడంతో గ్రామీణ ఖాతాదారులు తమ సమస్యలను వివరించలేక ఇబ్బందులు పడుతున్నారని వాపోతున్నారు. గ్రామీణ ప్రాంతమైన కొంపెల్లిలో స్థానిక ప్రజలతో సులభంగా మాట్లాడగలిగే తెలుగులో ప్రావీణ్యం ఉన్న మేనేజర్‌ను నియమించాలన్నదే ఖాతాదారుల ప్రధాన డిమాండ్ అని పేర్కొంటున్నారు.భాషా సమస్య వల్ల సేవల నాణ్యత దెబ్బతింటోందని,రైతులు,వృద్ధులు,మహిళలు ఎక్కువగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

**మేనేజర్ సంతకం కోసం రెండు నెలలుగా తిరుగుతున్నా :లాలు చలిమెడ గ్రామం**

కొన్ని సంవత్సరాల క్రితం ఇదే బ్యాంకులో మార్ట్‌గేజ్ లోన్ తీసుకున్నాను.రెండు నెలల క్రితమే రుణం పూర్తిగా చెల్లించాను. కానీ మేనేజర్ సంతకం ఉంటేనే భూమి అసలు పత్రాలు ఇస్తామని బ్యాంకు సిబ్బంది చెబుతున్నారు.మేనేజర్ లేక రెండు నెలలుగా తిరుగుతున్నా పని కావడం లేదు. ఇప్పుడు కొత్త కాపు రుణం కూడా తీసుకునే పరిస్థితి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాను అని ఖాతాదారుడు బొమ్మరబోయిన లాలు తెలిపారు.

**కొత్త మేనేజర్ నియామకానికి సిఫారసు చేశాం :రవీందర్, కెనరా బ్యాంకు ఆర్ఓ మేనేజర్**

కొంపెల్లి శాఖకు నియమితులైన మేనేజర్ అనారోగ్య కారణాలతో విధుల్లో చేరలేకపోయారని,కొత్త మేనేజర్ నియామకం కోసం సర్కిల్ ఆఫీస్, హెడ్ ఆఫీస్ అధికారులకు ఇప్పటికే సిఫారసు చేశామని కెనరా బ్యాంకు ఆర్వో మేనేజర్ రవీందర్ తెలిపారు.త్వరలోనే కొత్త మేనేజర్‌ను నియమించి ఖాతాదారుల సమస్యలు పరిష్కరిస్తామని ఆయన వెల్లడించారు.

# రోగులకు ప్రేమతో వైద్యం

## కలెక్టర్ బి.చంద్రశేఖర్

### నాగార్జునసాగర్‌లోని కమలా నెహ్రూ ప్రభుత్వాసుపత్రిలో ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/నందికొండ :** పేషెంట్లతో మర్యాదపూర్వకంగా, గౌరవంగా వ్యవహరిస్తూ నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ వైద్య సిబ్బందిని ఆదేశించారు.బుధవారం నాగార్జునసాగర్‌లోని కమలా నెహ్రూ ప్రభుత్వాసుపత్రిని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ముందుగా ఆరోగ్య మిత్ర కౌంటర్‌ను పరిశీలించిన ఆయన,అక్కడ సిబ్బంది లేకపోవడంతో ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను వివరణ కోరారు.ఆసుపత్రిలో చికిత్స కోసం వచ్చిన పేషెంట్లతో కలెక్టర్ స్వయంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.గురుకుల పాఠశాలలో సీటు వచ్చిన తమ కుమార్తెకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కోసం వచ్చామని ఓకుటుంబం తెలిపింది. మరో మహిళ తాను 350 షుగర్ స్థాయితో చికిత్స కోసం వచ్చానని చెప్పగా,ఆమెకు ధైర్యం చెప్పిన కలెక్టర్, డ్యూటీ వైద్యుడిని పిలిచి సరైన డైట్ ప్లాన్ వివరించి చికిత్స అందించాలని సూచించారు.అనంతరం ఫార్మసీని పరిశీలించిన కలెక్టర్,మందుల నిల్వలు,పంపిణీ వివరాలను రిజిస్టర్‌లో కచ్చితంగా నమోదు చేయాలని ఆదేశించారు.ఓపీ విభాగాన్ని తనిఖీ చేసి రోజుకు సుమారు 200 మంది పేషెంట్లు వస్తున్నట్లు తెలుసుకున్నారు.కోతుల సమస్య నివారణకు త్వరలోనే ఏబీసీ కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు.డయాలసిస్ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ అక్కడ చికిత్స పొందుతున్న రోగి కొల్లి రామలింగంను పలకరించి వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. డయాలసిస్ సేవలు సంతృప్తికరంగా అందుతున్నాయని రోగి కలెక్టర్‌కు తెలిపారు.ఆస్పత్రి సూపరింటిండెంట్ హరికృష్ణ, మున్సిపల్ చైర్మన్ మానస స్వర్ణ సుమన్,తహసిల్దార్ ఖాసీం,మున్సిపల్ కమిషనర్ సిహెచ్ సైదులు,డాక్టర్ అనిత రాణి,ఆసుపత్రి సిబ్బంది, తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# మిర్యాలగూడలో పోలీసుల విస్తృత తనిఖీలు

## నంబర్ ప్లేట్ లేని 11బైకులు, సరైన పత్రాలు లేని 27 వాహనాలు స్వాధీనం




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** జిల్లాలో నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై నిఘా పెంచేందుకు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు మిర్యాలగూడ పట్టణంలో బుధవారం తెల్లవారుజామున విస్తృత వాహన తనిఖీలు నిర్వహించారు. మిర్యాలగూడ ఇంచార్జ్ డీఎస్పీ రవి పర్యవేక్షణలో ఒన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఎం.నాగభూషణరావు, టూ టౌన్ ఇన్స్పెక్టర్ జె.సోమనర్సయ్య, రూరల్ సీఐ పి.ఎన్.డి ప్రసాద్, ముగ్గురు సీఐల ఆధ్వర్యంలో 8 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి పట్టణంలోని ప్రధాన కూడళ్లు, జాతీయ రహదారి మార్గాలు, ప్రవేశ నిష్క్రమణ ప్రాంతాలు, రద్దీ కూడళ్లు అనుమానాస్పద ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో వాహనాల రిజిస్ట్రేషన్, నంబర్ ప్లేట్లు, డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, ఇతర సంబంధిత పత్రాలను పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా సంచరిస్తున్న నంబర్ ప్లేట్ లేని 11 ద్విచక్ర వాహనాలు, సరైన పత్రాలు లేని 27 వాహనాలు సహా మొత్తం 38 వాహనాలను సీజ్ చేశారు. సంబంధిత వాహన యజమానులపై మోటారు వాహనాల చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు చేపట్టారు. అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తులను ప్రశ్నించి వారి వివరాలను సేకరించారు. రాత్రి వేళల్లో నేరాలకు పాల్పడే అవకాశం ఉన్న వ్యక్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచడంతో పాటు పాత నేరస్థుల కార్యకలాపాలపై కూడా పోలీసులు ఆరా తీశారు. ఈ సందర్భంగా డీఎస్పీ రవి మాట్లాడుతూ నేర నియంత్రణ, ప్రజల భద్రత , శాంతిభద్రతల పరిరక్షణే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో పలువురు పోలీసులు అధికారులు, సిబ్బంది ఉన్నారు.



# ఎకరాకు రూ.8 వేల ప్రోత్సాహకం

## తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శి గురిజ రామచంద్రం డిమాండ్

**ప్రజాపక్షం/నల్లగొండ :** రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో తక్కువ వర్షపాతం నమోదవుతున్న నేపథ్యంలో వరికి బదులుగా ప్రత్యామ్నాయ మెట్ట పంటలు సాగు చేసే రైతులకు ఎకరాకు రూ.8 వేల ప్రోత్సాహకాన్ని అందించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శి గురిజ రామచంద్రం డిమాండ్ చేశారు.ఈ బుధవారం రైతు సంఘం ఆధ్వర్యంలో జిల్లా అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్‌కు బుధవారం వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఆశించిన మేర వర్షాలు కురవకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని అన్నారు. పడిన కొద్దిపాటి వర్షాలకు రైతులు పత్తి విత్తనాలు విత్తగా, దాదాపు 30 శాతం విత్తనాలు మొలకెత్తలేదని పేర్కొన్నారు.నకిలీ విత్తనాల సమస్యతో పలుచోట్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రాష్ట్రంలోని 17 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మొహినోద్దిన్,గౌరవ అధ్యక్షులు బంటు వెంకటేశ్వర్లు,గీతాపనివారల సంఘం జిల్లా అధ్యక్షులు పబ్బు వీరస్వామి,రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శులు బండమీది వెంకన్న,బిళ్ళ కనకయ్య, బొడ్డు వెంకన్న,మందుల పాండు,యూసుఫ్,లెనిన్ ఉన్నారు.

# 19న చిలుకూరులో ఎఐవైఎఫ్ జిల్లా మూడవ మహాసభలు




**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) సూర్యాపేట జిల్లా మూడవ మహాసభలు జూలై 19న చిలుకూరులో జరగనున్న మహాసభలను జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ సూర్యాపేట పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు బూర సైదులు, ఎడెల్లి శ్రీకాంత్ పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ధర్మ బిక్షం భవన్‌లో మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరించి వారు మాట్లాడారు. పని హక్కు ప్రాథమిక హక్కుగా గుర్తించాలని సమగ్ర యువజన విధానం కోసం, విద్యా అవకాశాల కోసం, ఉద్యోగ ఉపాధి హక్కుల కోసం, డ్రగ్స్, మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ఏఐవైఎఫ్ సమర శంఖారావం పూరించడానికి జూలై 19న చిలుకూరు మండల కేంద్రంలో దొడ్డ నరసయ్య భవనం వేదిక అవుతుందన్నారు. మహాసభలకు అధిక సంఖ్యలో యువజనులు కదిలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ గౌరవ అధ్యక్షులు కుక్కడపు శౌరి, కమిటి సభ్యులు రెడ్డి మల్ల శ్రీను, బూర సాయి దిలీప్, తందారిపల్లి నగేష్ పాల్గొన్నారు.

# దేశ సమగ్రత- సమైక్యతకు యువత అంకితం కావాలి : ఎఐవైఎఫ్



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** దేశ సమగ్రత సమైక్యతకు యువత అంకితం కావాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న యువజన విద్యార్థి వ్యతిరేక విధానాలపై పోరాటాలకు యువత సన్నద్ధం కావాలని ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు చిలకరాజు శ్రీను యువతను కోరారు. బుధవారం మండల పరిధిలోని గానుగబండ గ్రామంలో ఎఐవైఎఫ్ మండల మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. నరేంద్రమోడి నాయకత్వంలోని బిజేపి పార్టీ తాము అధికారంలోకి వస్తే ప్రతి సంవత్సరం రెండుకోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీని ఇచ్చి, కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తాము ఇచ్చిన హామీలను అటకెక్కించాయని, ఉన్న ఉద్యోగాలకి కూడా ఎసరు పెట్టి నేటి యువతను రోడ్డున పడేస్తున్నాయని అన్నారు. ఉపాధి ఉద్యోగ అవకాశాలు లేక నేటి యువత చెడు వ్యసనాలకు బానిసలవుతున్నారని, నేటి యువతకు ఈ ప్రభుత్వాలపై ఉద్యమాలు చేయడానికి ప్రశ్నించడానికి అవకాశం కలిగిందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ హక్కుల కోసం పోరాడాలని అన్నారు. మండల నాయకులు పంగ సైదులు, మోడె లింగరాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మండల కమిటిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ నాయకులు ఈద ప్రసాద్, ఖాసీంసాబ్, ఈద వీరబాబు, మధు, చింతకాయల కొండలు, ఆకుల శ్రీను, యోగి పాల్గొన్నారు.

# అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్.. రూ.52 వేల నగదు స్వాధీనం

## 47 చోరీ కేసుల్లో నిందితుడిని పట్టుకున్న టూ టౌన్ పోలీసులు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** పట్టణంలో జరిగిన చోరీ కేసును టూ టౌన్ పోలీసులు విజయవంతంగా ఛేదించి,47 చోరీ కేసుల్లో నిందితుడైన అంతరాష్ట్ర దొంగను అరెస్టు చేసి అతని వద్ద నుంచి రూ.52 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు టూ టౌన్ సిఐ రాఘవరావు తెలిపారు. మంగళవారం టూ టౌన్ పోలీస్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 3వ తేదీ రాత్రి నల్లగొండ పట్టణంలోని రామగిరి ప్రాంతంలో ఉన్న హనుమాన్ స్పోర్ట్స్ షాప్ షట్టర్ తాళాలు పగులగొట్టి, కౌంటర్‌లో భద్రపరిచిన రూ.3.40 లక్షల నగదును గుర్తుతెలియని వ్యక్తి దొంగిలించాడని తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు చెప్పారు. సాంకేతిక ఆధారాలు,సీసీటీవీ ఫుటేజీ,ఇతర ఆధారాల ఆధారంగా పోలీసులు నిందితుడిని గుర్తించి అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితుడి వద్ద నుంచి రూ.52 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. అరెస్టైన నిందితుడు కందుల సత్యనారాయణ అలియాస్ సత్తిబాబు ప్రస్తుతం హైదరాబాద్‌లోని కర్మన్‌ఘాట్‌లో నివాసం ఉంటున్నాడని, స్వగ్రామం తూర్పుగోదావరి జిల్లా మండపేట మండలంలోని ఏడిద గ్రామమని తెలిపారు. అతనిపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో కలిపి సుమా రు 47 చోరీ కేసులు నమోదై ఉన్నాయని పేర్కొన్నారు. ఈ కేసును నల్లగొండ డిఎస్పి కె.శివరాం రెడ్డి పర్యవేక్షణలో టూ టౌన్ ఎస్ఐ డి.సైదబాబు, పోలీసు సిబ్బంది లావూరి బాలకోటి, మహమ్మద్ షకీల్ సమర్థవంతంగా దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్టు చేశారు. కేసును త్వరితగతిన ఛేదించిన పోలీసు బృందాన్ని జిల్లా ఎస్పి అభినందించినట్లు సీఐ రాఘవరావు తెలిపారు.

# ఎసిబికి చిక్కిన అవినీతి జలగ

## సూర్యాపేట జిల్లా భూగర్భ జల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మేఘావత్ బాలు, డేటా ఆపరేటర్ వెంకటేశ్వర్లు అరెస్టు



**ప్రజాపక్షం/సూర్యాపేట :** ఎసిబి అధికారులకు మరో అవినీతి జలగ బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో చిక్కింది. ఓ బోర్‌వెల్ యజమాని నుంచి ఎన్ఓసి కోసం రూ.20వేల లంచం డిమాండ్ చేసి తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఎసిబి నల్లగొండ రేంజ్ డిఎస్పి జగదీష్ చంద్ర దీనికి సంబంధించిన వివరాలను మీడియాకు వివరించారు. సూర్యాపేట జిల్లా భూగర్భ జల శాఖలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న మేఘావత్ బాలు ఓ బోర్‌వెల్ యజమాని బోరుబావుల తవ్వకం రిగ్‌కు అధికారికంగా అనుమతి ఇవ్వాలని ఆయనను ఆశ్రయించగా రూ.20వేలు లంచం ఇవ్వాలని అడిగినట్లు తెలిపారు. బాధితుడు ఎసిబిని ఆశ్రయించగా నల్లగొండ రేంజ్ డిఎస్పి జగదీష్ చంద్ర ఆధ్వర్యంలో వల పన్నారు. కార్యాలయంలో అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న డేటా ఎంట్రీ ఆపరేటర్ (ఏవో2) కోసనోజు వెంకటేశ్వర్ల ద్వారా ఆ సొమ్మును తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతన్ని అదుపులోకి తీసుకొని విచారించగా తన పై అధికారి మేఘావత్ బాలు డబ్బులు తీసుకోమని చెప్పడంతో బోర్‌వెల్ యజమాని నుండి ఆ డబ్బులు తీసుకున్నట్లు తెలిపారు. దీంతో బాలు, వెంకటేశ్వర్లను అదుపులోకి తీసుకొని హైదరాబాద్‌లోని నాంపల్లి ఏసిబి ప్రత్యేక కోర్టుకు హాజరుపరుస్తున్నట్లు వివరించారు. పనుల నిమిత్తం ప్రభుత్వ అధికారులు ఏవరైనా లంచం డిమాండ్ చేస్తే భయపడకుండా వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1064, వాట్సప్ నంబర్ 9440446106 ను సంప్రదించాలని కోరారు.

# అంజయ్య సేవలు చిరస్మరణీయం



**ప్రజాపక్షం/నాంపల్లి :** అమరజీవి కోరే అంజయ్య సిపిఐకి జీవితాంతం అంకితభావంతో సేవలందించి చేసిన పోరాటాలుసేవలు కార్యకర్తలకు ఆదర్శప్రాయమని సిపిఐ జిల్లా కార్యదర్శి,ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. మండలంలోని పెద్దాపురం గ్రామ సిపిఐ శాఖ మాజీ కార్యదర్శి కోరే అంజయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా,బుధవారం ఆయన చిత్రపటానికి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోరే అంజయ్య పార్టీ పిలుపునిచ్చిన ప్రతి ఉద్యమంలో ముందుండి పాల్గొన్న నిబద్ధత కలిగిన నాయకుడని కొనియాడారు.నక్కలగండి నుంచి హైదరాబాద్ వరకు సాగునీటి సాధన కోసం చేపట్టిన పాదయాత్రలోనూ,మునుగోడు నియోజకవర్గ సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహించిన పాదయాత్రలోనూ చివరి వరకు చురుకుగా పాల్గొని ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడిన వ్యక్తి అంజయ్య అని గుర్తు చేశారు. ఆయన కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.అంజయ్యచారి,మండల కార్యదర్శి సుదనబోయిన రమేష్,ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు బి.జగన్,మండల పార్టీ కార్యవర్గ సభ్యులు ఊరుపాక వెంకటయ్య,పల్లె సైదులు,నేరెళ్ల సైదులు,రేవెల్లి సర్పంచ్ బట్టు శ్రీను,పెద్దాపురం సర్పంచ్ పల్లె వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు.

# చెరువు గండిని వెంటనే పూడ్చాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మండలంలోని లక్ష్మీ పురంరుద్రారం, ముల్కల కాల్వ, రాయినిపాలెం, జాలుబాయి తండా గ్రామాల మధ్య ఉన్న చెరువుకు గండి పడటంతో నీరు భారీగా వృథాగా పోతున్న విషయాన్ని తెలుసుకున్న మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి బుధవారం సంఘటన స్థలాన్ని సందర్శించారు. ఇరిగేషన్ అధికారులతో కలిసి చెరువును పరిశీలించిన ఎమ్మెల్యే, గండిని అత్యవసర ప్రాతిపదికన పూడ్చి నీటి వృథాను అరికట్టాలని అధికారులను ఆదేశించారు. రైతులకు సాగునీటి కొరత తలెత్తకుండా యుద్ధ ప్రాతిపదికన మరమ్మత్తు పనులు పూర్తి చేయాలని సూచించారు. ప్రస్తుతం చెరువులో నిల్వ ఉన్న నీరు వృథాగా వెళ్లిపోవడం వల్ల భవిష్యత్తులో సాగు నీటి సమస్య ఏర్పడే అవకాశముందని, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, సాగునీటి సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** డ్రైవర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి, అద్దె వాహనాల నెలవారీ అద్దెను రూ.55వేలకు పెంచాలని తెలంగాణ అద్దె వాహనాల యూనియన్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ పవన్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట అద్దె వాహనాల యజమానులు, డ్రైవర్లతో కలిసి నిరసన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2017లో అప్పటి ఇంధన ధరలు, వాహనాల నిర్వహణ వ్యయాలను పరిగణలోనికి తీసుకొని ప్రభుత్వం నెలవారీ అద్దెను రూ.33వేలకు నిర్ణయించిందని తెలిపారు. ప్రస్తుతం ఇంధన ధరలు, విడిభాగాల ధరలు, నిర్వహణ ఖర్చులు గణనీయంగా పెరిగిన నేపథ్యంలో అద్దెను రూ.55వేలకు పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో 15 నుంచి 18 నెలలుగా అద్దె వాహనాల బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో వాహన యజమానులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రతి కలెక్టరేట్‌లో డ్రైవర్ల కోసం ప్రత్యేక విశ్రాంతి గది, వాహనాలకు పార్కింగ్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకన్న, తన్నీరు మహేష్, రహీం, సాయికుమార్, హరీష్, హుస్సేన్ నాయక్, సందీప్, జీవన్, కృష్ణ, సుమన్ నాయక్, సంతోష్, షరీఫ్ పాల్గొన్నారు.



# బుద్ధవనం అభివృద్ధిపై కేంద్ర పురావస్తు శాఖ అధికారుల సమీక్ష



**ప్రజాపక్షం/నందికొండ:** అంతర్జాతీయ ప్రమాణాలతో తెలంగాణ టూరిజం అభివృద్ధి చేసిన నాగార్జునసాగర్‌లోని బుద్ధవనాన్ని కేంద్ర పురావస్తు శాఖ హైదరాబాద్ సర్కిల్ అధికారుల బృందం బుధవారం సందర్శించి క్షేత్రస్థాయిలో పరిశీలించింది.ఈసందర్భంగా బృందం బుద్ధవనంలోని బుద్ధ చరితవనం, ధ్యానవనం, జాతకవనం, మహాస్తూపాన్ని సందర్శించి అక్కడి ఏర్పాట్లు, అభివృద్ధి పనులను పరిశీలించింది.పర్యాటకులను మరింతగా ఆకర్షించేలా బుద్ధవనంలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, సందర్శకులకు మరింత మెరుగైన అనుభూతిని కల్పించే అంశాలపై బుద్ధవనం అధికారులతో విస్తృతంగా చర్చించింది. అనంతరం నిర్మాణంలో ఉన్న డిజిటల్ మ్యూజియం పనుల పురోగతిపై ఆరా తీసిన అధికారులు, బుద్ధవనాన్ని ఆధునిక సాంకేతికతతో అనుసంధానిస్తూ భవిష్యత్ తరాలకు బౌద్ధ వారసత్వాన్ని మరింత సమర్థవంతంగా అందించేలా తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు.ఈ పరిశీలనలో కేంద్ర పురావస్తు శాఖ హైదరాబాద్ సర్కిల్ సూపరింటెండింగ్ ఆర్కియాలజిస్ట్ నిఖిల్ దాస్,డిప్యూటీ సూపరింటెండింగ్ ఆర్కియాలజిస్ట్ కృష్ణ చైతన్య, కన్జర్వేషన్ అసిస్టెంట్లు వెంకటయ్య,హారిక, భార్గవ నాయుడు,బుద్ధవనం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్ రెడ్డి,ఆర్ట్స్ అండ్ ప్రమోషన్స్ మేనేజర్ శ్యాంసుందర్ రావు,ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శాసన, ఎస్టేట్ ఆఫీసర్ రవిచంద్ర,అసిస్టెంట్ ఇంజనీర్ నజీష్ తదితరులు పాల్గొన్నారు.

# ‘పోలీస్ అక్క’తో సమస్యలు చెప్పకోవచ్చు

**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్ :** మహిళా బాధితులు తమ సమస్యలను పోలీస్ అక్కతో నిర్భయంగా చెప్పుకోవచ్చని జిల్లా అదనపు ఎస్పి రవీందర్ రెడ్డి తెలిపారు. పోలీసు ప్రజా భరోసా కార్యక్రమంలో భాగంగా బుధవారం రూరల్ పోలీసులు, జిల్లా షీ టీం పోలీసుల ఆధ్వర్యంలో మండలంలోని బాలెంల గ్రామ సమీపంలోని తెలంగాణ గురుకుల బాలికల విద్యాలయం నందు పోలీస్ అక్క అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డిఎస్పి ప్రసన్న కుమార్ మాట్లాడుతూ మహిళల రక్షణలో ఇప్పటి వరకు షీ టీమ్స్, భరోసా సిబ్బంది పనిచేస్తున్నారని ఇక నుండి పోలీస్ అక్క సేవలు అందిస్తుందని తెలిపారు. షీ టీం ఎస్ఐ నీలిమ మాట్లాడుతూ విద్యార్థినిలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని తెలిపారు. తమ భద్రత విషయంలో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలన్నారు. వేధింపులు, అసభ్య ప్రవర్తన, సైబర్ వేధింపులు ఎదురైతే వెంటనే పోలీసులకు లేదా షీ టీంకు ఫిర్యాదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అనిల్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

# పలువురు ఎస్‌ఐల బదిలీలు

**ప్రజాపక్షం/నల్లగొండ :** జిల్లాలో పలువురు సబ్ ఇన్‌స్పెక్టర్ల (సివిల్) బదిలీలు,పోస్టింగ్‌లు చేపడుతూ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ ఉత్తర్వులు జారీ చేశారు.యాదాద్రి జోన్5 డీఐజీ కార్యాలయం ఆదేశాల మేరకు ప్రజా ప్రయోజనాలు,పరిపాలనా అవసరాల దృష్ట్యా ఈ బదిలీలు తక్షణమే అమల్లోకి వచ్చేలా నిర్ణయించారు.మునుగోడు పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో ఈ.రవిను తిప్పర్తి పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా బదిలీ చేశారు. తిప్పర్తి ఎస్‌హెచ్‌వో వి.శంకర్ వీఆర్ (రిజర్వ్),నల్లగొండ కు కేటాయించారు. యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో ఎం. శోభన్ బాబును మునుగోడు పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా నియమించారు.డీసీఆర్‌బీలో విధులు నిర్వహిస్తున్న పి.సురేష్ యాదవ్ మాడ్గులపల్లి పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా బదిలీ చేశారు.మాడ్గులపల్లి ఎస్‌హెచ్‌వో ఎస్.కృష్ణయ్యను వీఆర్ కు బదిలీ చేశారు. బదిలీ అయిన ఎస్‌ఐలు వెంటనే రిలీవ్ అయి నూతన విధుల్లో చేరాలని జిల్లా పోలీసు సూపరింటెండెంట్ ఆదేశించారు.అధికారులు రిలీవ్ అయిన, విధుల్లో చేరిన తేదీల వివరాలను జిల్లా పోలీసు కార్యాలయానికి నివేదించాలని సంబంధిత అధికారులకు సూచించారు.



## పకడ్బందీగా భూ సర్వే

● ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

**ప్రజాపక్షం/గణపురం :** గణపురం మండలంలోని ధర్మారావుపేట గ్రామంలో భూ సర్వేకు సంబంధించి నిర్వహించిన గ్రామసభలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్‌తో కలిసి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ ధర్మారావుపేట అతిపెద్ద రెవెన్యూ గ్రామమని, దీని పరిధిలో ఆరు గ్రామాలు ఉన్నాయని తెలిపారు. ముఖ్యంగా సర్వే నెంబర్లు 318, 106, 510 విస్తీర్ణ పరంగా పెద్దవిగా ఉన్నందున అధికారులు అత్యంత జాగ్రత్తగా రెవెన్యూ, భూ సరిహద్దులను నిర్ధారించి సర్వే చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ, అసైన్డ్ భూములతో పాటు రైతుల భూములను సమగ్రంగా సర్వే చేసి, అర్హులైన రైతులకు పట్టాదారు పాస్‌బుక్కులు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. భూ రికార్డులు సక్రమంగా ఉంటే భూముల క్రయవిక్రయాలు, రైతుబంధు, రైతు బీమా వంటి పథకాల ప్రయోజనాలతో పాటు, భవిష్యత్తులో సింగరేణి సంస్థ భూములను సేకరించే సందర్భంలో రైతులు నష్టపరిహారం సులభంగా పొందేందుకు వీలవుతుందని ఎంఎల్‌ఏ పేర్కొన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా పారదర్శకంగా, పకడ్బందీగా భూ సర్వే పూర్తి చేయాలని అధికారులకు ఎంఎల్‌ఏ గండ్ర సత్యనారాయణ రావు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, జిల్లా అడిషనల్ కలెక్టర్, మండల తహసీల్దారు, స్థానిక సర్పంచ్, రెవెన్యూ గ్రామ ప్రజలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి




**ప్రజాపక్షం/చెన్నారావుపేట :** గ్రామంలో ఉన్న సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తున్నామని గ్రామ కార్యదర్శి సట్ల సుప్రజ అన్నారు. బుధవారం ప్రజా పక్షం దినపత్రికలో ప్రచురించిన నల్ల తీశారు.. పూడ్చడం మరిచారు అనే కథనానికి స్పందించి అదనపు కనెక్షన్లను మూయించారు. గ్రామంలో ఉన్న చిన్న చిన్న సమస్యలను పరిష్కరించడానికి ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు.

## 'సర్'పై అవగాహన

● కలెక్టర్ డాక్టర్ సత్యశారద



**ప్రజాపక్షం/వరంగల్:** ప్రత్యేక సమగ్ర ఓటరు సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద బుధవారం వరంగల్ నగరంలోని చింతల్, లెనిన్‌నగర్, రంగశాయిపేట ప్రాంతాల్లో పర్యటించి ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ఓటర్లతో మాట్లాడిన కలెక్టర్, ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ చురుకుగా పాల్గొని బూత్ లెవల్ అధికారులకు (బిఎల్‌ఓలు) పూర్తి సహకారం అందించాలని కోరారు. చింతల్‌లో మైనారిటి ఓటర్లు ఎక్కువగా ఉన్నందున వారి ఓటు భద్రంగా ఉంటుందని, ప్రతి ఒక్కరు వారి వారి ఓటరు వివరాలను సకాలంలో అందజేసి, ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తి చేసి బిఎల్‌ఓలకు అందించాలని సూచించారు. ఓటరు జాబితా స్వచ్ఛంగా, పారదర్శకంగా రూపొందేందుకు ప్రజల సహకారం ఎంతో అవసరమని, అర్హులైన ప్రతి ఒక్కరు తమ వివరాలను నమోదు చేసుకుని ఓటు హక్కును వినియోగించుకునేలా బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఈ పరిశీలనలో ఖిలా వరంగల్ తహసిల్దార్ ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

## హోటళ్లపై అధికారుల దాడులు

**ప్రజాపక్షం/జనగామ :** జనగామ మున్సిపల్ అధికారులు కమీషనర్ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఫుడ్ సేఫ్టీ అధికారులు దాడులు నిర్వహించారు. హోటళ్లు, బార్లు, స్వీట్ హౌస్‌లో అకస్మిక తనిఖీలు నిర్వహించి జరిమాన విధించారు. అమృత్ బార్‌కు రూ.20వేలు, భువన బార్‌కు రూ.10వేలు, వినాయక బార్‌కు రూ.30వేలు, బాలాజీ బార్‌కు రూ.10వేలు, బాలాజీ స్వీట్ హౌస్‌కు రూ.5వేలు, ఆగర్వాల్ స్వీట్ హౌస్‌కు రూ.10వేల జరిమాన విధించారు. బార్లు, స్వీట్ హౌస్, హోటళ్లలో శుభ్రత లేకపోవడం, తినుబండారాల్లో నాణ్యత పాటించకపోవడంపై వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వయించడం జరిగిందన్నారు. నిబంధనల మేరకే ఈ దాడులు జరుగుతున్నాయన్నారు. ఈ దాడులు నిత్యం కొనసాగుతాయని తెలిపారు. పట్టణంలోని చిన్నగేటు రోడ్డులో గల రెండు సెల్లార్లను మూసివేశారు. సెల్లార్లలో షాపులు నడుపుతుండగా రెండింటిని మూసివేశారు.

## విమానాశ్రయం, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీతో దశాబ్దాల కల సాకారం

● వరంగల్ ఎంపి కావ్య, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని



**ప్రజాపక్షం/హనుమకొండ :** వరంగల్ సమగ్ర అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న చారిత్రాత్మక నిర్ణయాలకు హర్షం వ్యక్తం చేస్తూ హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి ఘనంగా క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం బాణాసంచా పేల్చి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు.ఈ కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య, హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్ తదితరులు హాజరయ్యారు. ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి కొత్త ఊపందుకుందని ఎమ్మెల్యే అన్నారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు 2028 జూన్ నాటికి మామునూరు విమానాశ్రయాన్ని అందుబాటులోకి తీసుకువస్తామని ప్రకటించిన విషయాన్ని ఎమ్మెల్యే గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు పాల్గొన్నారు.

# రూ.2.80 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం

● బాలసముద్రం, అడ్వకేట్స్ కాలనీ, ప్రశాంత్‌నగర్‌లో రోడ్లు, డ్రైనేజీల అభివృద్ధికి ఎమ్మెల్యే నాయిని శంకుస్థాపన



**ప్రజాపక్షం/హనుమకొండ :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు నిరంతరం కొనసాగుతున్నాయని, ప్రజలకు ఇచ్చిన హామీలను నిర్ణీత గడువులో పూర్తి చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. బుధవారం 30వ డివిజన్ పరిధిలోని బాలసముద్రం, అడ్వకేట్స్ కాలనీతో పాటు 61వ డివిజన్ పరిధిలోని ప్రశాంత్‌నగర్ రోడ్ నంబర్–4లో సుమారు రూ.2 కోట్ల 80 లక్షల వ్యయంతో అంతర్గత సిసిసీ రోడ్లు, మురికి కాలువలు, డ్రైనేజీలు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ ప్రతి అభివృద్ధి పనికి నిర్దిష్ట గడువు నిర్ణయించి వాటిని పూర్తి చేసే విధంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. వర్షాకాలానికి ముందే అత్యధిక పనులను పూర్తి చేయడానికి అధికారులు, కాంట్రాక్టర్లతో సమన్వయం చేస్తున్నామని, మిగిలిన పనులను కూడా త్వరలో పూర్తి చేస్తామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్లలో వరంగల్ జిల్లాకు గత పదేళ్లలో ఎన్నడూ రాని స్థాయిలో నిధులు, అభివృద్ధి కార్యక్రమాలు వచ్చాయని ఆయన పేర్కొన్నారు. మామునూరు విమానాశ్రయం, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, మాడవీధుల అభివృద్ధి, కాళోజీ కళాక్షేత్రం, ఖాజీపేట బస్‌స్టాండ్ అభివృద్ధి, ఆసుపత్రుల విస్తరణ వంటి అనేక కీలక ప్రాజెక్టులు కాంగ్రెస్ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. మామునూరు విమానాశ్రయం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చొరవ చారిత్రాత్మకమని ఎమ్మెల్యే అన్నారు. ఇటీవల నిర్వహించిన భూవేలం విషయంలో భారీ అవినీతి జరిగిందంటూ ప్రచారం చేసిన నాయకులు, వేలం పూర్తయ్యాక ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నిరాధార ఆరోపణలతో అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నాలు మానుకుని, వరంగల్ అభివృద్ధికి సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మాజీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## డిజిటలైజేషన్ పురోగతిపై ప్రత్యేక దృష్టి

● ఎన్నికల నమోదు అధికారి, ఆర్‌డిఓ కృష్ణవేణి



**ప్రజాపక్షం/ములుగు :** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ 2026 కార్యక్రమంలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాల సేకరణ, డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయడంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లు కీలకపాత్ర పోషించాలని జిల్లా ఎన్నికల నమోదు అధికారి, ఆర్‌డిఓ కృష్ణవేణి అన్నారు. బుధవారం ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ 2026 కార్యక్రమంలో భాగంగా గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా ఎన్నికల నమోదు అధికారి, ఆర్‌డిఓ కృష్ణవేణి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల నమోదు అధికారి మాట్లాడుతూ జిల్లాలో ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పూర్తి చేసేందుకు ప్రజలను చైతన్యపరుస్తూ, వార్డుల వారీగా బిఎల్‌ఏలు, బిఎల్‌ఓలు పరస్పర సమన్వయంతో పనిచేసి ఎన్యుమరేషన్ ఫారాల సేకరణ, డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఏఈఆర్‌ఓ, తహసీల్దారు విజయభాకర్, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రీ సర్వేతో భూ సమస్యలకు పరిష్కారం

● భూపాలపల్లి ఎమ్మెల్యే, కలెక్టర్



**ప్రజాపక్షం/గణపురం :** భూముల రీ సర్వేతో అన్ని రకాల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. గణపురం మండలంలోని చెల్పూర్ రైతు వేదిక, ధర్మరావుపేటలో బుధవారం నిర్వహించిన రీ సర్వే గ్రామసభల్లో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఏ మాట్లాడుతూ రీ సర్వే ద్వారా భూముల హద్దులను ఖరారు చేసి, ఆక్రమణలను గుర్తించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఎన్నేళ్లుగా సాగు చేస్తున్న అర్హులైన రైతులకు పట్టాలు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. రైతులందరూ సర్వేలో పాల్గొని సహకరించాలని కోరారు. సర్వే అనంతరం పాసుబుక్కులు జారీ చేసి రైతు భరోసా, రైతు బీమా, పంట రుణాలు వంటి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సర్వే షెడ్యూల్‌పై గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ జిల్లాలో రీ సర్వే కోసం 70గ్రామాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. లైసెన్స్ పొందిన సర్వేయర్లకు శిక్షణ ఇచ్చి సర్వే నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వ, గ్రామకంఠ, పట్టా భూములకు హద్దులు నిర్ణయించి, దీర్ఘకాలంగా ఉన్న భూ వివాదాలను పరిష్కరించడమే లక్ష్యమని చెప్పారు. సర్వే విజయవంతానికి ప్రజల భాగస్వామ్యం అవసరమని, గ్రామాల్లో ఉన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి కుసుమకుమారి, ఆర్‌డిఓ హరికృష్ణ, తహసీల్దారు రాజేశ్వరరావు, ఎంపిడిఓ భాస్కర్, సర్పంచ్‌లు కావటి రజిత, హైమావతి, తదితరులు పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి



● కార్మిక సంఘాల నాయకులతో ఎమ్మెల్యే నాయిని ముఖాముఖి

**ప్రజాపక్షం/హనుమకొండ :** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ)లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హామీ ఇచ్చారు. బుధవారం హనుమకొండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఐఎన్టీయూసీ, ఏఐటీయూసీ, టీఎంఆర్పీఎస్, టిబీఎంయూకేఎస్, ఓఎస్ జేఏసీతో పాటు వివిధ మున్సిపల్ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన "ముఖాముఖి" కార్యక్రమంలో కార్మిక సంఘాల ప్రతినిధులు ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యలను, డిమాండ్లను వినిపించారు. ఈ సందర్భంగా ఐఎన్టీయూసీ గ్రేటర్ వరంగల్ అధ్యక్షులు పాశం రవి యాదవ్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు వేల్పుల సారంగపాణి యాదవ్, ప్రధాన కార్యదర్శి ఏల్పుల ధర్మరాజు, టీఎంఆర్పీఎస్ అధ్యక్షులు బొట్ల బిక్షపతి మాదిగ తదితరులు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. కార్మిక సంఘాల వినతులను శ్రద్ధగా ఆలకించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, కార్మికులు, యూనియన్ నాయకులు తన దృష్టికి తీసుకొచ్చిన ప్రతి సమస్యను సానుకూలంగా పరిశీలించి, పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. స్థానికంగా పరిష్కరించగల అంశాలపై వెంటనే చర్యలు చేపడతామని, రెండు రోజులలోనే గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, సీహెచ్‌ఎంఓ అధికారులు, సంబంధిత శాఖల ప్రతినిధులు, కార్మిక సంఘాల నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి సమస్యలను సమగ్రంగా చర్చించి పరిష్కార మార్గాలను ఖరారు చేస్తామని తెలిపారు. కార్మికుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారి న్యాయమైన సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీడబ్ల్యూఎంసీ అధ్యక్షులు బొట్ల రమేష్, ఐఎన్టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి దామెర రాజు, ఏఐటీయూసీ ఉపాధ్యక్షులు, కార్యదర్శి బొక్క ఏలియా, ఐఎన్టీయూసీ హనుమకొండ జిల్లా కార్యదర్శి చీకటి సంపత్, డ్రైవర్ల సంఘం అధ్యక్షులు మేకల దేవేందర్ యాదవ్, నాగుల శ్రీకాంత్, ఐఎన్టీయూసీ నాయకులు ఏక్. సుధాకర్, మేకల సమ్మయ్య యాదవ్, కందిక కొమరయ్య, సాంబ రాజు శేఖర్, అమ్మ వీరయ్య, శనిగరపు లక్ష్మణ్‌తో పాటు వివిధ కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



## ఎస్పీని కలిసిన రైస్ మిల్లర్ల సంఘం

**ప్రజాపక్షం/ములుగు :** జిల్లాలో రైస్ మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ రైస్ మిల్లర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాదం ప్రవీణ్ ఆధ్వర్యంలో ప్రతినిధులు బుధవారం జిల్లా ఎస్పి కేకాన్ సుధీర్ రామ్నాథ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. 2025–26 రబీ సీజన్‌లో జిల్లాలని మిల్లుల సామర్థ్యానికి మించి ధాన్యాన్ని ఓపెన్ స్టోరేజీల్లో నిల్వ చేశారని, ప్రస్తుతం ప్రభుత్వం బియ్యం సేకరణ చేపట్టకపోవడం, ఎఫ్‌సిఐ గోదాముల్లో నిల్వ సౌకర్యం లేకపోవడంతో మిల్లర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. ధాన్యం ఎక్కువకాలం నిల్వ ఉండడంతో నాణ్యత తగ్గి, డిస్‌కలరేషన్ బరువు తగ్గుదల వంటి సమస్యల వలన భారీ నష్టాలు వస్తున్నాయని వివరించారు. ప్రభుత్వ విధానాల కారణంగా భవిష్యత్తులో మిల్లర్లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నా, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయకుండా చూడాలని కోరారు. వినతిపై ఎస్పి సానుకూలంగా స్పందించి, సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు బాదం ప్రవీణ్ తెలిపారు. కార్యక్రమంలో సంఘం కోశాధికారి ఎలగందుల మోహన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కొమురవెల్లి హరినాథ్ పాల్గొన్నారు.

# విద్యార్థి దశ నుండే క్రమశిక్షణతో మెలగాలి

● కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

● స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఏకరూప దుస్తుల పంపిణీ



**ప్రజాపక్షం/జనగామ :** విద్యార్థి దశ నుండే క్రమశిక్షణతో మెలగాలని స్టేషన్‌ఘనపూర్ కేజీబీవీ విద్యార్థినీలకు జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సూచించారు. భోజనం, చదువు, క్రీడలు ప్రతి విద్యార్థి దిన చర్యలు ఉండాలన్నారు. బుధవారం జనగామ జిల్లా స్టేషన్‌ఘనపూర్ కేజీబీవీలో విద్యార్థినీలకు ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. ముందుగా వంట గదిలోకి వెళ్లి ఆర్‌ఓఆర్ ప్లాంటు, వంట సరుకులు పరిశీలించారు. విద్యార్థినీలకు సిద్ధం చేసిన భోజనాన్ని పరిశీలించారు. అరటి పండ్ల నాణ్యత బాగాలేదని, శుభ్రమైన పల్లను మాత్రమే విద్యార్థినీలకు ఇవ్వాలన్నారు. గుడ్లు ఎప్పుడు వచ్చాయన అడిగి తెలుసుకున్నారు. నాణ్యతను నీళ్లలో వేసి స్వయంగా పరిక్షించారు. ఆర్‌ఓ ప్లాంటు సరుకుల గదిని తనిఖీ చేసి నిర్వాహణ సరిగా లేదని, బియ్యం బస్తాలు, సరకులు యాసిడ్ లాంటి వస్తువులను ఏ వధంగా ఎక్కడ పెట్టాలో సూచించారు. విద్యార్థినీలు ఎంత మంది ఉన్నారు. ఎంత మందికి చికెన్ తెప్పించారు అని ఆరా తీశారు. పాఠశాల చుట్టు పరిసరాల పారిశుద్య నిర్వాహణ బాగుండాలని, ఎలాంటి చెత్తా చెదారం లేకుండా ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ కమీషనర్‌ను ఆదేశించారు. కంప్యూటర్ గదిని పరిశీలించి, విద్యార్థినీలకు వాటి ద్వారా ఏమేమి నేర్పుతున్నారని ఆపరేటర్‌ను అడిగి తెలుసుకున్నారు. కంప్యూటర్ విద్యపై అవగాహన ఉండాలన్నారు. అనంతరం 10వ తరగతిలో అన్ అకాడమీ తరగతులను ప్రారంభించి ఫాస్ట్ మ్యాథ్య జిఐటి ఐటి, వైట్ పుస్తకాల ప్రాధాన్యతను వివరించారు. ప్రతి పోటీ పరీక్షలో మ్యాథ్స్ తప్పనిసరిగా ఉంటుందని, ఫాస్ట్ మ్యాథ్స్ పుస్తకంలోని అంశాలను నేర్చుకుంటే గణితంలో ఉండే లెక్కల సాధన సులభతరం అవుతుందన్నారు. సమస్యలు ఏమైనా ఉంటే ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలని ఎస్‌ఓను ఆదేశించారు.

## సింగరేణి భరోసా యాత్ర ఎవరికోసం?




● మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** రాజకీయ ప్రయోజనాల కోసం బిజెపి సింగరేణి భరోసా యాత్ర చేపట్టిందని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణ రెడ్డి ఆరోపించారు. భూపాలపల్లి జిల్లా బిఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్గొన్న భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి, టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మంగళవారం గేట్ మీటింగ్‌లో మాట్లాడిన తీరు హాస్యస్పదంగా ఉందన్నారు. గత ఐదేళ్లు పర్యాటక మంత్రి, ఇప్పుడు కోల్ మినిస్టర్‌గా ఉండి తెలంగాణకు ఒరుగబెట్టింది ఏమిటో తెలపాలన్నారు. గతంలో బిఆర్‌ఎస్ పార్టీ, టీబీజీకేఎస్ అధికారంలో ఉన్నప్పుడు సింగరేణి విషయంలో కేంద్ర ప్రభుత్వం విధానాలు చూస్తే సింగరేణి అంధకారంలోకి పోతుందని తమ పార్టీ ఎమ్మెల్యేలం, మంత్రులంతా కలిసి బొగ్గు బ్లాక్‌లన్ని సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేస్తూ కలిసి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా అనేక ధర్నాలు రాస్తారోకోలు చేశామన్నారు. సింగరేణికి తాడిచర్ల 2 గని కేటాయించామని గొప్పలు చెప్పుకుంటున్నావు. అది గతంలోనే సింగరేణికి కేటాయించిన సంగతి తెలుసుకోవాలన్నారు. ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావం తర్వాత సీఎం పదవి చేపట్టిన కేసీఆర్ సింగరేణి సంస్థలు కాపాడుకోవాలని లక్ష్యంతో కార్మికులకు 32శాతం లాభాల వాటను ఇచ్చాడనీ, బీఆర్‌ఎస్ హయాంలో రామప్ప కాలనీలో కార్మికుల కుటుంబాలు నివసించడానికి 2వేల డబుల్ బెడ్ రూములు, నిర్మించామన్నారు. కేంద్ర మంత్ర కిషన్ రెడ్డి నువ్వు కేటీకే8 ఇంక్లైన్ కు నిన్న పోయావు కదా...? రామప్ప కాలనీ నీకు కనబడలేదా...? కిషన్ రెడ్డి గత చరిత్రను తెలుసుకొని మాట్లాడాలి. నువ్వు చేసేది సింగరేణి భరోసా యాత్ర కాదని, కాంగ్రెస్‌కు బ్రతుకు తెరువును చూపిస్తున్న యాత్ర అని స్పష్టంగా కార్మికులకు అర్థమవుతుందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ యొక్క పంపులను ఆన్ చేసి రైతులకు నీళ్ళు ఇవ్వండి. మాకు రాజకీయాలు ముఖ్యం కాదు మాకు రైతుల ప్రయోజనాలు ముఖ్యం అని తెలిపారు. ఈ సమావేశంలో కౌన్సిలర్ గండ్ర హరీష్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు నూనె రాజు, నాయకులు మాడ హరీష్ రెడ్డి, మాదాసి తిరుపతమ్మ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# విభజన హామీలు అమలులో బిజెపి విఫలం



● కోర్టుకు హాజరైన ఎంపి, ఎమ్మెల్యే, సిపిఐ, సిపిఎం, న్యూడెమొక్రసీ నేతలు

**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** విభనజ హామీలు అమలు చేయడంలో బిజెపి సర్కార్ పూర్తిగా విఫలమైందని, అక్రమ కేసులు ఎత్తివేసి, బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాల్సిందే ఎంపి పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్, ట్రై కార్ చైర్మన్ బెల్లయ్య నాయక్, సిపిఐ జిల్లా కార్యదర్శి విజయ సారథి, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గుణ గంటి రాజన్న డిమాండ్ చేశారు. బుధవారం బయ్యారంలో ఉక్కు పరిశ్రమ స్థాపన ధ్యేయంగా చేసిన పోరాటంలో భాగంగా సిపిఐ కాంగ్రెస్ సిపిఎం సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నేతలు కోర్టుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి సర్కార్ విభజన హామీలు అమలు చేయడంలో విఫలమైందని 2014 ఉమ్మడి విభజన చట్టంలో పొందుపర్చినట్లుగా బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాల్సిందే అన్నారు. మోడీ ప్రభుత్వ పాలనలో నాణ్యత లేదని ఎప్పటికీ తెలంగాణను అవమానిస్తూనే పబ్బం గడుపుతున్నారని, రాష్ట్రంలో బిజెపి ఎంపీలు మంత్రులు ఉండి కూడా తెలంగాణ కోసం మాట్లాడకపోవడం, అభివృద్ధికి కేంద్రం నుంచి సహకారం లేకపోవడం విచారకరమన్నారు. మోడీ సర్కార్ రాష్ట్రంలో 8 మంది బిజెపి ఎంపీలు ఇద్దరు కేంద్ర మంత్రులు ఢిల్లీ మోడీ వద్దకు వెళ్లి విభజన చట్టం హామీ కోసం పట్టుబట్టాలని, అవసరమైతే వారి పదవులకు కూడా రాజీనామా చేయాలన్నారు. కోర్టుకు హాజరైన వారిలో భూక్య ఉమామురళీనాయక్, వెన్నం శ్రీకాంత్ రెడ్డి, బి అజయ్ సారధి రెడ్డి, నల్లు సుధాకర్ రెడ్డి, భరత్ చందర్ రెడ్డి, జిన్నారెడ్డి వెంకటేశ్వర్లు, మూల గుండ్ల వెంకన్న, దశ్రు నాయక్, నూనావత్ రాధ, పెరుగు కుమార్, సుచిత్ర, శంతన్ రామరాజు, మాధవి, స్వరూప, మనోజ్, వంశీ, శ్రీనివాస్, హరుణ్, కాంగ్రెస్, సిపిఐ, న్యూడెమోక్రసీ, సిపిఎం నేతలు కోర్టుకు హాజరైనవారిలో ఉన్నారు.

## మటన్ మార్కెట్ వినియోగంలోకి తేవాలి

● సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అజయ్‌సారథిరెడ్డి

**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** మటన్ మార్కెట్‌ను వినియోగంలోకి తీసుకురావాలని సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి ఆధ్వర్యంఓ మటన్ మార్కెట్ వ్యాపారస్తులు బుధవారం మున్సిపల్ కమిషనర్, చైర్ పర్సన్‌లను కలిశారు. ఈ సందర్భంగా సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారధి రెడ్డి కమిషనర్, చైర్ పర్సన్‌లకు మటన్ వ్యాపారుల మార్కెట్‌ను వెంటనే వినియోగంలోకి తీసుకురావడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఇటీవల కూరగాయల మార్కెట్ వచ్చిన నేపథ్యంలో మటన్ వ్యాపారులను కూడా సత్వరమే చర్యలు తీసుకొని వీరిని కూడా కొత్త మటన్ మార్కెట్లోకి తీసుకుపోవాలని ఆయన కోరారు. దీనిపై స్పందించిన కమిషనర్ వినోద్ కుమార్, చైర్ పర్సన్ గుగులోత్ జ్యోతి రమేష్ ఇటీవలనే కూరగాయల మార్కెట్ ను కూడా ప్రారంభించామని త్వరలో మటన్ చికెన్ మార్కెట్ ను కూడా ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. మటన్ వ్యాపారులు యూసుఫ్, యాకయ్య, వినయ్, సత్యమూర్తి, ముబీన్, అప్సర్, వేణు, బాబు, పెరుగు కుమార్, పడిదల కవిత, యూసుఫ్, సాయి, రహీం, పాషా తదితరులు పాల్గొన్నారు.



‘చెన్నై లవ్ స్టోరీ’ సినిమా తన కెరీర్ లో మరో గోప సినిమాగా నిలిచిపోతుందని హీరో కిరణ్ అబ్బవరం అన్నారు. కిరణ్ అబ్బవరం జన్మదిన వేడుకలు ఎఫ్ ఎన్ సి సి లో ఘనంగా జరిగాయి.

రీల్


హీరో కిరణ్ అబ్బవరం

## ‘చెన్నై లవ్ స్టోరీ’ నా కెరీర్‌లో గొప్ప సినిమా

చెన్నై లవ్ స్టోరీ’ సినిమా తన కెరీర్ లో మరో గోప సినిమాగా నిలిచిపోతుందని హీరో కిరణ్ అబ్బవరం అన్నారు. కిరణ్ సబ్బవరం జన్మదిన వేడుకలు ఎఫ్ ఎన్ సి సి లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భాంగా కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ ఈ సినిమా స్టోరీ చెప్పగానే ఖచ్చి తంగా చేయాలనీ అనుకున్నానని చెప్పారు. సాయిరాజేష్ ఇచ్చిన కథ, ఎస్ కె ఎన్ లాంటి నిర్మాత నాకు దొరకడం భావిస్తున్నానని అన్నారు. చెన్నైలో జరిగే ఒక ప్రేమ కథ అని తెలిపారు. ఇంతకు ముందు తన సినిమాలను ఆదరించినట్టే ఈ సినిమాను కూడా ప్రేక్షకులు ఆదరిస్తారని , ఆదరించాలని కోరుకుంటు న్నాను అని పేర్కొన్నారు. ఈ ప్రేమ కథ చాలా కొత్తగా ఉంటుందన్నారు. ఈ మధ్య కాలంలో వచ్చిన సినిమాలకు చాలా భిన్నంగా ఉంటుందని చెప్పారు. ప్రతీ క్యారెక్టర్‌కు జెస్టిఫికేషన్ ఉంటుందన్నారు. మణిశర్మ ఇచ్చిన మ్యూజిక్ ఇప్పటికే శ్రోతలను అలరిస్తుందని , ఈ సిని మాకు మ్యూజిక్ ఎంతో ప్లస్ అవుతుందని తెలి పారు. కిరణ్ అబ్బవరం ఈ కథకు కిరణ్ మాత్రమే సూట్ అవుతాడని అనుకున్నామని కథ రచయిత సాయి రాజేష్ చెప్పారు. నిర్మాత ఎస్ కె ఎన్ మాట్లాడుతూ 24న సినేమాను విడుదల చేస్తున్నామని అన్నారు. ప్రొ డక్షన్ పరంగా అన్ని విధాలుగా సం ఉన్నామని చెప్పారు. ఈ వేడుకల్లో హీరో యిన్ శ్రీ గౌరి ప్రియ , సహ నిర్మాత ధీరజ్ మొగిలి నేని , రవి పాల్గొ న్నారు.

## ‘వదలా’ మూవీని సక్సెస్ చేయండి

### ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో అనిల్ రావిపూడి

చరిత చిత్ర బ్యానర్ మీద కిషోర్ నాయుడు చిరుమామిళ్ల, తమ్మారెడ్డి భరద్వాజ్ సంయుక్తంగా నర్మించిన చిత్రం ‘వదలా’. జగ పతి బాబు, లయ, హృతిక శ్రీనివాస్ ప్రధాన పాత్రల్లో ఆకెళ్ల వి కృష్ణ ఈ సినిమాని తెరకె క్కించారు. ఈ మూవీని జూలై 17న రిలీజ్ చేయబోతోన్నారు. ఈ క్రమంలో ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమా నికి సెన్సేషనల్ డైరెక్టర్ హిట్ మెషిన్ అనిల్ రావిపూడి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ ఈవెంట్లో అనిల్ రావిపూడి మాట్లాడుతూ ‘తె లుగు ఇండస్ట్రీలోకి నిర్మాతగా వస్తున్న కిషోర్ కి థాంక్స్. ‘వదలా’ చిత్రంతో నిర్మాత కిషోర్ కి మంచి విజయం దక్కాలి. తమ్మారెడ్డి, జగపతి బాబు మీదున్న ప్రేమ, గౌరవంతో ఇక్కడకు వచ్చాను. ‘వ దలా’ ట్రైలర్ నాకు చాలా నచ్చింది. కాన్సెప్ట్, కథ చాలా కొత్తగా అనిపించింది. పాటలు నాకు చాలా నచ్చాయి. ట్రైలర్ను చూస్తే అందరూ సహజంగా నటించారని అర్థం అవు తోంది. చోటా గారు అందరికీ సన్నిహితులు. ఆయన విజువల్స్ అద్భు తంగా ఉన్నాయి. తమ్మారెడ్డి ఏదైనా సరే కుండ బద్దలు కొట్టినట్టు కాదు..



ముక్కలు చేసినట్టుగా మాట్లాడతారు. జగపతి బాబు అంటే ఫ్యామిలీ హీరో. జగ పతి బాబు అన్ని రకాల పాత్రల్ని, సినిమాలను చేశారు. జూలై 17న అందరూ ‘వ దలా’ మూవీని చూసి సక్సెస్ చేయాలని కోరుకుంటున్నాను’ అని అన్నారు.జగపతి బాబు మాట్లాడుతూ ‘వదలా’ లాంటి థ్రిల్లర్ మూవీని చేయడం ఆనందంగా ఉంది. ఇదొక ఫ్యామిలీ ఎమోషనల్ థ్రిల్లర్. ఈ మూవీలో విషయం ఉంది, కంటెంట్ ఉంది అని నమ్మాను. అందుకే ప్రతీ విషయంలో నేను జాగ్రత్తగా తీసుకున్నాను. ఈ ‘వ దలా’ చిత్రాన్ని వదలకుండా నాకోసం చూడండి. ఈ సినిమాకి ఇంకా బిజినెస్ కాలేదు. మా తమ్మారెడ్డి , కిషోర్ ధైర్యంతో ముందు అడుగు వేశారు. అన్నారు.నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ్ మాట్లాడుతూ ‘సినిమా ఇండస్ట్రీలోకి వచ్చి యాభై ఏళ్లు అవుతోంది. ఓ పదేళ్ల క్రితం వైరాగ్యంతో సినీ సన్యాసం తీసుకుంటే.. కిశోర్ గారు మాత్రం ‘వదలా’ అనే సినిమా నిర్మించాల్సిందే అని పట్టు పట్టారు. పన్నెండేళ్ల క్రితం మేకింగ్ ఆపేశాను. ఈ కార్యక్రమంలో నిర్మాత కిషోర్ నాయుడు చిరుమామిళ్ల, ‘రాజు వెడ్స్ రాంబాయి’ నిర్మాత నాగేశ్వర్ రావు, హీరోయిన్ హృతిక శ్రీనివాస్, సంగీత దర్శకుడు కార్తీక్ బి. కొడకండ్ల, కెమెరామెన్ చోటా కె. నాయుడు, గేయ రచయితలు కృష్ణవేణి మల్లవజ్జల, శివకృష్ణాచారి ఎర్రోజు, వీరు గడ్డం పాల్గొన్నారు.

## ‘రోమాంచకం’ కొత్త పోస్టర్ రిలీజ్



సందీప్ రెడ్డి వంగా సమర్పణలో భద్రకాళీ పిక్చర్స్ బ్యానర్ నిర్మిస్తున్న సినిమా ‘రో మాంచకం‘. సుమంత్ ప్రభాస్, అనంతిక సనిల్ కుమార్ జంటగా నటిస్తున్న ఈ చిత్రాన్ని ప్రణయ్ రెడ్డి వంగా నిర్మిస్తు న్నారు. నూతన దర్శకుడు వేణు గోపాల్ రెడ్డి రూపొందిస్తున్నారు. ఇప్పటికే రిలీజ్ చేసిన ‘రోమాం చకం‘ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్, గ్లింప్స్ ఆడియెన్స్ ను అట్రాక్ట్ చేసి మంచి రెస్పాన్స్ తెచ్చుకుం టున్నాయి. ఈ సినిమా సెప్టెం బర్ 3న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవు తోంది. తాజాగా ‘రోమాంచకం‘ సినిమా నుంచి స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు. ‘రోమాంచకం‘ సినిమా సుమంత్ ప్రభాస్ కు మంచి ల్యాండ్ మార్క్ మూవీ కాబోతోందనే అంచనాలు ఏర్పడుతున్నాయి. ఈ సినిమా ప్రేమ, హాస్యం, ఉత్కంఠ కలగలిపి ప్రేక్షకులను ఉర్రూతలూగించేందుకు వస్తోంది. ‘రోమాంచకం‘ సినిమా ఒక ఇంట్రెస్టింగ్ యూత్ ఫుల్ ఎంటర్ టైనర్ గా రూపొందుతోంది. సుమంత్ ప్రభాస్, అనంతిక సనిల్ కుమార్, ఉపేంద్ర లిమయె, వెంకటేష్ కాకుమాను, నరేంద్ర రవి, మణి, సోహన్, తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి డీవోపీ పవన్ పప్పుల, మ్యూజిక్ వాసుకి వైభవ్ అందిస్తున్నారు.

## ‘కరుణామయ’ చిత్రం షూటింగ్ షురూ



బాబీ పిక్చర్స్ మీద ప్రొడక్షన్ నెంబర్. 1గా సంకాబ త్తుల నాగేశ్వరరావు నిర్మిం చనున్న చిత్రం ‘కరుణా మయ’. చైతన్య శక్తి, స్వాతి శ్రీ జంటగా రాబో తోన్న ఈ సినిమాకి హర్ష వర్ధన్ పారెళ్ళ దర్శకత్వం వహించను న్నారు. ఆరాధ్య హైందవి సమర్పణలో ఫ్యామిలీ ఎమోషన్స్‌తో తెరకెక్కుతోంది. ఈ మేరకు నిర్వహిం చిన పూజా కార్యక్రమాలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ప్రముఖ దర్శకులు వి. వి. వినాయక్ , వి.ఎన్ ఆదిత్య గా ముఖ్య అతిథులుగా హాకరై య్యారు.. వారి చేతుల మీదుగా ఈ మూవీని లాంఛనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా నిర్మాత సంకాబత్తుల నాగేశ్వరరావు మాట్లాడుతూ క్రిస్మస్ సందర్భంగా మా సినిమాని ఈ ఏడాది డిసెంబర్ 23న రిలీజ్ చేయాలని అనుకుంటున్నాం అని అన్నారు. దర్శకుడు హర్ష వర్ధన్ పారెళ్ళ మాట్లాడుతూ ‘కుటుంబ కథా చిత్రంగా మా ‘కరు ణామయ’ తెరకెక్కబోతోంది. తండ్రీ కొడుకు నేపథ్యంలో మంచి ఎమోషన్స్‌తో కూడిన కథ గా సినిమా ఉంటుంది. .ఆగస్ట్ నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం అవుతుంది. పగలు రాత్రి అన్న తేడా లేకుండా టీం మొత్తం కష్టపడతాం. డిసెంబర్ 23న మా మూవీని రిలీజ్ చేస్తామ’ని అన్నారు. హీరోగా చైతన్య శక్తి .హీరోయిన్ స్వాతి శ్రీ .నటిస్తున్న ఈ చిత్రానికి సమర్పణ : ఆరాధ్య హైందవి,ఎగ్జి క్యూటివ్ ప్రొడ్యూసర్ : మోనిక.



## 23న వస్తున్న ‘జన నాయకుడు’

తమిళ ముఖ్య మంత్రి విజయ్ హీరోగా నటించిన జన నయగన్ సినిమా తెలుగులో జన నాయకుడు పేరుతో విడుదల కానుంది. తమిళ నాడు ఎన్నికలకు ముందు ఆగిపోయిన ఈ సినిమాను విజయ్ ముఖ్యమంత్రి అయిన తరు వాత విడుదల చేస్తున్నారు. ఇటీవలే సెన్సార్ క్లియరెన్స్ కూడా వచ్చిన నేప థ్యంలో ఈనెల 23వ తేదీన తమిళంలో జననయగన్ సినిమాను విడుదల చేస్తు న్నారు. అదేరోజు తెలుగులో జన నాయకుడు పేరుతో విడుదల కానుంది. వినాథ్ దర్శకత్వంలో తెరకెక్కిన పొలిటికల్ థ్రిల్లర్ సినిమా ఇది. విజయ్ సరసన , మమిత బైజు, పూజ హెగ్డే హీరోయిన్లుగా నటించారు. . కె వి ఎన్ ప్రొడ క్షన్స్ పతాకంపై నిర్మించిన ఈ చిత్రానికి అనిరుద్ సంగీతం అందించారు. టి సిరీస్ సంస్థ ఈ సినిమా పాటలను విడుదల చేసింది. కచ్చితంగా ఈ సినిమా సంచలన విజయం సాధిస్తుందని నిర్మాతలు ఆశాభావం వ్యక్తం చేశారు.

## ‘ఓ. సుకుమారి’ పర్ఫెక్ట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్


హీరో తిరువీర్

యంగ్ హీరో తిరువీర్, హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ విలేజ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ’ఓ. సుకుమారి’తో అలరిం చబోతున్నారు. నూతన దర్శకుడు భరత్ దర్శన్ దర్శకత్వంలో గంగా ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై మహే శ్వర్ రెడ్డి మూలి నిర్మిస్తున్నారు. జులై 17న ఈ సినిమా తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా హీరో తిరువీర్ విలేకరుల తో ‘చిట్ చాట్ ’నిర్వహించారు. ఐశ్వర్య రాజేష్ , నిత్యా మీనన్ లాంటి మంచి నటీమణు లతో పనిచేయడం ఎప్పుడూ ఛాలెంజింగ్గా ఉంటుంది. వాళ్లతో కలిసి పనిచేసినప్పుడు మన నటన కూడా మరింత మెరుగవు తుంది.ఇంతకుముందు ఐశ్వర్యతో ’టక్ జగదీష్’ సినిమాలో పనిచేశాను. కానీ హీరో, హీరోయిన్‌గా కలిసి నటించడం మాత్రం ఈ సినిమాతోనే జరిగింది. ఈ సినిమాలో పనిచేసిన చాలామందితో గతంలోనే కలిసి పనిచే యడం వల్ల సెట్‌లో చాలా కంఫర్ట్‌గా అనిపిం చింది.ఐశ్వర్యతో సీన్స్ చేసేటప్పుడు చాలా విషయాలు చర్చించేవాళ్లం. ఆమె తన అనుభవాలను నాతో పంచుకునేవారు. అది నాకు చాలా ఉపయోగపడింది.మా దర్శకుడు భరత్ దర్శన్ సిద్ధిపేటకు చెందిన వారు. ఈ మధ్యకాలంలో చాలా మంది దర్శకులు తమ ప్రాంతాల కథలు, పాత్రలను చెప్పడానికి ఆసక్తి చూపుతున్నారు. నిజానికి ఇది ఒక అరుదైన పరిస్థితి ఆధారంగా రూపొందించిన కథ. ఇందులోని కాన్సె చాలా కొత్తగా ఉంటుంది.ఇది పూర్తి స్థాయి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. ఎంత నవ్విస్తుందో, అంతే భావోద్వేగానికి గురి చేస్తుంది. మంచి హ్యూమర్‌తో పాటు భావోద్వేగాలు కూడా ప్రేక్షకులను కదిలిస్తాయి. ఒక మంచి కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా అంద రికీ నచ్చుతుంది.నాటకం ఒక ప్రత్యేకమైన ప్రక్రియ. సినిమా మరో ప్రత్యేకమైన మాధ్యమం. నాటకాలు రాసేటప్పుడు ఒక చిన్న కథను తీసుకుని నటీనటులతో కలిసి ఇంప్రొవైజ్ చేసేవాడిని. సినిమా అనేది చాలా పెద్ద బాధ్యత, భారీ వ్యయంతో కూడుకున్నది. ప్రస్తుతం నటనపైనే పూర్తిగా దృష్టి పెట్టాను. ’భగవం తుడు’తో పాటు మరో రెండు సినిమాలు చేస్తున్నాను. అలాగే అమెజాన్ ప్రైమ్ కోసం ఒక వెబ్ సిరీస్ కూడా చేస్తున్నాను.

# విద్యలో రాణించకపోతే క్రీడల్లో రాణించాలి

### గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు లేనందునే ప్రైవేటు వైపు మెగ్గు

### వనపర్తి జిల్లా కొత్తకోటలో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల భవనం ప్రారంభోత్సవంలో సిఎం రేవంత్ రెడ్డి



**ప్రజాపక్షం/వనపర్తి / కొత్తకోట :** గత ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేసిందని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి మండిపడ్డారు. గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు లేకపో వడం కారణంగానే విద్యార్థులు చేరలేదని, అధిక శాతం మంది ప్రైవేటు స్కూళ్ల వైపు మళ్లారని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సర్కారు బడులపై ప్రత్యేక దృష్టిసారించా మని, ఉపాధ్యాయుల సిబ్బంది సమస్యలు పరి ష్కరించామని సిఎం తెలిపారు. విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరాలని, విద్యలో రాణించకపోతే క్రీడల్లో రాణించాల న్నారు. బుధవారం వనపర్తి జిల్లా కోత్తకోట పట్ట ణంలోని రూ.1.77 కోట్ల (సీఎస్ఆర్ నిధులతో) వ్యయంతో నూతనంగా నిర్మించిన జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల భవనాన్ని ప్రారంభిచారు. ఐటి, పరి శ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృ తిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, పశు సంవర్దక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల్ల చిన్నారెడ్డి స్థానిక శాసనసభ్యులు జి.మధుసూదన్‌రెడ్డి తో కలిసి పాఠశాలతో పాటు నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. రూ.1.45 కోట్ల వ్యయంతో 4,500 ఎకరాలకు సాగునీరు అందించేందుకు కురుమూర్తి రాయలిఫ్ట్ ఇరిగేషన్, రూ.92 లక్షల వ్యయంతో 3,100 ఎకరా లకు సాగునీరు అందించే నెల్విడి లిఫ్ట్ ఇరిగేషన్ నిర్వహణ పను లకు శంకుస్థాపన చేశారు. రూ.1.94 కోట్ల వ్యయంతో 4,200 ఎకరాలకు సాగునీరు అందించే సరళ సాగర్ లిఫ్ట్ ఇరిగేషన్ నిర్వహణ పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన ప్రసంగించారు. తమ ప్రభుత్వం చేపట్టిన చర్యలతో ఫర్‌ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్2.0లో దేశం లోనే తెలంగాణ రాష్ట్రానికి 18 స్థానం వచ్చిందన్నారు. గత ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేసిందని ఆయన ఆరోపిం చారు. తాము అధికారంలోకి వచ్చాక పెండింగ్‌లో ఉన్న ఉపా ధ్యాయుల సమస్యలను పరిష్కారించామన్నారు. విద్యార్థులకు తెలంగాణ విద్యా కిట్ కింద 9 వస్తువులు అందించేందుకు నిర్ణయం తీసుకున్నామని సిఎం రేవంత్ రెడ్డి వివరించారు. రూ.1000 కోట్లతో 27,50,000 మంది విద్యార్థులకు ఆగస్టు 15వ తేదీలోపు ఈ కిట్‌ను ఇవ్వనున్నట్లుగా వెల్లడించారు. ఒక్కో విద్యార్థి చదువు కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.1.8లక్షలు ఖర్చు చేస్తుందని వివరించారు. ఒకప్పుడు స్టడీటూర్‌కు ఐఎఎస్‌లు వెళ్లే వారని, ఈ ఏడాది టీచర్లను స్టడీటూర్‌కు సింగపూర్, సౌత్ కొరియా లాంటి దేశాలకు పంపించామని తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ ప్రాంతంతో తనకు ప్రత్యేక అనుబంధం ఉంద న్నారు. ‘ఒక్కో విద్యార్థిపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏడాదికి రూ.1.08లక్షలు ఖర్చు చేస్తోంది. విద్యార్థులు చక్కగా చదువు కుని ఉన్నత స్థాయికి చేరాలి. విద్యలో రాణించకపోతే క్రీడల్లో రాణించాలి. క్రీడాకారులు మహ్మద్ సిరాజ్, నిఖత్ జరీన్‌కు గ్రూప్–1 ఉద్యోగాలు ఇచ్చాం. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న మట్టిలో మాణిక్యాలను వెలికితీయాలి. విద్యార్థులు మైదానా ల్లోనూ పోటీపడాలి. మీ భవిష్యత్‌కు నాదీ హామీ. క్రీడల్లో రాణిం చేవారిని ఉన్నతస్థాయిలో నిలిపే బాధ్యతను తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటుంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఎన్నో ఏళ్లుగా ఉన్న సమస్యలకు పరిష్కారం చూపుతాం’ అని రేవంత్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ పార్ల మెంట్ సభ్యులు మల్లురవి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా ఎస్పీ సునితా రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహ న్‌రెడ్డి, నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుల్ల రాజేష్‌రెడ్డి, షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివ సేన రెడ్డి, ఇతర కార్పొరేషన్ల చైర్మన్లు సరితా తిరుపతయ్య, ఏఐ సీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, కొత్తకోట మున్సిపల్ వైస్ చైర్‌ప ర్సన్ పల్లవి సునీతా , ఇతర ప్రజా ప్రతినిధులు, విద్యాశాఖ అధి కారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొ న్నారు.

**అమరరాజా యూనిట్ ప్రారంభం**

అంతకుముందు మహబూబ్‌నగర్ జిల్లా దివిటిపల్లిలో అమర రాజ సంస్థ చేపట్టిన ’సెల్ మాన్యుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీ యూని ట్’ను సిఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. తెలంగాణ పారిశ్రామిక అభివృద్ధి కోసం గత ప్రభుత్వాలు చేసిన పాలసీలను మరింత మెరుగుపరిచామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. అమ రరాజా సంస్థ మహబూబ్‌నగర్‌లో పెట్టడం ఆ జిల్లా ప్రజలకు గర్వకారణమని రేవంత్ రెడ్డి తెలిపారు. ఆ సంస్థతో పోటీ పడేది దేశంలో ఏదీ లేదన్నారు. చైనాతో పోటీ పడే అమరరాజా సంస్థకు సంపూర్ణంగా సహకరిస్తున్నామని వివరించారు. వికసిత్ భారత్ 2047 కల్లా 3 ట్రిలియన్ డాలర్లకు చేరడమే లక్ష్య మన్న సిఎం, అమర రాజ సంస్థ తన లక్ష్యానికి సహకరిస్తుందని వివరించారు.

## నిరంతర సంప్రదింపులు

(మొదటి పేజీ తరువాయి)



ప్రస్తుతం లైనింగ్ పనులు కొనసాగుతున్నాయని మంత్రి వివరించారు. సీతారామ ప్రాజెక్టుకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూసేకరణ పరి హారాన్ని త్వరగా విడుదల చేయాలని మంత్రి తుమ్మల కోరారు. అశ్వారావుపేట, సత్తుపల్లి ప్రాంతాల్లో ఆయిల్‌పామ్ సాగు ఎక్కువగా ఉన్నం దున సంప్రదాయ కాలువల స్థానంలో పైపుల ద్వారా సాగునీటి సరఫరా (పైప్డ్ ఇరిగేషన్) సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని మంత్రి సూచించారు. సీతారామ ప్రధాన కాలువలో నిలి చిపోయిన జూలూరుపాడు సొరంగం పనులను త్వరగా ప్రారంభించాలని ఈ పనులు పూర్తయితే పాలేరు జలాశయానికి నీటిని అందించే అవ కాశం ఉంటుందన్నారు. తద్వారా ఖమ్మం జిల్లాలో సాగు, తాగునీటి అవసరాలు తీరుతా యని తెలిపారు.

## ‘సుప్రీం’ ఆందోళన

(మొదటి పేజీ తరువాయి)

ఉన్న తీవ్ర అసహనాన్ని గమనించండి’ అని భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం వ్యాఖ్యానిం చింది.అలాగే ఈ కేసు వ్యవహారంలో సొలిసి టర్ జనరల్ తుషార్ మెహతా సహాయాన్ని కోరింది.న్యాయమూర్తులు జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చి, జస్టిస్ వి.మోహనలు కూడా ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ ధర్మాసనం డిజి టల్ మూల్యాంకన ప్రక్రియలో వ్యవస్థాగత మైన, ‘క్రమంగా పెరుగుతోన్న సమస్యలు’ ఉన్నట్లు కనిపిస్తున్నదని పేర్కొంది. ‘మేం మీ సహాయం కోరుతున్నది విరోధ భావంతో కాదు. కొన్ని సమస్యలున్నాయి’ అని జస్టిస్ బాగ్చీ సొలిసిటర్ జనరల్‌తో చెప్పి, కేసు స్థితి గతులపై నివేదిక కోరారు. పిటీషన్‌లో పేర్కొన్న వ్యక్తిగత మార్కెట్ షీట్ వ్యత్యాసాలు చాలా వరకు పరిష్కరించబడినప్పటికీ, ప్రభుత్వం వ్యవస్థాగత సమస్యలను తీవ్రంగా పరిగణిస్తోందని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ధర్మాసనానికి తెలియజేశారు. మూల్యాంకన వ్యవస్థను సమీక్షించి, అవసర మైన వ్యవస్థాగత మార్పులను సిఫార్సు చేయ డానికి ఎస్.రాధా చౌహాన్ నేతృత్వంలో ఏక సభ్య కమిషన్‌ను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. సిబిఎస్ఇ తీసుకుంటున్న చర్యల గురించి తమకు తెలియజేయాలని ధర్మా సనం ఇప్పుడు సొలిసిటర్ జనరల్‌ను కోరింది. కాగా, తదుపరి విచారణ కోసం ఈ విషయాన్ని వచ్చే వారానికి జాబితా చేసింది. న్యాయవాది లక్ష్మీ కాంత్ మాతాదన్ శుక్లా ద్వారా రాకేష్ బింజోలా ఈ ప్రజా ప్రయోజ నాల వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. సిబిఎస్ఇ మూల్యాంకన విధానం ద్వారా సిబిఎస్ఇ బోర్డు పరీక్షలను నిర్వహించడానికి నిబంధన లను రూపొందించాలని, అలాగే అటువంటి సంస్కరణలను పర్యవేక్షించి, అమలు చేయ డానికి ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని, సిబిఎస్ఇని ఆదేశించా లని ఈ పిటిషన్ కోరుతోంది.ఇప్పటికే తాత్కా లిక ప్రవేశాలు పొందిన లేదా ప్రవేశ పరీక్ష లలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు కనీస అర్హత మార్కులలో సడలింపు ఇవ్వాలని, అలాగే వివిధ కోర్సులలో ప్రవేశానికి నిర్దేశించిన 75శాతం లేదా ఇతర కనీస 12వ తరగతి మార్కుల ప్రమాణం నుంచి మినహాయింపు ఇవ్వాలని కూడా పిటిషనర్ సుప్రీంకోర్టు నుంచి ఆదేశాలను కోరారు.

## దారుణ హత్యలు

(మొదటి పేజీ తరువాయి)

వచ్చి ఒక్కసారిగా అతని ఆటోను అడ్డుకున్నారు. ఆటోలో ఉన్న అస్లంపై కత్తులతో విచక్షణారహితంగా దాడికి పాల్ప డ్డారు. అతని మెడ, కడుపు భాగంలో కత్తులతో బలంగా పొడిచి తీవ్రంగా గాయపర్చారు. అక్కడి నుండి క్షణాల్లో పరారయ్యారు. తీవ్ర రక్తస్రావంతో పడిపోయిన యువకు డిని గమనించిన స్థానికులు హుటాహుటిన చికిత్స నిమిత్తం నిర్మల్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. అయితే అత్యవసర విభాగం వైద్యులు పరీక్షించి, అప్పటికే అస్లం మృతి చెందినట్లు ధృవీకరించారు.

**వ్యక్తిగత కారణాలే హత్యకు కారణం :**

అందిన వెంటనే నిర్మల్ డిఎస్‌పి శ్రీనివాస్ పోలీసు బలగాలతో హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని క్లూస్ టీమ్ ద్వారా ఆధారాలు సేకరించారు. ఈ ఘోర హత్యపై జిల్లా ఎస్‌పి డాక్టర్ జి. జానకి షర్మిల ఒక అధికారిక ప్రకటన విడుదల చేశారు. వైఎస్సార్ కాలనీలో జరిగిన ఈ హత్య ఘటన ప్రాథమిక విచారణలో మృతుడి వ్యక్తిగత కారణాల వల్లే జరిగినట్లు గుర్తించామని తెలియజేశారు. ఈ దారుణా నికి ఒడిగట్టి పరారీలో ఉన్న ముగ్గురు నిందితులను పోలీ సులు ఇప్పటికే చాకచక్యంగా గుర్తించారని పేర్కొన్నారు.ఈ కేసు దర్యాప్తును పోలీసులు అత్యంత వేగంగా, అన్ని కోణాల్లో సమగ్రంగా కొనసాగిస్తున్నారని, నిందితులను త్వరలోనే అరెస్ట్ చేసి కేసుకు సంబంధించిన పూర్తి వివరా లను అధికారికంగా వెల్లడిస్తామని ఎస్‌పి జానకి షర్మిల స్పష్టం చేశారు.

**ప్రేమ వ్యవహారానికి అండగా నిలిచాడని మేనమామను దారుణ హత్య**

మంచిర్యాల జిల్లా రెబ్బెన మండలం నారాయణపూర్ గ్రామ శివారులో వేమునూరీ స్వామి అనే కూలీని ఆయన అల్లుళ్లు గొడ్డలితో నరికి దారుణంగా హత్య చేశారు.ప్రేమ వ్యవహా రంపై కుటుంబంలో తలెత్తిన విభేదాల కారణంగానే ఈ హత్య జరిగినట్లు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది. వివరాల్లోకి వెళితే...నారాయణపూర్ గ్రామపంచాయతీ ఎస్‌సి కాలనీకి చెందిన స్వామి తన అన్న కుమారుడు, అక్క కుమార్తె ప్రేమ వ్యవహారానికి అండగా నిలిచాడు. ఈ విష యాన్ని జీర్ణించుకోలేని అక్క కుమారులు కక్ష పెంచుకుని వరుసకు మేనమామ అయిన స్వామిని కల్లు తాగుదామని చెప్పి మంగళవారం రాత్రి ఇంటి నుండి తీసుకువెళ్లారు. గ్రామ శివారుకు చేరుకున్నాక మెడపై గొడ్డలితో నరికి దారు ణంగా హత్య చేశారు. అనంతరం మృతదేహాన్ని పొదల్లో పడవేశారు. మృతుడి భార్య ఇచ్చిన వివరాల ప్రకారం పోలీ సులు కేసు నమోదు చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్లూస్ టీం సహాయంతో పూర్తి వివరాలను రాబడు తున్నారు. మృతుడి శరీరాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నిందితులు ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు సబ్ ఇన్స్‌పెక్టర్ వెంకటకృష్ణ తెలిపారు. ఈ దర్యాప్తులో క్లూస్ టీం సభ్యులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## తక్షణం ఎత్తివేయాలి

(మొదటి పేజీ తరువాయి)

కలిసి పనిచేయడానికి చైనా సిద్ధంగా ఉందని చెప్పారు. క్యూబా ప్రజల జీవనో పాధి హక్కు,అభివృద్ధి హక్కుల ఉల్లంఘ నకు తక్షణం స్వస్తి_చెప్పాలని కోరారు. అంతర్జాతీయ ఏకాభిప్రాయానికి విరు ద్ధంగా అమెరికా ఆంక్షలు విధించిందని విమర్శించారు. అనేక దశాబ్దాలుగా క్యూబాను అణచివేస్తున్న అమెరికా గడ చిన మే నెల నుండి మరిన్ని ఆంక్షలతో ఉక్కుపాదం మోపడాన్ని ఆయన వ్యతిరే కించారు. క్యూబాకు చైనా గట్టి మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. ఆరవైఏళ్ళకు పైగా క్యూబాపై అమెరికా సమగ్ర ఆంక్షలు విధించి ఆ దేశాన్ని అభివృద్ధి చెందనీయకుండా అడ్డుపడుతూ వేధింపు లకు గురిచేస్తోందని అన్నారు.అమెరికాకు 90 మైళ్ళ దూరంలో ఉన్న క్యూబా దీవిపై ఇటీవల ట్రంప్ ప్రభుత్వం తన ఆంక్షల వేధింపులను ఉద్ధృతం చేయడంతో గతంలో లేనివిధంగా క్యూబాలో పరిస్థి తులు,ప్రజల బాధలు అంతర్జాతీయ సమాజం దృష్టిని ఆకర్షించాయని చెప్పారు. అంతర్జాతీయ సమాజం న్యాయ బద్ధమైన పిలుపును దృష్టిలో పెట్టుకుని క్యూబాపై ఆంక్షలు ఎత్తివేయాలని ఆయన కోరారు. అనేక నెలలుగా క్యూబా ప్రజలు విద్యుత్,ఇంధన సరఫరాలు లేకుండా ఘోరమైన పరిస్థితులను ఎదుర్కొంటు న్నారు. సౌరవిద్యుత్ సహా ప్రత్యామ్నాయ మార్గాలను అభివృద్ధి చేయడం ప్రారంభిం చారు. కష్టాలను అనుభవాలుగా మలచు కుని వారు కొత్త జీవనం ప్రారంభించినప్ప టికీ, క్యూబా మాజీ అధ్యక్షుడు, క్యూబా విప్లవ నాయకుడు ఫైడల్ కాస్ట్రో రౌల్ కాస్ట్రోపై హత్యానేరాలు మోపి అమెరికా బ్లాక్‌మెయిల్ చర్యలకు పాల్పడుతోంది. వెనిజులా మాజీ అధ్యక్షుడు నికొలస్ మదురో తరహాలో రౌల్ కాస్ట్రోను కూడా నేరాభియోగాల పేరుతో కిడ్నాప్ చేసి తీసుకు వెళ్ళేందుకు, క్యూబాను లొంగదీ సుకునేందుకు ట్రంప్ సామ్రాజ్యవాద కుట్రలు అమలు చేస్తున్నారు. ఇప్పుడు తాజాగా ఇరాన్ ఇస్లామిక్ ప్రభుత్వం క్షిప ణులు,డ్రోన్లను క్యూబాలో నిల్వచేసిందని, ఈ విషయంపై తాము దర్యాప్తు చేస్తున్నా మని ట్రంప్ తాజా ఆరోపణలు చేయ డంతో చైనా వెంటనే స్పందించింది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com